

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 30-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 195 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 1.16 తదుపరి చతుర్దశి; నక్షత్రం: హస్త రా. 9.43 తదుపరి చిత్త; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 11.35-12.21; అమృతఘడియలు: మ. 2.55-4.44; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.40 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శతక్కొట్టిన మంధాన

అదరగొట్టిన హర్మన్ | మూడో వన్డేలో కివీస్‌పై విజయం

2-1తో భారత మహిళలదే సిరీస్





స్మృతి మంధాన (100)

అహ్మదాబాద్: వరుస వైఫల్యాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన (122 బంతుల్లో 10 ఫోర్లతో 100)తోపాటు హర్మన్‌ప్రీత్ కౌర్ (59 నాటౌట్) విజృంభించడంతో.. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 2-1తో సొంతం చేసుకొంది. మంగళవారం జరిగిన సిరీస్ నిర్ణాయక ఆఖరి, మూడో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో కివీస్‌ను ఓడించింది. 233 పరుగుల లక్ష్యాన్ని భారత్ 44.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (12)ను హనా రో (2/47) స్వల్ప స్కోరుకే అవుట్ చేయడంతో.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మంధాన జట్టు బాధ్యతలను భుజాన వేసుకొంది. వన్‌డౌన్ బ్యాటర్ యాస్తిక భాటియా (35) చక్కని సహకారం అందించింది. అయితే, యాస్తికను డివైన్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో.. రెండో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో కలసి మంధాన దూకుడుగా ఆడుతూ మూడో వికెట్‌కు 118 పరుగులు జోడించడంతో జట్టు విజయం దిశగా దూసుకెళ్లింది. సెంచరీ పూర్తి చేసుకొన్న మంధానాను రో బౌల్డ్ చేసినా.. తుదికంటా క్రీజులో నిలిచిన హర్మన్ మరో 34 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించేసింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న న్యూజిలాండ్ 49.5 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌటైంది. బ్రూక్ హాలిడే (86) అర్ధ శతకంతో పోరాడింది. దీప్తి శర్మ 3 వికెట్లు, ప్రియా మిశ్రా 2 వికెట్లు పడగొట్టారు. ఫీల్డ్‌లో అప్రమత్తంగా వ్యవహరించిన జెమీమా రెండు రనౌట్లు చేయడం విశేషం. సుజీ బేట్స్ (4), లారెన్ డౌన్ (1), కెప్టెన్ సోఫీ డివైన్ (9), జార్జియా ప్లిమ్మర్ (39), మ్యాడీ గ్రీన్ (15) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో కివీస్ 88/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఇసబెల్ (25)తో కలసి ఆరో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టిన బ్రూక్.. రో (11)తో కలసి ఏడో వికెట్‌కు 47 పరుగులతో టీమ్ స్కోరును రెండు వందల పరుగుల వద్దకు చేర్చింది. బ్రూక్‌ను దీప్తి క్యాచౌట్ చేసినా.. ఆఖర్లో తహూహు (24 నాటౌట్) ధాటిగా ఆడడంతో జట్టు మెరుగైన స్కోరు చేసింది.

8 వన్డేల్లో అత్యధికంగా 8 సెంచరీలు సాధించిన భారత మహిళా బ్యాటర్‌గా మంధాన. మిథాలీ 7 శతకాల రికార్డును స్మృతి అధిగమించింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 49.5 ఓవర్లలో 232 ఆలౌట్ (బ్రూక్ 86, ప్లిమ్మర్ 39; దీప్తి 3/39, ప్రియ 2/41);

భారత్: 44.2 ఓవర్లలో 236/4 (స్మృతీ మంధాన 100, హర్మన్ 59 నాటౌట్; రో 2/47).

ఆంధ్ర ఇన్నింగ్స్ ఓటమి

హిమాచల్‌తో రంజీ

విశాఖపట్నం: తాజా రంజీ సీజన్‌లో ఆంధ్రకు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. హిమాచల్‌తో విశాఖపట్నంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో గలేటియా (5/49), మయాంక్ డాగర్ (4/23) చెలరేగడంతో.. ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో చిత్తయింది. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 478/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హిమాచల్ 500 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 344 పరు గులు చేసిన ఆంధ్రకంటే 156 పరుగుల ఆధిక్యం సా.ధించింది. శశికాంత్ 5, సత్యనారాయణ రాజు 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 32.1 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. రషీద్ (34), విహారి (20) స్వల్ప స్కోర్లకే వెనుదిరగ్గా..భరత్ (0) డకౌటయ్యాడు. మరో మ్యాచ్‌లో పుదుచ్చేరిపై హైదరాబాద్ ఇన్నింగ్స్ తేడాతో గెలిచింది.

వేడ్ రిటైర్మెంట్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా జట్టు వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2011లో అరంగేట్రం చేసిన వేడ్ ఈ ఏడాది టీ20 వరల్డ్‌కప్‌లో చివరిసారి ఆడాడు. అయితే ఆటగాడిగా వైదొలిగినా.. ఆసీస్ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా మారనున్నాడు. వచ్చే నెలలో పాకిస్థాన్‌తో జరగబోయే టీ20, వన్డే సిరీస్‌లకు అతను వికెట్ కీపింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా కొత్త బాధ్యతలు తీసుకోనున్నాడు. అయితే మరో రెండేళ్ల పాటు టాస్మేనియా తరపున దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతానని 36 ఏళ్ల వేడ్ ప్రకటించాడు. అలాగే ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

విరాట్ నన్ను బ్లాక్ చేశాడు..

మ్యాక్స్‌వెల్



మెల్‌బోర్న్: గ్లెన్ మ్యాక్స్‌వెల్.. విరాట్ కోహ్లీ మధ్య చక్కటి స్నేహబంధం ఉంది. ఐపీఎల్‌లో ఇద్దరూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడే విషయం తెలిసిందే. అయితే గతంలో వీరి మధ్య అంతగా సత్సంబంధాలు లేవు. ఓసారైతే సోషల్ మీడియాలో మ్యాక్సీని విరాట్ బ్లాక్ కూడా చేశాడట. ఇన్‌స్టాలో కోహ్లీని ఫాలో అవుదామనుకున్నప్పుడు తనను బ్లాక్ చేసిన విషయం తెలిసిందని మాక్సీ చెప్పాడు. భారత్‌లో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో విరాట్ రాంచీ టెస్టులో భుజం నొప్పితో బాధపడ్డాడు. ఆ సమయంలో విరాట్ ఏం చేశాడో.. దాన్నే అనుకరిస్తూ మ్యాక్స్ తన కుడి భుజంపై చేయి వేస్తూ నొప్పిని భరిస్తున్నట్టు నటించాడు. ఆ కోపంతో కోహ్లీ బ్లాక్ చేశాడట.

బాలన్ డీ ఓర్ విజేతలు రోడ్రి, బొన్మాంటి



పారిస్: ప్రతి ఏటా ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్లేయర్లకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక బాలన్ డీ ఓర్ అవార్డు ఈసారి స్పెయిన్‌ను వరించింది. ఆ దేశానికి చెందిన మిడ్‌ఫీల్డర్లు రోడ్రి (మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్), ఐతానా బొన్మాంటి (బార్సిలోనా క్లబ్) పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు. 28 ఏళ్ల రోడ్రి తొలిసారి ఈ అవార్డును అందుకోగా.. 26 ఏళ్ల బొన్మాంటికిది వరుసగా రెండో పురస్కారం. కాగా పురుషుల విభాగంలో ఈ అవార్డును మెస్సీ 8 సార్లు, క్రిస్టియానో రొనాల్డో ఐదుసార్లు గెల్చుకున్నారు.

హర్షిత్ రాణాకు పిలుపు



ముంబై: న్యూజిలాండ్‌తో చివరిదైన మూడో టెస్టు కోసం పేసర్ హర్షిత్ రాణాను ఎంపిక చేశారు. ఇప్పటికే భారత జట్టు రెండు టెస్టులను కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో 18 వరుస టెస్టు సిరీస్‌ల విజయాలకు కూడా బ్రేక్ పడినట్టయ్యింది. ఇటీవల రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఢిల్లీ పేసర్ హర్షిత్ అసోంపై ఏడు వికెట్లతో పాటు అర్ధసెంచరీతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. బుధవారం అతను జట్టులో చేరనున్నాడు. అలాగే శుక్రవారం నుంచి జరిగే ఆఖరి టెస్టు తుది జట్టులో బుమ్రాకు విశ్రాంతినిచ్చి రాణాకు చోటు కల్పించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ముంబై టెస్టుకూ కేన్ దూరం: న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ భారత్‌తో చివరి టెస్టుకు కూడా దూరమయ్యాడు. శ్రీలంక టూర్‌లో గాయపడిన కేన్ స్వదేశంలో కోలుకుంటున్నాడు. అయితే రాబోయే ఇంగ్లండ్‌తో సిరీస్‌కు పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడని కివీస్ కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపాడు.



అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్స్!

ముఖ్యమంత్రి చంద్రబాబుతో కపిల్ దేవ్ భేటీ

అనంత, విశాఖలో ప్రీమియర్ గోల్ఫ్ క్లబ్‌ల ఏర్పాటుపై చర్చ

ఏపీని క్రీడా నైపుణ్య హబ్‌గా మారుస్తాం: సీఎం

విజయవాడ/అమరావతి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో ఉన్న ప్రభుత్వం ఆ దిశగా మరింత ముందంజ వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అమరావతి, అనంతపురం, విశాఖపట్నంలో గోల్ఫ్ కోర్సు క్లబ్‌లు ఏర్పాటు చేసే అవకాశముంది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్ దేవ్, ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో కలిశారు. ఈ భేటీలో గోల్ఫ్ కోర్సు క్లబ్‌ల ఏర్పాటు సహా వివిధ అంశాలపై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు క్లబ్, విశాఖపట్నం, అనంతపురంలో ప్రీమియర్ గోల్ఫ్ కోర్సు క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్టు శివనాథ్ తెలిపారు. రాష్ట్రంలో చాలా మంది యువతకు గోల్ఫ్‌పై ఆసక్తి ఉన్నా సరైన సదుపాయాలు లేవన్నారు. వారి కోసం డ్రైవింగ్ రేంజ్‌లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రెండేళ్లలో గోల్ఫ్ కోర్సులను పూర్తి చేస్తామన్నారు. అనంతరం కపిల్ మాట్లాడుతూ.. 'ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారు. గోల్ఫ్ కోర్సుల ఏర్పాటు గురించి ఆయనతో చర్చించా. స్థలం ఎక్కడ ఇస్తారన్నది ప్రభుత్వ నిర్ణయం. అయితే, అమరావతిలోని స్పోర్ట్స్ సిటీలో ఇస్తే మరింత సంతోషిస్తా' అని అన్నారు. కాగా, రాష్ట్రానికి స్పోర్ట్స్ అంబాసిడర్‌గా ఉండాలని కపిల్‌ను కోరినట్టు శివనాథ్ వెల్లడించారు. మంగళగిరి, విశాఖపట్నం స్టేడియాలను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతామనీ, వీటి నిర్మాణంలో కపిల్‌దేవ్ సలహాలు, సూచనలు తీసుకోనున్నట్టు తెలిపారు.

క్రీడా దిగ్గజాలతో కలిసి పని చేస్తాం: సీఎం

ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా నైపుణ్య హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కపిల్ దేవ్‌లాంటి ప్రముఖులతో కలిసి పని చేసే అవకాశం కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. కపిల్‌తో భేటీపై వివరాలను సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పంచుకున్నారు. 'క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా చైర్మన్ కపిల్ దేవ్, అతని బృందంతో భేటీ కావడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో క్రీడారంగ విస్తరణలో భాగంగా అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు క్లబ్, అనంతపురం, విశాఖపట్నంలో ప్రీమియర్ గోల్ఫ్ కోర్సు క్లోబ్‌ల ఏర్పాటుపై చర్చించాం. యువతలో గోల్ఫ్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు, వారికి మరిన్ని అవకాశాలు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఏపీని క్రీడా నైపుణ్యానికి నిజమైన హబ్‌గా మార్చేందుకు క్రీడా దిగ్గజాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఒక్క షేరు రూ.2.36 లక్షలు

జెట్ స్పీడ్‌లో దూసుకుపోయిన ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్టాక్

- దేశీయ స్టాక్ మార్కెట్లో సరికొత్త రికార్డు
- రూ.లక్ష పెట్టుబడితో రూ.670 కోట్ల రిటర్నులు



ముంబై: అదో బుల్లి (మైక్రో క్యాప్) కంపెనీ. పేరు ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్. బీఎస్ఈలో మాత్రమే ఈ కంపెనీ షేరు అతి అరుదుగా అది కూడా అతి తక్కువ స్థాయిలో ట్రేడయ్యేవి. అలాంటి ఈ కంపెనీ షేరు ధర మంగళవారం అమాంతం ఎంఆర్ఎఫ్ కంపెనీ షేరు ధరను మించిపోయి సరికొత్త రికార్డు సృష్టించింది. నిన్న మొన్నటి వరకు బీఎస్ఈలో ఎల్సిడ్ షేరు రూ.3.6 కంటే దిగువనే ట్రేడయ్యేవి. సోమవారం కూడా రూ.3.53 వద్ద ముగిసింది. మంగళవారం ఒక్కసారిగా రేసుగుర్రంలా పరుగెత్తి రూ.2,36,250 వద్ద ముగిశాయి. అంటే సోమవారం రూ.3.53 వద్ద రూ.లక్ష పెట్టుబడితో ఈ కంపెనీ షేర్లు కొన్న మదుపరుల సంపద.. ఒక్కరోజు తిరిగే సరికి 66,92,535 శాతం లాభంతో రూ.670 కోట్లకు చేరింది. ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్లో ఇంత భారీ ధర వద్ద మరే లిస్టెడ్ కంపెనీ షేరు ట్రేడవడం లేదు. ఇప్పటి వరకు ఈ రికార్డును సొంతం చేసుకున్న ఎంఆర్ఎఫ్ కంపెనీ షేరు కూడా మంగళవారం డీలా పడి బీఎస్ఈలో రూ.1,22,576.5 వద్ద క్లోజైంది.

ఇదీ కథ: ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఒక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ. స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ కంపెనీ షేరును అల్లా టప్పా (పెన్నీ) స్టాక్‌గా ప్రకటించాయి. ప్రస్తుతం ఈ కంపెనీ చేస్తున్న వ్యాపారమంటూ ఏమీ లేదు. అయితే ఏషియన్ పెయింట్స్‌తో పాటు అనేక ఫ్రంట్‌లైన్ కంపెనీల షేర్లలో ఈ కంపెనీకి పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఉన్నాయి. వాటి విలువే రూ.11,000 కోట్ల వరకు ఉంటుంది. దీంతో రూ.10 ముఖ విలువ ఉన్న ఈ కంపెనీ షేరు బుక్ వాల్యూ ప్రస్తుతం రూ.5,84,225గా ఉంది. బుక్ వాల్యూకి, మార్కెట్ ధరకు ఏ మాత్రం పొంతన లేదు. దీంతో ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ కంపెనీల షేర్ల అసలు ధర కనుక్కునేందుకు 'స్పెషల్ కాల్ ఆక్షన్' పద్ధతిలో వేలం నిర్వహించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ ఏడాది జూన్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలను కోరింది. అందుకు అనుగుణంగా బీఎస్ఈ మంగళవారం ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీ షేర్లలో ప్రత్యేక కాల్ ఆక్షన్ నిర్వహించింది. దీంతో ఈ కంపెనీ షేర్ల ధర రాకెట్ వేగంతో దూసుకుపోయాయి.

ఇంకా తక్కువే

అయితే ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ షేరు ప్రస్తుత మార్కెట్ ధరకు, బుక్ వాల్యూకీ ఇప్పటికీ ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. బుక్ వాల్యూ రూ.5,84,225 ఉంటే.. మార్కెట్ ధర రూ.2,36,250 మాత్రమే. గత రెండు వారాల్లో ట్రేడైన సగటు షేర్ల పరిమాణం కూడా 377 మించలేదు. ప్రత్యేక కాల్ ఆక్షన్ జరిగిన మంగళవారం నాడు కేవలం 279 షేర్లు మాత్రమే చేతులు మారాయి. ప్రస్తుతం కంపెనీ మొత్తం ఈక్విటీ (42,41,143 షేర్లు)లో 72.23 శాతం ప్రజల (పబ్లిక్) వద్ద ఉండగా 27.77 శాతం వాటా మాత్రమే ప్రమోటర్ల వద్ద ఉంది. అయినా ట్రేడింగ్ జరిగిన, జరుగుతున్న షేర్ల పరిమాణం అతి తక్కువ స్థాయిలోనే ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బహుశా ప్రమోటర్లు లేదా వారి కనుసన్నల్లో పనిచేసే బ్రోకర్లు ఈ కౌంటర్‌ను ఆపరేట్ చేస్తున్నారేమో అనే గుసగుసలూ వినిపిస్తున్నాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రైస్ టు బుక్ వాల్యూ ధర ఆకర్షణీయంగా ఉందని మురిసిపోయి, ఏ మాత్రం లిక్విడిటీ లేని ఈ కంపెనీ షేర్లలో పెట్టుబడి పెట్టడం ఏ మాత్రం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రెండో రోజూ లాభాలే

దేశీయ స్టాక్ మార్కెట్లో వరుసగా రెండో రోజూ రిలీఫ్ ర్యాలీ కొనసాగింది. ఆరంభంలో నష్టాలతో ప్రారంభమైన మార్కెట్ మధ్యాహ్నం నుంచి కోలుకుంది. చివరికి సెన్సెక్స్ 363.99 పాయింట్ల లాభంతో 80,369.03 వద్ద, నిఫ్టీ 127.70 పాయింట్ల లాభంతో 24,466.85 వద్ద క్లోజయ్యాయి. బ్యాంకింగ్, ఆయిల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు మంగళవారం సూచీలను లాభాల బాట నడిపించాయి.



ధనత్రయోదశికి పసిడి డీలా

విక్రయాల్లో 10% తగ్గుదల!?

అధిక ధరలే ప్రధాన కారణం

న్యూఢిల్లీ: ధనత్రయోదశి పర్వదినాన బంగారం, వెండి వంటి విలువైన లోహాలు లేదా లోహ పాత్రలు కొనుగోలు చేయడం హిందువులకు సంప్రదాయంగా వస్తోంది. అయితే, ఈ ధనత్రయోదశికి పసిడి విక్రయాలు అంతంత మాత్రంగానే నమోదైనట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. బులియన్ ధరలు రికార్డు స్థాయికి ఎగబాకడమే ఇందుకు కారణం. గత ఏడాదితో పోలిస్తే, ఈసారి ధంతేరస్ పసిడి విక్రయాల పరిమాణం (వాల్యూమ్) 10 శాతం తగ్గి ఉండవచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ సయం మెహ్రా అంచనా వేశారు. విక్రయాల విలువ మాత్రం 20 శాతం వరకు పెరిగి ఉండవచ్చన్నారు. ఎందుకంటే, గడిచిన ఏడాది కాలంలో పసిడి ధర 33 శాతం పెరిగింది. గత ధనత్రయోదశి నాడు (2023 నవంబరు 11) ఢిల్లీ మార్కెట్లో రూ.61,200గా ఉన్న 10 గ్రాముల పసిడి (24 క్యారెట్లు) రేటు.. ఈ సారి పండగ రోజున (మంగళవారం) రూ.81,400 పలికింది. కిలో వెండి సైతం రూ.74,000 నుంచి రూ.99,700 స్థాయికి (35 శాతం వృద్ధి) ఎగబాకింది. ఈసారి ధనత్రయోదశి మంగళవారం ప్రారంభమై బుధవారం మధ్యాహ్నం 1.11 గంటల వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం మరిన్ని విక్రయాలు జరగవచ్చని ఆభరణ వర్తకులు ఆశావహంగా ఉన్నారు. ధర బాగా పెరగడంతో చాలమంది కస్టమర్లు తక్కువ బరువున్న చైన్లు, చెవి దిద్దులు, బ్రేస్‌లెట్ కొనుగోలు చేసినట్లు మెహ్రా చెప్పారు.

రూ.10తో పసిడిలో పెట్టుబడి

జియో ఫైనాన్స్ యాప్ స్మార్ట్ గోల్డ్ ఆఫర్

తులం బంగారం రూ.81,000కు చేరిన తరుణంలోనూ కేవలం పది రూపాయలతో బంగారం కొనుగోలు చేయొచ్చు. ఎలాగంటారా..? జియో ఫైనాన్స్ యాప్ స్మార్ట్‌గా గోల్డ్‌లో పెట్టుబడి పెట్టే వీలు కల్పిస్తోంది. తమ యాప్ ద్వారా భద్రంగా, అవాంతరాల్లేకుండా డిజిటల్ రూపంలో బంగారాన్ని అతి తక్కువ మొత్తంలో (రూపాయల్లో లేదా గ్రాముల్లో) కొనుగోలు చేయవచ్చని జియో ఫైనాన్స్ యాప్ వెల్లడించింది. తిరిగి ఆ పెట్టుబడిని నగదు, గోల్డ్ కాయిన్ లేదా స్వర్ణాభరణం రూపంలో ఉపసంహరించుకునే వీలుంటుందని తెలిపింది. అంతే కాదు, యాప్ ద్వారా గోల్డ్ కాయిన్‌ను ఆర్డర్ చేసి, ఇంటి వద్దకు డెలివరీ పొందే సౌకర్యాన్నీ కల్పిస్తోంది.

6 నెలల్లో రూ.50,400 కోట్లు

మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ ఎగుమతుల్లో 33 % వృద్ధి

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరుతో ముగిసిన 6 నెలల్లో యాపిల్ 600 కోట్ల డాలర్ల (రూ.50,400 కోట్లు) విలువైన మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లను ఎగుమతి చేసింది. గత ఏడాదిలో ఇదే కాలంతో పోలిస్తే ఎగుమతులు 33 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ ఎగుమతులు 1,000 కోట్ల డాలర్ల స్థాయిని సునాయసంగా దాటే అవకాశం ఉంది. చైనాపై ఆధారపడటం తగ్గించి భారత్‌లో ఉత్పత్తి పెంచడంపై యాపిల్ దృష్టి సారించడం ఇందుకు దోహదపడింది. యాపిల్‌కు భారత్‌లో కీలక సరఫరాదారులైన ఫాక్స్‌కాన్ టెక్నాలజీ, పెగట్రాన్ కార్ప్, టాటా ఎలక్ట్రానిక్స్ తమ అసెంబ్లింగ్ యూనిట్ల ద్వారా సామర్థ్య విస్తరణకు తోడ్పడుతున్నాయని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,450 ▲	73,750 ▲	1,06,900 ▼
ముంబై	78,745 ▲	72,130 ▲	97,873 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ



హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	123	విజయవాడ	120
వరంగల్	123	గుంటూరు	123
కరీంనగర్	123	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	123	చిత్తూరు	126
కర్నూలు	123	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	120		

బిజినెస్

18 % తగ్గిన మారుతి లాభం

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) లాభం 18 శాతం క్షీణించి రూ.3,102 కోట్లకే పరిమితమైంది. ఇండెక్సేషన్ ప్రయోజనాలు ఉపసంహరించడంతో అధిక ప్రొవిజనింగ్ చేయాల్సి రావడం, దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల పన్నులో చేసిన మార్పులే ఈ క్షీణతకు కారణమని తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,786 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.37,339 కోట్ల నుంచి రూ.37,449 కోట్లకు చేరింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన లాభం రూ.3,716 కోట్ల నుంచి రూ.3,069 కోట్లకు తగ్గింది. త్రైమాసికంలో కంపెనీ నికరంగా రూ.35,589 కోట్ల విలువ గల కార్లు విక్రయించింది.

ఎంటార్ టెక్ లాభం 19 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎంటార్ టెక్నాలజీస్ రూ.190.20 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.18.8 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 48.3 శాతం వృద్ధి చెందగా లాభం 324 శాతం పెరిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో అంచనాలకు తగ్గట్టుగానే కంపెనీ పనితీరును కనబరిచామని, రానున్న త్రైమాసికాల్లో ఇదే జోరును కనబరచవచ్చని భావిస్తున్నట్లు ఎంటార్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

జియో పేమెంట్ సొల్యూషన్స్‌కు ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సు

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన ఎన్‌బీఎఫ్‌సీ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో పేమెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ (జేపీఎస్ఎల్)కు ఆర్‌బీఐ నుంచి ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సు లభించింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007లోని సెక్షన్ 7 ప్రకారంగా జేపీఎస్ఎల్‌కు ఈనెల 28 నుంచి అమలులోకి వచ్చేలా ఆర్‌బీఐ లైసెన్సు మంజూరు చేసిందని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ మంగళవారం వెల్లడించింది.

కెనరా బ్యాంక్ లాభం రూ.4,015 కోట్లు

- క్యూ2 లాభంలో 11 శాతం వృద్ధి
- మొత్తం ఆదాయం రూ.34,721 కోట్లుగా నమోదు



బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికాని(క్యూ2)కిగాను నికర లాభం 11 శాతం వృద్ధి చెంది రూ.4,015 కోట్లుగా నమోదైందని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు వెల్లడించారు. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ నికర లాభం రూ.3,606 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.31,742 కోట్ల నుంచి రూ.34,721 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.26,838 కోట్ల నుంచి రూ.29,740 కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు. కాగా సెప్టెంబరు ముగిసే నాటికి బ్యాంక్ గ్లోబల్ వ్యాపారం 9.42 శాతం వృద్ధి చెంది రూ.23,59,344 కోట్లకు చేరిందన్నారు. అలాగే మొత్తం డిపాజిట్లు 9.34 శాతం పెరిగి రూ.13,47,347 కోట్లకు, మొత్తం అడ్వాన్సులు 9.53 శాతం వృద్ధితో రూ.10,11,997 కోట్లకు చేరుకున్నాయన్నారు. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.3,798 కోట్ల నుంచి రూ.4,188 కోట్లకు పెరిగింది.

తగ్గిన మొండి బకాయిలు

సెప్టెంబరు త్రైమాసికంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.76 శాతం నుంచి 3.73 శాతానికి తగ్గినట్లు సత్యనారాయణ రాజు వెల్లడించారు. నికర ఎన్‌పీఏలు కూడా 1.41 శాతం నుంచి 0.99 శాతానికి తగ్గాయి. కాగా ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 90.89 శాతంగా ఉంది. క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) 16.20 శాతం నుంచి 16.57 శాతానికి పెరిగింది.

త్వరలో కెనరా రొబేకో ఐపీఓకి అనుమతి

మ్యూచువల్ ఫండ్ సంస్థ కెనరా రొబేకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ).. పబ్లిక్ ఇష్యూకి త్వరలో ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి లభించే అవకాశం ఉందని బ్యాంక్ సీఈఓ, ఎండీ సత్యనారాయణ రాజు తెలిపారు. ఇప్పటికే ఈ ఐపీఓ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) ప్రక్రియ పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. వచ్చే పదిహేను రోజుల్లో ఆర్థిక సేవల శాఖ నుంచి ఈ ఇష్యూకి అనుమతి రావచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కెనరా రొబేకో ఏఎంసీలో కెనరా బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉంది. ఐపీఓ ద్వారా బ్యాంక్ 13 శాతం వాటాలను విక్రయించాలని భావిస్తోంది.

4,14,20,935
రాష్ట్ర ఓటర్ల సంఖ్య ఇది
ముసాయిదా జాబితా-2025 విడుదల
మహిళా ఓటర్లదే పైచేయి 2
9 నెలల్లో పెరిగిన 3.4 లక్షల మంది
పురుష ఓటర్ల పెరుగుదల 2.73 లక్షలే
నవంబరు 28 వరకు అభ్యంతరాల స్వీకరణ

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 30-10-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

అమ్మ.. ఆవేదన!

అవన్నీ కుటుంబ ఆస్తులే.. షర్మిలకూ ఇవ్వాలి

గిఫ్టుగా కాదు.. అది జగన్ బాధ్యత.. విజయలక్ష్మి బహిరంగ లేఖ

బిడ్డల మధ్య వివాదంపై స్పందన.. షర్మిలకు జగన్ అన్యాయంపై ఆక్రోశం


తల్లి.. తల్లడిల్లి

- వైవీ, సాయిరెడ్డి అబద్ధాలు చెబుతున్నారు
- షర్మిలకు ఇప్పటిదాకా ఆస్తులు పంచివ్వలేదు
- వైఎస్ ఉండగా కొన్ని ఆస్తులు ఇద్దరి పేరిట పెట్టాం
- ఇది షర్మిలకు ఆస్తులు పంచి ఇచ్చినట్టు కాదు
- విడిపోదామని 2019లో జగనే చెప్పారు
- ఎంవోయూ కూడా రాసిచ్చారు
- తక్షణం ఇస్తామన్నవీ ఇప్పటికీ ఇవ్వలేదు
- వ్యాపారాల్లోకి షర్మిలను రానివ్వలేదు
- అయినా నిస్వార్థంగా జగన్ కోసం కష్టపడింది
- ఇకనైనా అసత్య ప్రచారం ఆపండి
- బహిరంగ లేఖలో విజయలక్ష్మి వినతి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'తల్లిదండ్రులకు పిల్లలంతా సమానమే! కానీ... ఒక బిడ్డ మరో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం. అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడటం తల్లిగా నా విధి. నా ధర్మం'.. అని వైఎస్ జగన్మోహన్ రెడ్డి, షర్మిల తల్లి విజయలక్ష్మి పేర్కొన్నారు. అన్నా చెల్లెలి మధ్య కొన్నేళ్లుగా అంతర్గతంగా, కొన్నాళ్లుగా బహిరంగంగా సాగుతున్న వివాదంపై తల్లి విజయలక్ష్మి తొలిసారిగా తన భావాలను అందరితో పంచుకున్నారు. 'వైఎస్ రాజశేఖర రెడ్డిని అభిమానించే వారికి..' అంటూ మంగళవారం 3 పేజీల బహిరంగ లేఖ రాశారు. తమ కుటుంబ ఆస్తులకు సంబంధించి వైఎస్ అంతరంగం, ఆదేశాలతోపాటు తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. షర్మిలకు జగన్ అన్యాయం చేస్తున్నారని స్పష్టం చేశారు. జగన్ తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఆడిటర్‌గా విజయసాయి రెడ్డి, ఇంటి బంధువుగా వైవీ సుబ్బారెడ్డికి అన్నీ తెలిసీ ఇలా మాట్లాడటం బాధాకరమన్నారు. 'ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు' అని హెచ్చరించారు. ఇప్పటికీ తాను స్పందించకపోతే ఈ వివాదం, అసత్యాల పరంపర కొనసాగుతుందని... అందుకే ఈ లేఖ రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

● తల్లి మనసు...

తమ తండ్రి వైఎస్ జీవించి ఉండగా ఉన్న కుటుంబ ఆస్తులన్నింటినీ సమానంగా పంచాలన్నది ఆయన ఆదేశమని

మిగతా 13వ పేజీలో...



జరగకూడనివన్నీ నా కళ్ల ముందే
జరుగుతున్నాయ్

విజయలక్ష్మి లేఖ పూర్తి పాఠం

రాజశేఖర్‌రెడ్డి గారు ప్రేమించే ప్రతి హృదయానికి, ఈ కుటుంబాన్ని ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రతి ఒక్కరికీ మీ విజయమ్మ చేస్తున్న అభ్యర్థన..

ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే మనసుకు చాలా చాలా బాధేస్తోంది. ఇంటి గుట్టు.. వ్యాధి రట్టు. తెరిచిన పుస్తకం అని రాజశేఖర్ రెడ్డి గారు ఎప్పుడూ

మిగతా 13వ పేజీలో...

Bharathi CEMENT


'భారతి' కొంగు బంగారమే!

- రఘురామ్ నుంచి భారతిగా మారగానే
- పెట్టుబడులతో దిగ్గజ కంపెనీల బారులు
- 2010లో సిమెంట్ రంగం తిరోగమనం
- అదే ఏడాది భారతిలో 51శాతం
- వాటాలను భారీ విలువకు కొన్న వికాట్
- జగన్ ప్రమోటరుగా 2006లో ప్రారంభం
- ఆయనకు ఉన్న 82% వాటా విలువ 45 కోట్లు
- అందులో 51 శాతం వాటాకు
- వికాట్ చెల్లించింది రూ.415 కోట్లు
- నాడు మార్కెట్ విలువ ఏకంగా 2,300 కోట్లు
- జగన్‌కు ఈ డీల్ నిజంగానే జాక్‌పాట్
- దాల్మియా, ఇండియా సిమెంట్స్‌దీ ఇదే దారి
- తండ్రి వైఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని
- ఆ ఏడేళ్లు సాగిన జగన్మాయలెన్నెన్నో..



ప్రత్యేక కథనం 13లో

వివేకా హత్య కేసును నీరుగార్చే కుట్ర!



- పలుకుబడి కలిగిన వ్యక్తులు
- తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు
- అజేయ కల్లం అలా ప్రభావితమయ్యే
- తన స్టేట్‌మెంట్ తొలగించాలన్నారు
- నిందితులను విడుదల చేస్తే
- సాక్ష్యాలు తారుమారు 13
- ఉమాశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌లో
- సునీతారెడ్డి, సీబీఐ వాదనలు
- సమీప భవిష్యత్‌లో ట్రయల్ మొదలయ్యే
- సూచనలు కనిపించడం లేదు
- టీ-హైకోర్టు కీలక వ్యాఖ్య.. తీర్పు రిజర్వు


ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన కపిల్‌దేవ్

అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ క్లబ్!

- సీఎం చంద్రబాబుతో కపిల్ దేవ్ భేటీ
- అనంత, విశాఖలో
- ప్రీమియర్ గోల్ఫ్ క్లబ్‌ల ఏర్పాటుపై చర్చ
- ఏపీని క్రీడా నైపుణ్య హబ్‌గా చేస్తాం: చంద్రబాబు

స్పోర్ట్స్‌లో..

బీమా చేయిస్తే... ఏజెంట్‌కు కమీషన్ వస్తుంది. బీమా కంపెనీకి 'ప్రీమియం' రూపంలో ఆదాయం దక్కుతుంది. ఈ కమీషన్ కోసం నానా కక్కుర్తి పడ్డారు! సొంతంగా బ్రోకరేజ్ ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. వందలకోట్ల ప్రీమియంపై పదులకోట్ల 'కమీషన్'ను నొక్కేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక చక్రం తిప్పింది ఒకే ఒక్కడు! గత ప్రభుత్వ హయాంలో పెద్దల ఆశీర్వాదంతో రంగంలోకి దిగి... ఇప్పటికీ పలు శాఖలకు 'సేవలు' అందిస్తున్నాడు!

చేనేత బీమా, వైఎస్సార్ బీమా (ఇప్పుడు చంద్రన్న బీమా), పశు బీమా వంటి పథకాలతోపాటు... కొన్ని ప్రభుత్వ కార్పొరేషన్ల ఆస్తులు, సిబ్బందికి బీమా అవసరమవుతుంది! ప్రభుత్వ శాఖలు దీనికోసం వందలకోట్ల ప్రీమియం చెల్లిస్తాయి! బీమా రంగంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. కానీ... అనామక కంపెనీలను రంగంలోకి దించి, సొంత/అస్మదీయ బ్రోకరేజ్ ఏజెన్సీలను తెరపైకి తెచ్చారు. ఏజెన్సీల ద్వారా బీమా చేయించి... పదుల కోట్లలో కమీషన్లు నొక్కేశారు. ఇదో బడా స్కీమ్... స్కామ్!

బీమా బూచోడు!

వైసీపీ హయాంలో మరో బడా స్కామ్

- బీమా పథకాలు, శాఖల ఇన్సూరెన్స్‌లో కమీషన్ల దందా
- ప్రభుత్వ బీమా సంస్థలకు గేట్లు మూసి..
- అస్మదీయ బ్రోకరేజీ ఏజెన్సీలు రంగంలోకి!
- వందల కోట్ల ప్రీమియంలో పదుల కోట్లలో కమీషన్
- ఏపీజీఐసీఎల్ పేరుతో సంస్థ పెట్టిన గత సర్కారు
- కన్సల్టెంట్‌గా చేరి చక్రం తిప్పుతున్న వ్యక్తి
- తనను సీఈవోను చేయాలంటూ ఆర్థిక శాఖకు ఫైలు
- ఉద్యోగుల అభ్యంతరంతో ఆగిన ఆదేశాలు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మద్యం, ఇసుక, గనులు, కాంట్రాక్టులు, భూములు... ఎక్కడ 'ఆదాయం' ఉంటే అక్కడ వైసీపీ పెద్దలు రంగంలోకి దిగారు! అందులో భాగంగానే... ప్రభుత్వ పథకాలు, శాఖలకు సంబంధించిన బీమాలోనూ కమీషన్లు దండుకున్నారు. దీనికోసం భారీ పథకమే రచించారు. ఒకప్పుడు ప్రభుత్వ రంగ బీమా సంస్థలో పని చేసిన సుజిత్ అనే వ్యక్తి... గత ప్రభుత్వ హయాంలో 'కన్సల్టెంట్'గా అవతారమెత్తాడు. దాదాపు 15 శాఖలకు సంబంధించిన బీమా పథకాలు, ఇన్సూరెన్స్‌లన్నీ ఇతని కనుసన్నల్లోనే జరిగాయి. జగన్ సీఎం అయ్యాక 2020లో ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజీఐసీఎల్) అనే సంస్థను స్థాపించారు. దాని ద్వారా ఇన్సూరెన్స్ వ్యాపారం చేయాలనుకున్నారు. ఏపీజీఐసీఎల్‌కి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ-డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏఐ) బీమా లైసెన్స్ ఇవ్వకున్నా

మిగతా 9వ పేజీలో...


అరబిందో ఫార్మా లైఫియస్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అరబిందో ప్రతినిధులు, అధికారులు

భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి శ్రీకారం

- 3 దశాబ్దాల తర్వాత దేశీయంగా తయారీ
- కాకినాడలో అరబిందో ఫార్మా లైఫియస్ ప్లాంట్ ప్రారంభం 2
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్లాంటులో పెన్సిలిన్-జి ఉత్పత్తి
- మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు
- నూతక్కి పీహెచ్‌సీ వరకు వెళ్లి
- రక్త నమూనాలు తీసుకొచ్చిన డ్రోన్
- వృద్ధులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా
- ఏబీపీఎంజేఏ పథకానికి ప్రధాని ప్రారంభం

కొత్తగా 7 వేల కోట్ల రుణాలకు కేంద్రం ఓకే 3

54 మండలాల్లో కరువు

- తక్కువ వర్షపాతం నమోదైన
- వాటిని ప్రకటించిన ప్రభుత్వం
- కలెక్టర్ల ప్రతిపాదనలతో
- నోటిఫికేషన్ జారీ 11

హిజ్బుల్లా చీఫ్‌గా కెమిస్ట్రీ ప్రొఫెసర్

- మూడు దశాబ్దాలు
- డిప్యూటీగా సేవలు 2
- న్యాయశాస్త్రంపై
- అధ్యయనం.. పరిశోధనలు


మైక్రోసాఫ్ట్ కేంద్ర కార్యాలయంలో సంస్థ సీఈవో సత్యనాదెళ్లను కలిసిన మంత్రి లోకేశ్

పెట్టుబడులకు ఇదే మంచి సమయం

ఏపీకి రండి

దిగ్గజ టెక్ కంపెనీలకు మంత్రి లోకేశ్ ఆహ్వానం

- అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించండి
- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు లోకేశ్ అభ్యర్థన
- డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ అభివృద్ధికి సహకరిస్తామన్న సత్య
- అడోబ్ అభివృద్ధి, పరిశోధనా కేంద్రాన్ని ఏపీలో ఏర్పాటు చేయండి
- అనుకూల ప్రాంతంలో యాపిల్ తయారీ యూనిట్ నెలకొల్పండి
- అడోబ్ సీఈవో, యాపిల్ వైస్ ప్రెసిడెంట్‌కు లోకేశ్ వినతి

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఇదే మంచి సమయమని, టెక్నాలజీ సహకారంతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలకు మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి లోకేశ్ మంగళవారం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, యాపిల్ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ప్రియా బాలసుబ్రహ్మణ్యంతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో

మిగతా 9వ పేజీలో...


2

ఉచిత సిలిండర్ల బుకింగ్ ప్రారంభం

- లబ్ధిదారుల ఫోన్లకు శుభాకాంక్షల మెసేజ్‌లు
- ఎల్లుండి సీఎం చేతుల మీదుగా పంపిణీ
- శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో శ్రీకారం

6న మెగా డీఎస్సీ 3



కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు

- తొక్కిసలాట.. 150 మందికి గాయాలు
- తెయ్యం ఉత్సవాల్లో అపశ్రుతి 2
- ఆలయ ప్రాంగణంలోని షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ.. నిప్పురవ్వలు పడి పేలుళ్లు

మరో 103 విమానాలకు బాంబు బెదిరింపులు

- దేశవ్యాప్తంగా 16 రోజుల్లో 510 విమానాలకు 2
- మహారాష్ట్రలో ఓ వ్యక్తి అరెస్టు.. పలు విమానాలకు
- బెదిరింపు మెయిల్స్ చేసినట్టు పోలీసుల వెల్లడి
- ఉగ్రవాదంపై గతంలో పుస్తకం రాసిన నిందితుడు

తిహాడ్ జైలు వార్డెన్ డ్రగ్స్ దందా

- మాదక ద్రవ్యాల కేసులో
- జైలుకొచ్చిన ఓ వ్యక్తితో పరిచయం
- అతడు విడుదలయ్యాక కలిసి వ్యాపారం
- డ్రగ్స్ ల్యాబ్ నెలకొల్పి పెద్ద ఎత్తున తయారీ
- సమాచారం తెలిసి ఎన్‌సీబీ దాడి
- వీరితో పాటు మరో ఇద్దరి అరెస్టు
- వందల కోట్ల విలువైన 95 కేజీల డ్రగ్స్ సీజ్ 2


డ్రగ్స్ ల్యాబ్‌లో పోలీసుల సోదాలు

భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి శ్రీకారం

- కాకినాడలో అరబిందో ఫార్మా లైఫియస్ ప్లాంట్ ప్రారంభం
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

తొండంగి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల తర్వాత భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1990వ దశకంలోనే దేశంలో ఉత్పత్తిని ఆపేసిన తర్వాత మళ్లీ ఇప్పుడు తొలిసారిగా పెన్సిలిన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. అరబిందో ఫార్మా కంపెనీ కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవినగరం గ్రామంలో నిర్మించిన లైఫియస్ ఫార్మా ప్లాంట్‌ను ప్రధాని మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో యాంటీబయాటిక్ మందుల తయారీలో కీలకమైన పెన్సిలిన్-జీని ఉత్పత్తి చేయనున్నారు. ఈ సందర్భంగా ఏవినగరంలో నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. లైఫియస్ ఫార్మా 135 ఎకరాల్లో 2,500 కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 15వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పెన్సిలిన్-జీ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కంపెనీ ద్వారా 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, చాలామందికి మొక్కజొన్న రైతులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఈ కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. పరిశ్రమ స్థాపనకు సహకరించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, అప్టోరియా ఫార్మా సీఈవో సంజయ్ చతుర్వేది, పి యుగంధర్, పి శరత్‌చంద్రారెడ్డి, కె.నిత్యానందరెడ్డి, ఎం.మదనమోహన్ రెడ్డి, హిమాంశు రెడ్డి, ఎస్.సుబ్రహ్మణియన్, లైఫియస్ ఫార్మా డైరెక్టర్ ఎంవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరబిందోకు దక్కిన అవకాశం..

ప్రపంచవ్యాప్తంగా పెన్సిలిన్ తయారీలో చైనాను కింగ్‌గా చెబుతారు. పెన్సిలిన్‌ను అధిక మొత్తంలో ఉత్పత్తి చేయడం, దాన్ని చాలా తక్కువ ధరకే అందించడంతో.. ప్రపంచ మార్కెట్‌లో చైనా పోటీని తట్టుకోలేక భారత్ 1990వ దశకంలో పెన్సిలిన్ ఉత్పత్తిని ఆపేసింది. అప్పటి నుంచి చైనా నుంచే పెన్సిలిన్‌ను దిగుమతి చేసుకుంటోంది. అయితే.. 2020లో కోవిడ్ సమయంలో చైనా పెన్సిలిన్ సరఫరా చేయకుండా భారత్‌లోపాటు అనేక దేశాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. దీంతో.. ఫార్మా రంగంలో దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం పెన్సిలిన్ ఉత్పత్తిని ప్రారంభించాలని నిర్ణయించింది. దీనికోసం స్వదేశీ కంపెనీల నుంచి బిడ్లు ఆహ్వానించగా... అరబిందో ఫార్మా కంపెనీ అవకాశం దక్కించుకుంది. కాకినాడ సెజ్‌లో లైఫియస్ ఫార్మా ప్లాంట్‌ను ఏడాదిన్నరలోనే నిర్మించింది. ఇది అందుబాటులోకి రావడంతో మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ దీన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. కీలకమైన ఔషధాల దిగుమతిపై ఆధారపడడాన్ని తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా ఈ పెన్సిలిన్-జి ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించడం కీలకమైన మైలురాయి అని లైఫియస్ ఫార్మా డైరెక్టర్ ఎంవీ రామకృష్ణ అన్నారు. పెన్సిలిన్-జి ఉత్పత్తికి ప్రధాన ముడిసరుకు మొక్కజొన్న. దీంతో రాష్ట్రంలోని మొక్కజొన్న రైతుకి ఇది

తిహాడ్ జైలు వార్డెన్ డ్రగ్స్ దందా

న్యూఢిల్లీ, అక్టోబరు 29: గ్రేటర్ నోయిడాలో తిహాడ్ జైలు వార్డెన్ రహస్యంగా నడుపుతున్న మాదకద్రవ్యాల తయారీ ల్యాబ్ గుట్టురట్టయింది. ఢిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్తతో కలిసి ఆ వార్డెన్ ఇంతకాలం ఈ డ్రగ్ దందా నడిపారు. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా కాసనా ఇండస్ట్రియల్ ప్రాంతంలో అనధికార డ్రగ్ ల్యాబ్ ఉన్నట్లు సమాచారం అందడంతో ఇటీవల ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగంతో కలిసి ఎన్‌సీబీ ఆ ప్రాంతంలో రైడ్స్ నిర్వహించింది. దాంతో ఈ డ్రగ్ ల్యాబ్ వ్యవహారం బట్టబయలైంది. రైడ్ సమయంలో ఢిల్లీ వ్యాపారి అక్కడే ఉన్నారు. తిహాడ్ జైలు వార్డెన్‌తో కలిసి ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ముంబైకి చెందిన ఓ కెమిస్ట్‌తో అక్కడ మెథాంపెటమైన్ డ్రగ్ తయారు చేయిస్తున్నారని, ఢిల్లీలో ఉంటున్న ఒక మెక్సికన్ డ్రగ్ సప్లయర్‌తో దాని నాణ్యత చెక్ చేయిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ సోదాల్లో దాదాపు 95 కేజీల మెథాంపెటమైన్ డ్రగ్(ద్రవ, ఘన రూపాల్లో)ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుంది.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన చంద్రబాబు దంపతులు

గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఇటీవల అస్వస్థతకు గురైన గవర్నర్ సతీమణి సమీరా నజీర్‌ను ముఖ్యమంత్రి దంపతులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని భువనేశ్వరి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి ఏకాంతంగా చర్చలు జరిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, దీపావళి నుంచి అమలు చేయబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి చంద్రబాబు గవర్నర్‌కు వివరించారు. ఇసుక, మద్యం పాలసీలపై గవర్నర్ ఆరా తీసినట్లు సమాచారం.

ఉచిత సిలిండర్ల బుకింగ్ ప్రారంభం

- లబ్ధిదారుల ఫోన్లకు శుభాకాంక్షల మెసేజ్‌లు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా అందించనున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. వీటిని బుక్ చేసుకున్న లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు శుభాకాంక్షల మెసేజ్‌లు అందుతున్నాయి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ విజయవాడలోని ఒక గ్యాస్ ఏజెన్సీని సందర్శించి.. ఉచిత గ్యాస్ కనెక్షన్ల బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ పథకంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు అర్హులైన లబ్ధిదారులందరి మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సందేశాలతోపాటు వాయిస్ మెసేజ్‌లను కూడా పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గ్యాస్ కంపెనీల అభ్యర్థనల మేరకు ఒక రోజు వాయిదా వేసి నవంబరు 1న ప్రారంభించనున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసి ఈ పథకం అమలుకు లాంఛనంగా శ్రీకారం చుడతారు.

తొలి విడత బుకింగ్‌లు వచ్చే మార్చి వరకు..

ప్రస్తుతం యాక్టివ్ ఎల్పీజీ కనెక్షన్ కలిగి ఉండి, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతా ఉన్నవారందరూ ఈ పథకానికి అర్హులేనని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఉచిత సిలిండర్లను కూడా లబ్ధిదారులు ఎప్పటిలాగే ముందుగా గ్యాస్ ధరను చెల్లించి సిలిండర్లు బుక్ చేసుకోవాలి. ఆ వెంటనే లబ్ధిదారుల మొబైల్‌కు శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ వస్తుంది. సిలిండర్ డెలివరీ అయిన 24 గంటల్లోపే గ్యాస్‌కు ముందుగా చెల్లించిన మొత్తం ఆయా గ్యాస్ కంపెనీల ద్వారా లబ్ధిదారుల ఆధార్‌కు లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. ఈ తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లు వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగుతాయి. ఈలోపు ఎప్పుడైనా ఉచిత సిలిండర్లను పొందవచ్చు.

పర్యావరణహితంగా దీపావళి!: పవన్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో వాయుకాలుష్యం నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకటించిన దియాజలావ్ కార్యక్రమం తరహాలో రాష్ట్రంలోనూ ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్దేశించారు. హోంమంత్రి అనిత మంగళవారం పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై ఇరువురూ చర్చించారు. పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

రక్త నమూనాలు తీసుకొచ్చిన డ్రోన్..!

- 9 నిమిషాల్లో 12 కి.మీ. ఎగిరెళ్లి నలుగురి శాంపిల్స్ స్వీకరణ
- మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు ప్రారంభం
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



మంగళగిరి ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్‌సీకి బయలుదేరుతున్న డ్రోన్

మంగళగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో కూడా డ్రోన్ సేవల వినియోగం పెరిగింది. ఈ డ్రోన్ టెక్నాలజీని మరింత విస్తృతంగా వాడుకోవాలని కేంద్రం నిర్ణయించింది. మంగళవారం ఢిల్లీలోని ఎయిమ్స్ నుంచి ప్రధాని మోదీ.. దేశవ్యాప్తంగా 11 ఎయిమ్స్ ఆస్పత్రుల్లో డ్రోన్ సేవలను ప్రారంభించారు. దీంతో మంగళగిరి ఎయిమ్స్‌లో కూడా డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. తొలిసారి ఇక్కడ మొదలైన డ్రోన్ సేవలను ఆస్పత్రి అధికారులు పరిశీలించారు. ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలోని నూతక్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో చికిత్స పొందుతున్న గర్భిణీ వల్లంశెట్టి నాగదివ్యతో పాటు మరో ముగ్గురి నుంచి సేకరించిన రక్త నమూనాలను తెచ్చేందుకు డ్రోన్‌ను పంపించారు. ఇది 9 నిమిషాల్లోనే నూతక్కి చేరుకుని నమూనాలను రెండు నిమిషాల్లో స్వీకరించి.. తిరిగి 9 నిమిషాల్లో ఎయిమ్స్‌కి చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మదుబానందకర్ మాట్లాడుతూ... ఆరోగ్యరంగంలో డ్రోన్ టెక్నాలజీని వినూత్నంగా ఉపయోగించే ఉద్దేశంతో ఈ సేవలు ప్రారంభించామని చెప్పారు.

వృద్ధులకు 5లక్షల ఆరోగ్య బీమా

దేశవ్యాప్తంగా 70ఏళ్లు దాటిన వారందరికీ అందుబాటులోకి



న్యూఢిల్లీ, అక్టోబరు 29: దేశవ్యాప్తంగా 70ఏళ్ల వయసు దాటిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ధన్వంతరి జయంతి, 9వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ)లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే ఆరోగ్య రంగంలో రూ.12,850 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులతో పాటు గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ-విన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తాజా పథకం ద్వారా దేశవ్యాప్తంగా 4.5 కోట్ల కుటుంబాల్లోని 6కోట్ల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. పేద, ధనిక బేధాలు లేకుండా అన్ని వర్గాల వారికి ఈ బీమా వర్తిస్తుంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నవారికి కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్నవారికి మరో రూ..5లక్షల అదనపు టాప్-అప్ కవరేజీ లభిస్తుంది. (ఈ మొత్తాన్ని వారు కుటుంబంలో 70ఏళ్ల కంటే తక్కువ వయసున్న ఇతర సభ్యులతో పంచుకోవాల్సిన అవసరం లేదు.). ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, ఈఎస్ఐసీ కింద ప్రయోజనం పొందుతున్నవారు కూడా ఈ పథకం కింద ప్రయోజనం పొందడానికి అర్హులు. సీజీహెచ్ఎస్, ఎక్స్-సర్వీస్‌మన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ఫోర్స్ పథకాల్లో ఉన్న వృద్ధులు వాటిని గానీ ఏబీ-పీఎంజేఏవైని గానీ ఎంచుకోవచ్చు. దీనికోసం పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. కాగా, ఆయుష్ రంగ విస్తరణలో భాగంగా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద రెండో దశను ప్రధాని ఈ సందర్భంగా ప్రారంభించారు. దీనిలో అత్యాధునిక పంచకర్మ ఆసుపత్రి, ఆయుర్వేద ఫార్మసీ, స్పోర్ట్స్ మెడిసిన్ యూనిట్, సెంట్రల్ లైబ్రరీ, ఐటీ, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, 500 సీట్ల ఆడిటోరియంను నిర్మిస్తారు. ఇండోర్‌లో నూతన ఈఎస్ఐసీ ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు ఫరీదాబాద్(హరియాణా), బొమ్మసంద్ర, నరసాపూర్(కర్ణాటక), మీరట్(ఉత్తర ప్రదేశ్), అచ్యుతాపురం(ఏపీ), ఇండోర్‌లలో ఆదనపు ఈఎస్ఐసీ ఆసుపత్రులక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటితో పాటు ఎయిమ్స్ రుషీకేశ్, బీబీనగర్, గువాహటి, భోపాల్, జోధ్‌పూర్ సహా 11 ప్రధాన సంస్థల్లో డ్రోన్ ఆధారిత సేవలను ప్రధాని ప్రవేశపెట్టారు. అలాగే ఎయిమ్స్ రిషీకేశ్‌లో హెలికాప్టర్ అత్యవసర వైద్యసేవలను ప్రారంభించనున్నారు.

అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి

అచ్యుతాపురం(అనకాపల్లి జిల్లా), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మాట్లాడుతూ.. ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్రం గతంలోనే మంజూరు చేసిందని, కానీ జగన్ ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టలేదని విమర్శించారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు.

యువత ఉపాధికి ప్రత్యేక వ్యవస్థ

దేశంలో ప్రతి యువకుడు/యువతికి ఉపాధి కల్పించే సరికొత్త ప్రత్యేక వ్యవస్థను సృష్టిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. యువతకు గరిష్ఠ సంఖ్యలో ఉద్యోగాలు సమకూర్చాలన్నది తన ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 51 వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2022లో ఈ మేళా పథకాన్ని ప్రారంభించామని.. రెండేళ్లలోనే ఇప్పటివరకు 7.5 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ పర్యవేక్షణలో లక్షన్నర స్టార్టప్‌లు ప్రారంభించామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతను చేర్చుకోవడానికి పెయిడ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం చేపట్టామని ప్రస్తావించారు. ప్రధాని ఈ సందర్భంగా ప్రజలకు ధన త్రయోదశి శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఈ దీపావళి పర్వదినం ప్రత్యేకం కాబోతోంది. ఎందుకంటే 500 ఏళ్ల తర్వాత అయోధ్య దివ్య దేవాలయంలో శ్రీరాముడిని ప్రతిష్ఠించిన తొలి సంవత్సరమిది' అని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



జనన, మరణాల నమోదుకు యాప్

న్యూఢిల్లీ, అక్టోబరు 29: ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా జనన, మరణాలను నమోదు చేయడానికి ఉద్దేశించిన ప్రత్యేక యాప్‌ను మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సీఆర్ఎస్) మొబైల్ యాప్ పేరుతో రిజిస్ట్రార్ జనరల్-సెన్సస్ కమిషనర్ కార్యాలయం దీన్ని రూపొందించింది. ఈ కార్యాలయం ఉండే జనగణన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన దేశ ప్రథమ హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు.

క్యాన్సర్ ఔషధాల ధరల తగ్గింపు!

న్యూఢిల్లీ, అక్టోబరు 29: క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మూడు ఔషధాల ధరలను తగ్గించాల్సిందిగా వాటిని తయారు చేసే కంపెనీలను కేంద్రం కోరింది. ఈ మేరకు 'జాతీయ ఔషధ ధరల సాధికారసంస్థ' మెమోరాండం జారీ చేసింది. ధరలు తగ్గించాల్సిన ఔషధాల జాబితాలో ట్రస్టుజుమాబ్, ఒసిమర్టినిబ్, దుర్వాలుమాబ్ ఉన్నాయి. వీటిని రొమ్ము, ఊపిరితిత్తులు, పిత్తాశయ క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగిస్తున్నారు.

అధ్యక్ష ఎన్నికల్లో ఓటేసిన బైడెన్

వాషింగ్టన్, అక్టోబరు 29: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్ష ఎన్నికల్లో ముందుగానే తన ఓటు హక్కును వినియోగించుకొన్నారు. సోమవారం సొంత రాష్ట్రం డెలావెర్‌లోని విల్మింగ్టన్‌లో తన ఇంటి సమీపంలోని ఓ పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడి ఓటేశారు. అనంతరం ఆయన.. "కమలాహ్యారిస్‌కు ఓటేసినందుకు గర్వంగా ఉంది" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలతో పాటు ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్‌కు కూడా బైడెన్ ఓటేశారు. మరోవైపు, వాషింగ్టన్, ఒరేగాన్‌లో పలు బ్యాలెట్ బాక్సులకు దుండగులు నిప్పంటించారు.

మరో 103 విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ/ముంబై, అక్టోబరు 29: దేశవ్యాప్తంగా విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం 100 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. గడిచిన 16 రోజుల్లో మొత్తం 510 దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బెదిరింపులు రాగా.. అవన్నీ ఉత్తుత్తివేనని తేలింది. ఈ బెదిరింపులన్నీ సోషల్ మీడియా ద్వారానే ఎక్కువగా వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎయిరిండియా విమానాలకు మంగళవారం సోషల్ మీడియా ద్వారానే బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులపై సంబంధిత విభాగాలు తక్షణమే అప్రమత్తమయ్యాయని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని ఎయిరిండియా అధికార ప్రతినిధి తెలిపారు. ఎయిరిండియా, ఇండిగో, విస్తారా సంస్థల విమానాలకు ఎక్స్‌లో బెదిరింపులు రాగా.. గుర్తుతెలియని వ్యక్తులపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు విమానాలకు బాంబు బెదిరింపులు చేస్తున్న వ్యక్తిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని గోండియాకు చెందిన జగదీశ్ ఉఇకే(35) బెదిరింపు మెయిల్స్ చేస్తున్నట్లు డీసీపీ శ్వేత ఖేద్కర్ వెల్లడించారు. ఇతను ప్రధానమంత్రి కార్యాలయం, రైల్వే మంత్రి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విమానయాన కార్యాలయాలు, డీజీపీ, రైల్వే రక్షక దళం సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకూ బెదిరింపు మెయిల్స్ పంపినట్లు తెలిపారు.

అతీంద్రియ శక్తులున్నాయనే ధీమాతో నాలుగో అంతస్తు నుంచి దూకేశాడు!

తమిళనాడులో ఇంజనీరింగ్ విద్యార్థి చేష్ట..

కోయంబత్తూర్, అక్టోబరు 29: తనకు అతీంద్రియ శక్తులున్నాయనే ధీమాతో ఆ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రాణాలమీదకు తెచ్చుకున్నాడు. ఈ ఘటన తమిళనాడు కోయంబత్తూర్ జిల్లా మైలారిపాలెంలో జరిగింది. మెక్కూరు గ్రామానికి చెందిన 19 ఏళ్ల ప్రభు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 6:30 గంటలకు తానుంటున్న హాస్టల్ భవనంపై నుంచి దూకాడు. తనకు అతీంద్రియ శక్తులేమీ లేవనే సంగతి ఆస్పత్రి పాలయ్యాక గానీ ప్రభు తెలుసుకోలేదు. చావుతప్పి కన్నులొట్టపోయినట్టు.. ప్రాణాపాయం తప్పినా అంతెత్తు నుంచి జంప్ చేయడంతో ప్రభుకు తల సహా ఇతర చోట్ల తీవ్రగాయాలయ్యాయి.

హిజ్బుల్లా చీఫ్‌గా కెమిస్ట్రీ ప్రొఫెసర్

షేక్ నయీం-బిన్-మహమ్మద్ ఖాసీం నియామకం



బీరుట్/టెల్‌అవీవ్, అక్టోబరు 29: హిజ్బుల్లా తమ సెక్రటరీ జనరల్‌గా విద్యావంతుడైన షేక్ నయీం-బిన్-మహమ్మద్ ఖాసీంను ప్రకటించింది. హిజ్బుల్లా సంస్థ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన ఖాసీం.. మూడు దశాబ్దాలుగా ఆ సంస్థకు డిప్యూటీ చీఫ్‌గా.. అల్-మూసావీ, హసన్ నస్రల్లా హయాంలో సేవలందించారు. గత నెల 27న బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హసన్ నస్రల్లా మృతిచెందగా.. ఆయన అల్లుడు షఫిద్దీన్ తదుపరి చీఫ్ అవుతారని అంతా భావించగా.. సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అతను కూడా మృత్యువాత పడ్డారు. ఆ తర్వాత నెల రోజులపాటు నాయకత్వం లేకుండానే.. హిజ్బుల్లా ముందుకు సాగింది.

మిగతా చీఫ్‌లకు భిన్నం

హిజ్బుల్లా మిలిటెన్సీకి చీఫ్‌లుగా వ్యవహరించిన అల్-మూసావీ, హసన్ నస్రొల్లాతో పోలిస్తే.. ఖాసీం విద్యావంతుడు. మొదటి ఇద్దరూ మహమ్మద్ ప్రవక్తకు వారసులుగా చెప్పుకొంటూ.. నల్లటి తలపాగాను ధరించేవారు. ఖాసీం మాత్రం శాంతికి చిహ్నమైన తెలుపురంగు తలపాగాను ధరిస్తారు. 1953లో బీరుట్‌లోని తహ్తాబస్తా ప్రాంతంలో జన్మించిన ఖాసీంకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1970లో లెబనీస్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీగా పనిచేస్తూనే.. రసాయనశాస్త్రం అభ్యసించారు. 1977 నుంచి రసాయనశాస్త్రంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఫ్రెంచ్‌లో ప్రావీణ్యంతోపాటు.. న్యాయశాస్త్రం, షియాపై అధ్యయనాలు చేశారు. లెబనాన్ యూనియన్ ఆఫ్ ముస్లిం స్టూడెంట్స్ సంస్థను స్థాపించారు. 1974-88 మధ్యకాలంలో ఇస్లామిక్ రిలీజియస్ ఎడ్యుకేషన్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా పనిచేశారు. 1974లో అల్-సదర్ స్థాపించిన మూవ్‌మెంట్ ఆఫ్ ద డిస్పైడ్ సైనిక విభాగం(లెబనీస్ రెసిస్టెంట్స్ రెజిమెంట్)లో చేరారు. దీన్నే అమల్ ఉద్యమం అంటారు. ఇరాన్ విప్లవం తర్వాత.. అమల్ ఉద్యమానికి రాజీనామా చేశారు. ఇమామ్ ఖోమెనీతో ప్రభావితమై.. 1982లో హిజ్బుల్లా వ్యవస్థాపక సభ్యుడిగా.. డిప్యూటీ చీఫ్‌గా నియమితులయ్యారు.

ఔషధాలను తరలించిన భారత్

పాలస్తీనా ప్రాంతంలో యుద్ధవాతావరణం నేపథ్యంలో మూడు టన్నుల ఔషధాలను సాయంగా పంపినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ ఔషధాల్లో లైఫ్‌సేవింగ్, క్యాన్సర్ నివారణ మందులు ఉన్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు.

శరణార్థులపై భవనంపై దాడి

ఉత్తర గాజాలో శరణార్థులు తలదాచుకుంటున్న ఓ భవనంపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) మంగళవారం జరిపిన బాంబింగ్‌లో 93 మంది మృతిచెందారు. ఇదే ప్రాంతంలో హమాస్ జరిపిన కాల్పుల్లో నలుగురు ఐడీఎఫ్ సైనికులు మృతిచెందారని, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. మరోవైపు ఇజ్రాయెల్‌లో ఐక్యరాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏపై నిషేధం విధించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది.

కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు, తొక్కిసలాట

150 మందికి గాయాలు

కాసరగడ్(కేరళ), అక్టోబరు 29: కేరళలోని ఓ ఆలయంలో జరిగిన తెయ్యం(కాళియాట్టం) ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన బాణసంచా హఠాత్తుగా పేలడంతో తొక్కిసలాట జరిగి సుమారు 154 మంది గాయపడ్డారు. వీళ్లలో 10 మంది తీవ్రమైన కాలిన గాయాలతో బాధపడుతున్నారు. తెయ్యం లేదా కాళియాట్టం అనేది ఉత్తర కేరళ ప్రాంతంలోని ఆలయాల్లో నిర్వహించే పురాతన కళా ప్రదర్శన. అయితే, కాసరగడ్ జిల్లాలోని నీలేశ్వరం పట్టణ సమీపంలోని వీరర్కవు దేవాలయంలో సోమవారం రాత్రి తెయ్యం ఉత్సవం జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఉత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలోని ఓ రేకుల షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ ఉంచారు. ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా ఆ షెడ్డులో పేలుడు సంభవించింది. పేలుడు శబ్దంతో జనం ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఈ ఘటనకు సంబంధించి ఆలయ కమిటీకి చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిలో ముగ్గురిని మంగళవారం అరెస్టు చేశారు.

వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు

వాషింగ్టన్, అక్టోబరు 29: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, ఆరువందల మందికి పైగా భారతీయ అమెరికన్ ప్రముఖులు పాల్గొన్నారు. వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు ఘనంగా చేయడంపై బైడెన్ ఆనందం వ్యక్తం చేశారు. అధ్యక్షుడిగా ఇది తనకు ఎంతో గౌరవం అన్నారు. "కమల నుంచి డాక్టర్ మూర్తి వరకు చాలా మంది ఇక్కడ ఉన్నారు... నేటి అమెరికా ఎలా ఉందో... అలానే నా అడ్మినిస్ట్రేషన్ కూడా ఉండాలన్నది నా నిర్ణయం.. అది నెరవేరింది... అందుకు గర్వంగా ఉంది.." అని బైడెన్ చెప్పారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న వ్యోమగామి సునీత విలియమ్స్ వీడియో సందేశాన్ని కూడా కార్యక్రమంలో వినిపించారు. అంతరిక్ష కేంద్రంలో ఉండి దీపావళి జరుపుకొనే అరుదైన అవకాశం తనకు దక్కిందని సునీత ఆనందం వ్యక్తం చేశారు. వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు జరిపినందుకు బైడెన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, లండన్‌లోని ట్రఫాల్గర్ స్క్వేర్‌లో దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి.

మహిళా ఓటర్లదే పైచేయి

- ముసాయిదా జాబితా-2025 విడుదల

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితా-2025ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఓటర్ల వివరాలను మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 4,14,20,935 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిములు, అభ్యంతరాలను ఈ నెల 29 నుంచి నవంబరు 28 వరకు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ నాటికి పరిష్కరిస్తామని, 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.

ఇదీ లెక్క

- జనవరి నాటి జాబితాలో పురుషుల సంఖ్య 2,00,74,322 ఉండగా.. ఇప్పుడు 2,03,47,738కి చేరింది. 2.7 లక్షల మంది పెరిగారు.
- మహిళా ఓటర్లు జనవరిలో 2,07,29,452 ఉండగా ఇప్పుడు 2,10,69,803కి పెరిగారు. దీనిని బట్టి 3.4 లక్షల మంది పెరిగినట్టయింది.
- సర్వీసు ఓటర్లు 67,143 మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు 8003 మంది ఉన్నారు.
- 2024 తుది ఓటర్ల జాబితా నుంచి 4,68,871 ఓట్లు తొలగించారు.
- 10,82,841 మంది ఓటర్లను కొత్తగా చేర్చారు.

ధర భళా.. అమ్మేదెలా?

- కర్నూలు మార్కెట్‌కు పోటెత్తుతున్న ఉల్లి



మార్కెట్ యార్డు నుంచి బస్టాండ్ దాకా బారులు తీరిన ఉల్లి బస్తాల ట్రాక్టర్లు

కర్నూలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ఉల్లి ధర మండిపోతుంటే.. వాటిని పండించిన రైతు అమ్ముకోడానికి అష్టకష్టాలు పడుతున్నాడు. కర్నూలు మార్కెట్‌కు మంగళవారం ఉల్లి దిగుబడులు పోటెత్తాయి ఉల్లి ట్రాక్టర్లు, లారీలు తరలిరావడంతో ట్రాఫిక్ కూడా స్తంభించింది. మార్కెట్‌లోని షెడ్ల సామర్థ్యం 30 వేల బస్తాలు కాగా.. రైతులు 45-50 వేల బస్తాలు తెస్తున్నారు. క్వింటా ఉల్లి ధర కనిష్ఠంగా 450-500, గరిష్ఠంగా 4,300- 4,500.. సగటు ధర 2,600-3,200గా ఉంది. ధర ఆశాజనకంగా ఉన్నా అమ్ముకోవడానికి రైతులు గత వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, వ్యాపారులతో జేసీ చర్చలు జరిపి, రోజు విడిచి రోజు విక్రయాలు చేసే ఏర్పాటు చేశారు. దీంతో 26న 54,161, 28న 43,926 బస్తాలను రైతులు అమ్మకానికి తెచ్చారు. మంగళవారం రాత్రి మళ్లీ భారీగా పంట మార్కెట్‌కు వచ్చింది. ఉల్లి బస్తాలు తరలివస్తున్నా.. వాటిని ఎప్పటికప్పుడు అమ్మేసి, మార్కెట్‌ను ఖాళీ చేసే పరిస్థితి కనిపించడం లేదు.

కొత్తగా 7 వేల కోట్ల రుణానికి కేంద్రం ఓకే

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 7,000 కోట్ల అప్పు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది అడ్వాన్సు అనుమతి మాత్రమేనని, మిగిలింది ఇంకా ఖరారు చేయాల్సి ఉందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో వినియోగించుకునేందుకు రూ. 47,000 కోట్లకు కేంద్రం అనుమతి ఇవ్వగా.. సెప్టెంబరు ఆఖరుకి ఈ పరిమితి ముగిసిపోయింది. ఇప్పుడు కొత్తగా అక్టోబరు-డిసెంబరు మధ్య వాడుకునేందుకు రూ.7,000 కోట్లకు అనుమతి తెలిపింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు వచ్చిన అప్పుల అనుమతి రూ.54,000 కోట్లకు చేరింది. రిజర్వ్ బ్యాంక్ నుంచి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 3,000 కోట్ల అప్పు తెచ్చింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో సెక్యూరిటీల వేలం ద్వారా తెచ్చిన అప్పు రూ. 50,000 కోట్లకు చేరింది.

11న రాష్ట్ర బడ్జెట్: నవంబర్ 11న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అన్ని శాఖల సెక్రటరీలతో సోమవారం ఆర్థిక శాఖ ముందస్తు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించనున్నారు. సాధారణంగా ప్రతి బడ్జెట్‌కు ముందు అన్ని శాఖల మంత్రులు, సెక్రటరీలు, శాఖాధిపతులతో ఆర్థిక శాఖ సమావేశాలు నిర్వహిస్తుంటుంది. కానీ, ఈసారి సమయం లేకపోవడంతో ఒకేసారి సమావేశం నిర్వహించనుంది.

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలనకు గడువు పెంపు

» నవంబరు 15 నాటికి పూర్తిస్థాయి నివేదిక: మంత్రి అనగాని

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రిజిస్ట్రేషన్లు జరిగిన ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలనకు గడువు పెంచినట్టు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత జాబితా నుంచీ ఫ్రీ హోల్డ్ చేసిన భూముల వివరాలు, వాటిలో రిజిస్టర్ అయిన భూములను రికార్డుల పరంగానే కాకుండా క్షేత్రస్థాయిలో కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కానందున మరో 15 రోజుల పాటు గడువు పెంచామన్నారు. నవంబరు 15వ తేదీ కల్లా వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసి పూర్తిస్థాయి నివేదిక ప్రభుత్వానికి అందుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఏ కార్యక్రమం సక్రమంగా జరగలేదని ఆరోపించిన మంత్రి.. ఆ కారణంగానే రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ల విలువపై మళ్లీ సర్వేలు చేయాల్సి వస్తోందన్నారు. భూముల విలువను చాలాచోట్ల సవరించాల్సిన అవసరముందన్నారు. డిసెంబరు 1 నుంచి దీన్ని అమలు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక రాష్ట్రం దాటి బయట వెళ్లడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. వచ్చే జనవరి కల్లా రాష్ట్రంలో ఆర్ అండ్ బీ రోడ్లపై ఎక్కడా గోతులు కనిపించడానికి వీల్లేదని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.6,400 కోట్ల విద్యుత్ భారం మోపిందని అసత్య ప్రచారం జరుగుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 2019-24 నడుమ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపడంతో పాటు అస్తవ్యస్త సంస్కరణలు అమలుచేయడం వల్ల ఆర్థిక భారం పెరిగిపోయిందని ఆరోపించారు. .

6న మెగా డీఎస్సీ

» నోటిఫికేషన్ జారీకి నిర్ణయం

» 16,347 టీచర్ పోస్టులు భర్తీ

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కీలకమైన మెగా డీఎస్సీ పట్టాలెక్కుతోంది. నవంబరు 6న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ఇప్పటికే ప్రకటించగా దీనికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పోస్టుల రోస్టర్ వివరాలు సమర్పించాలని ఇటీవల పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. మరోవైపు నవంబరు 2న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలు విడుదల చేసిన తర్వాత డీఎస్సీ ప్రకటిస్తే కొత్తవారు కూడా దరఖాస్తు చేసుకునే వీలు కలుగుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత మూడు నుంచి నాలుగు నెలల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వేసవి నాటికి కొత్త టీచర్లకు శిక్షణ పూర్తిచేసి, వచ్చే విద్యా సంవత్సరంలో బడులు తెరిచే సమయానికి వారికి పాఠశాలల్లో బాధ్యతలు అప్పగించేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. కొత్త టీచర్లు వస్తే ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ స్కూళ్ల ఇబ్బందులు పరిష్కారం అవుతాయి. రాష్ట్రంలో దాదాపు 12వేల పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయి. ఆ ఒక్క టీచర్ సెలవు పెడితే ఆ రోజు బడి మూసేయాల్సి వస్తోంది. కొత్త డీఎస్సీలో చాలా పాఠశాలలకు రెండో టీచర్‌ను ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టింది. అయితే కొత్తగా టెట్ రాసేవారికి అవకాశం కల్పించాలని అభ్యర్థులు కోరడంతో మూడు నెలలు వాయిదా వేసింది. ఇటీవల టెట్ ముగియడంతో ఇప్పుడు డీఎస్సీకి సిద్ధమైంది.

టెట్ తుది 'కీ' విడుదల

ఇటీవల ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్షల(టెట్) తుది 'కీ'ని విడుదల చేసినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మంగళవారం తెలిపారు. దీనిని పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది 'కీ' విడుదల చేశామన్నారు. కాగా, నవంబరు 2న టెట్ ఫలితాలు విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 3,68,661 మంది టెట్ రాశారు. అర్హత పొందినవారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.



క్ర. సం.	వివరాలు	స్వతంత్ర					ఏకీకృత				
		ముగిసిన త్రైమాసికం 30.09.2024 (ఆడిట్ చేయబడని)	ముగిసిన త్రైమాసికం 30.09.2023 (ఆడిట్ చేయబడని)	ముగిసిన అర్ధ సంవత్సరం 30.09.2024 (ఆడిట్ చేయబడని)	ముగిసిన అర్ధ సంవత్సరం 30.09.2023 (ఆడిట్ చేయబడని)	ముగిసిన సంవత్సరం 31.03.2024 (ఆడిట్)	ముగిసిన త్రైమాసికం 30.09.2024 (ఆడిట్ చేయబడని)	ముగిసిన త్రైమాసికం 30.09.2023 (ఆడిట్ చేయబడని)	ముగిసిన అర్ధ సంవత్సరం 30.09.2024 (ఆడిట్ చేయబడని)	ముగిసిన అర్ధ సంవత్సరం 30.09.2023 (ఆడిట్ చేయబడని)	ముగిసిన సంవత్సరం 31.03.2024 (ఆడిట్)
1.	నిర్వహణల నుండి మొత్తం ఆదాయం (నికర)	34721.07	31472.18	68741.30	61295.26	127654.37	38006.05	33891.21	74971.80	66150.62	139164.94
2.	నికర లాభం/(నష్టం) (పన్ను, అసాధారణమైన మరియు / లేదా అసాధారణ అంశాల ముందు)	5402.54	5007.63	10736.34	9892.72	19704.98	5599.95	5218.30	11112.27	10316.62	20495.77
3.	పన్నుకు ముందు నికర లాభం/(నష్టం) (అసాధారణమైన మరియు / లేదా అసాధారణ అంశాల తర్వాత)	5402.54	5007.63	10736.34	9892.72	19704.98	5599.95	5218.30	11112.27	10316.62	20495.77
4.	పన్నుకు తరువాత నికర లాభం / (నష్టం)-(అసాధారణమైన మరియు / లేదా అసాధారణ అంశాల తర్వాత)	4014.53	3606.14	7919.81	7140.98	14554.33	4187.76	3797.67	8255.27	7536.60	15278.57
5.	ఆ కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [ఆ కాలానికి లాభం / (నష్టం) కలిగియున్నది (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)]	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి
6.	చెల్లించిన ఈక్విటీ షేర్ క్యాపిటల్	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13
7.	రిజర్వ్స్ (రీవాల్యుయేషన్ రిజర్వ్ మినహా)					76036.15					81200.60
8.	సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్	13919.01	13919.01	13919.01	13919.01	13919.01	13983.85	13983.85	13983.85	13983.85	13983.85
9.	నికర విలువ	82808.07	67479.91	82808.07	67479.91	71828.80	88148.68	72198.71	88148.68	72198.71	76894.65
10.	పెయిడ్-అప్ డెట్ క్యాపిటల్ / అవుట్ స్టాండింగ్ డెట్	54639.10	35736.10	54639.10	35736.10	41639.10					
11.	మిగిలి ఉన్న రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లు	-	-	-	-	-					
12.	డెట్ ఈక్విటీ రేషియో	0.63	0.53	0.63	0.53	0.57					
13.	ఒక్కో షేర్ కి సంపాదన (ఒక్కొక్కటి రూ.10/-) వివరణ 3 చూడండి (కొనసాగించబడుతున్న మరియు నిలిపివేసిన కార్యకలాపాల కోసం)										
	1. బేసిక్	4.43	19.88	8.73	39.36	80.23	4.62	20.93	9.10	41.54	84.22
	2. డైల్యూటెడ్	4.43	19.88	8.73	39.36	80.23	4.62	20.93	9.10	41.54	84.22
14.	క్యాపిటల్ రిడెంప్షన్ రిజర్వ్	-	-	-	-	-	-	-	-	-	-
15.	డిబెంచర్ రిడెంప్షన్ రిజర్వ్	-	-	-	-	-	-	-	-	-	-
16.	డెట్ సర్వీస్ కవరేజ్ రేషియో	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు
17.	ఇంటరెస్ట్ సర్వీస్ కవరేజ్ రేషియో	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దెబ్బకు దెబ్బ!

ఇరాన్ క్షిపణి దాడికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసిన ఇజ్రాయెల్ అధినేత బెంజమీన్ నెతన్యాహూ మూడువారాల తరువాత దానిని నెరవేర్చారు. శనివారం తెల్లవారుజామున, ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలమీద వందలాది విమానాలతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. అక్టోబర్ 1న రెండువందల మిసైళ్ళు ప్రయోగించి, ఇజ్రాయెల్‌ను గతంలో కంటే గట్టిదెబ్బే కొట్టిన ఇరాన్‌కు, ఘాటుగా, ధీటుగా జవాబు చెప్పాలన్న ఒత్తిడి నెతన్యాహూ మీద బలంగా ఉంది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టులాంటి చమురు కేంద్రాలను సర్వనాశనం చేయాలని, అణుకేంద్రాలను కూల్చడానికి ఇంతకుమించిన తరుణం ఉండబోదని నెతన్యాహూకు మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలు వీరంగం వేశాయి. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో, నలుదిక్కులా విసిరేసినట్టు ఉన్న ఇరాన్ అణుస్థావరాలను దెబ్బతీయడం ఇజ్రాయెల్‌కు కష్టమే కానీ, ఇజ్రాయెల్ ప్రతీకారంలో చమురుస్థావరాలు ప్రధానంగా దెబ్బతింటాయని అప్పట్లో విశ్లేషణలు వెలువడ్డాయి. అయితే, ఎంతో ఆలస్యంగా ప్రతీకారం తీర్చుకున్నప్పటికీ, ఇజ్రాయెల్ ఇప్పటి దాడి రక్షణరంగ నిపుణులకు సైతం ఆశ్చర్యం కలిగించింది. కొద్దిమంది సైనికులు తప్ప, ప్రధానంగా పౌరులకు ప్రమాదం వాటిల్లకుండా అనేక గంటలపాటు సాగిన ఈ దాడిలో సైనికస్థావరాలు, ఆయుధాగారాలు బాగా దెబ్బతిన్నాయి. చమురు క్షేత్రాలు, అణుక్షేత్రాల జోలికి ఇజ్రాయెల్ పోలేదు. కానీ, క్షిపణి తయారీలో వాడే ఇంధనం ఉత్పత్తి కేంద్రాన్ని ధ్వంసం చేసింది, మిసైల్, డ్రోన్ తయారీ కేంద్రాలు నాశనమైనాయి. ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టామని, నష్టం నామమాత్రమని ఇరాన్ అంటున్నప్పటికీ, ఇజ్రాయెల్ దెబ్బకు ఇరాన్ మరో రెండేళ్ళవరకూ తన అణుకార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోలేదని కొన్ని విశ్లేషణలు అంటున్నాయి. ఇరాన్ గగనతల రక్షణవ్యవస్థ ఎంత బలహీనంగా ఉన్నదో ఈ దాడి తేల్చేసింది. చేతకాక కాదు, ఒక హెచ్చరికగా మాత్రమే ఈ దాడి చేశానని ఇజ్రాయెల్ చెప్పదల్చుకున్న విషయం సుస్పష్టం. కానీ, దెబ్బకు దెబ్బ అనే ఈ విషవలయం ఇప్పట్లో ఆగేది కాదు. ఈ ప్రకటిత దాడి పశ్చిమాసియాను మరింత ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి నెట్టేసింది.

ఇరాన్‌కు శక్తిలేదని కాదు కానీ, అమెరికా అండ, అమ్ములపొదిలో అత్యాధునికమైన ఆయుధాలూ ఉన్న ఇజ్రాయెల్‌తో పోరాడటం ఇరాన్‌కు అంతసులువు కాదు. ఇరాన్‌ను ఆంక్షలతో చుట్టేసి, ఆర్థికంగా నలిపేసి, సొంతంగా హెలికాప్టర్ విడిభాగాలను కూడా తయారుచేసుకోనివ్వని అమెరికా, మరోపక్క ఇజ్రాయెల్‌కు ఎఫ్–35 వంటి అధునాతన యుద్ధవిమానాలు ప్రసాదించిన విషయం తెలిసిందే. అమెరికాతో పాటు పశ్చిమ దేశాలన్నీ ఇజ్రాయెల్‌కు కొమ్ముకాస్తుంటే, ఇరాన్ పక్షాన రంగంలోకి దిగేందుకు దాని మిత్రదేశాలని అంటున్న చైనా, రష్యాలు సైతం సందేహిస్తున్నాయి. అయినా, ఇటీవల ఇజ్రాయెల్ తనకు చేసిన వరుస అవమానాలకు ఇరాన్ స్పందించింది. జూలైలో హమాస్ పొలిటికల్ చీఫ్ ఇస్మాయెల్ హనియేను టెహ్రాన్‌లో హత్యచేయడం, మరుసటి నెల హిజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను చంపేయడం వంటి చర్యల ద్వారా ఇరాన్‌ను ఇజ్రాయెల్ అవమానించింది, సవాల్ విసిరింది. దీనికి ప్రతిగా క్షిపణిదాడులు జరుపుతూ ఇది సంకేతాత్మక చర్య మాత్రమేనని, ఇక చాలునని ఇరాన్ ఓ మాటన్నది. అంతమాత్రాన ఇజ్రాయెల్ తిరిగి ప్రతీకారం తీర్చుకోకుండా ఉండదు కానీ, ఎంతగా దెబ్బతిన్నప్పటికీ, ఎంతోకొంత తిరిగి దెబ్బతీయగలస్థితిలో ఇరాన్ ఉంటుందన్న విషయాన్ని మిగతా ప్రపంచం కూడా గుర్తుపెట్టుకోవాలి. ఇరాన్ తలుచుకుంటే అంతర్జాతీయ చమురు సరఫరా వ్యవస్థ సైతం దెబ్బతినిపోవచ్చు. ఇప్పటివరకూ సాగిన పోరాటంలో ఇజ్రాయెల్‌దే పైచేయి అయినమాట నిజం. పాశ్చాత్యదేశాల ఆర్థిక, ఆయుధ సహకారంతో అది ఏకకాలంలో అనేకమంది శత్రువులతో యుద్ధం చేస్తోంది, పైచేయి సాధించింది. గాజాలో ఆరంభమైన యుద్ధాన్ని హమాస్, హిజ్బొల్లా, హౌతీల మీదుగా ఇరాన్ వరకూ విస్తరించింది. శత్రుశేషం ఉండనివ్వనంటూ ఇజ్రాయెల్ ఏడాదికి పైగా సాగిస్తున్న యుద్ధాన్ని ఇలా నిరవధికంగా కొనసాగనివ్వడం ప్రమాదం. ఈ నెల 17న హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ మరణించగానే, ఇజ్రాయెల్ ఇక ఈ శుభవార్తతో యుద్ధం ఆపివేయాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఓ మాటన్నారు. కానీ, అటు హమాస్, ఇటు ఇజ్రాయెల్ పాతపాటే పాడుతూ యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల తరువాతైనా ఈ పరిస్థితిలో మార్పువస్తే బాగుండును.

విజ్ఞాన జగత్తులో జెండర్ సమత్వం

మహిళా భౌతిక శాస్త్రవేత్తల తొలి అంతర్జాతీయ సమావేశం 2002లో పారిస్‌లో జరిగింది. భారత ప్రతినిధిగా పాల్గొన్న రోహిణీ గాడ్బోలే దృష్టికి, ఆ సదస్సు సందర్భంగా వచ్చిన కొన్ని వాస్తవాలు రెండు దశాబ్దాల అనంతరం, వైజ్ఞానిక పరిశోధనల విషయమై మన విధానంలో ఒక ప్రయోజనకరమైన మార్పుకు దోహదం చేశాయి. 2020లో భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం రూపొందించిన 'సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ పాలసీ (STIP)' డాక్యుమెంట్‌లో మహిళలకు సమానవకాశాలు కల్పించే దిశగా 'ఈక్విటీ అండ్ ఇంక్లూజన్' అనే అధ్యాయం రావడానికి రోహిణీ గాడ్బోలే ప్రధాన కారకురాలు అనడంలో అతిశయోక్తి లేదు. వైజ్ఞానిక పరిశోధనల విధానపత్రంలో ఆ వినూత్న మార్పు ప్రభావం ఇప్పటికిప్పుడు స్పష్టంగా లేకపోయినా పది, పదిహేనేళ్ల తరువాత కొట్టొచ్చినట్లు కనిపిస్తుందనడంలో సందేహం లేదు. ప్రొఫెసర్ రోహిణి తీసుకున్న మరో ప్రగతిశీల నిర్ణయం ఫలితంగా 2008లో 'లీలావతి డాటర్స్– : ది ఉమెన్ సైంటిస్ట్స్ ఆఫ్ ఇండియా' అనే విలువైన పుస్తకం రావడం ఆ గమనంలో ఒక అర్థవంతమైన మజిలీ.

ప్రొఫెసర్ రోహిణి గాడ్బోలే 2024 అక్టోబర్ 25 ఉదయం నిద్రలోనే అంతిమ శ్వాస విడిచినట్టు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్' ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఆ సంస్థలోనే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సెర్న్ (CERN)లో కూడా ఆమె పరిశోధనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బోధించారు. పార్టికల్ ఫినోమెనాలజీ, స్టాండర్డ్ మోడల్ ఆఫ్ పార్టికల్ ఫిజిక్స్ హై ఎనర్జీ ఫిజిక్స్ రంగాలలో రోహిణి మూడు దశాబ్దాలకు పైగా పరిశోధనలు చేశారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'హై ఎనర్జీ ఫోటో హైడ్రానిక్ [illegible]ర్' రూపురేఖలను వివరించడానికి ఆమె ప్రయత్నించారు. ఇది తర్వాత కాలంలో ఎంతో ప్రభావం చూపే పరిశోధన. అంతకుమించి భారత వైజ్ఞానిక రంగంలో మహిళలకు సమాన అవకాశాల కల్పనకు రోహిణీ గాడ్బోలే ఎంతో కృషి చేశారు. మహిళా శాస్త్రవేత్తలకు మరింత విద్యా ప్రోత్సాహం ఇచ్చి, వారిలో పరిశోధనా స్ఫూర్తిని నింపిన వైజ్ఞానికురాలు రోహిణీ గాడ్బోలే. 2019లో పద్మశ్రీ పురస్కారం, ఐఐటి కాన్పూరు గౌరవ డాక్టరేట్, సత్యేంద్రనాథ్ బోస్ మెడల్ మొదలైన వాటితోపాటు ఫ్రెంచ్ ప్రభుత్వ ఆర్డర్ ఆఫ్ నేషనల్ మెరిట్‌ను కూడా ఆమె పొందారు.

1848లో సావిత్రి బాయి పూలే కారణంగా దేశంలో తొలి బాలికల పాఠశాల, 1884లో మహదేవ్ గోవింద్ రణడే పూనికతో దేశంలోనే తొలి బాలికల ఇంగ్లీషు పాఠశాల మొదలైన పూణే నగరంలో 1952 నవంబర్ 12న రోహిణి ఒక విద్యాధికుల కుటుంబంలో నాల్గవ బిడ్డగా జన్మించారు. తండ్రి ఆదివారం పూట తన చిన్నారి కుమార్తెలకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రచురించే సైన్సు వార్తలు, వ్యాసాలు వివరించి చెప్పేవారు. ఉదయం సంస్కృతంలో సాగే ఆధ్యాత్మిక విషయాలు వినపడినా రాత్రి భోజనాల దగ్గర మాత్రం సాహిత్యం, రాజకీయాలు, చరిత్ర, కళలు, సంగీతం, ఆర్థిక పరిస్థితులు వంటి విషయాలు లోతుగా చర్చకు వచ్చేవని రోహిణి రెండేళ్ల క్రితం రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అసలు ఇంగ్లీషు లేకుండా ఏడవ తరగతి దాకా మరాఠీ మీడియంలో చదివినా తాను చిన్నప్పుడు విన్న గెల్ మాన్ (Gell Mann) జ్విగ్ (Zweig) శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన క్వార్క్స్ (Quarks) సిద్ధాంతం తర్వాతి కాలంలో రోహిణికి జీవితకాలపు పరిశోధనా ఆసక్తిగా మారిపోయింది.



రోహిణీ గాడ్బోలే
1952 – 2024

> 'పరిశోధనారంగంలో వివక్ష' అనే అంశంపై పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు రోహిణీ గాడ్బోలేలో కొత్త ఆలోచనలను రేకెత్తించింది. ఒక నూతన దృక్పథంతో తన పాతికేళ్ల పరిశోధక జీవితాన్ని నిశితంగా పరిశీలించుకునేట్టు ఆమెను ప్రేరేపించింది. భారతదేశ వైజ్ఞానిక పరిశోధనా రంగంలో ఉన్న వివక్షను, మహిళా శాస్త్రవేత్తల పరిశోధనా కృషికి ఎదురవుతున్న అవరోధాలను అధ్యయనం చేసి ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో మార్పులు వచ్చేట్టు చేసిన అపురూప శాస్త్రవేత్త రోహిణీ గాడ్బోలే.

పూణేలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత పాఠశాలలో చదివినా అందులో ఆడపిల్లలకు కేవలం హోమ్ సైన్స్ మినహా మరో విజ్ఞాన సంబంధమైన బోధనాంశం ఉండేది కాదు. అయితే ఆమె మ్యాథ్స్ టీచర్ సొవాని, ఆమె భర్త, సైన్స్ టీచర్ బాప్ సొవాని తోడ్పాటు, ప్రోత్సాహంతో మరాఠీ సైన్స్ మేగజైన్ 'సృష్టి విగ్యాన్' కారణంగా సైన్స్ సంబంధిత ఆసక్తి ఆమెలో బలపడింది. ఆ కారణంగానే ఉన్నతపాఠశాల స్థాయిలో జనరల్ సైన్స్ మరింత బోధించాలని, ల్యాబ్ మరింత మెరుగ్గా ఉండాలని ఉన్నత పాఠశాల విద్యార్థినిగా ఉన్నప్పుడే ఆమె గట్టిగా సూచించారు. పెద్దక్క తీసుకుని వచ్చిన నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ అప్లికేషన్ రోహిణీ విద్యాసక్తులను ఒక కొత్త మలుపు తిప్పింది. ఆ ఉపకార వేతనం కారణంగా ఎన్నో సైన్స్ పుస్తకాలు కొని చదవడానికి అవకాశం కల్పించింది. అలాగే సెలవుల్లో ఐఐటి కాన్పూర్, ఐఐటి ఢిల్లీ వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థల్లో నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే వెసులుబాటు లభించింది. అందులో ఎంతో మంది యోగ్యులైన మిత్రులు లభించడం అనేది రోహిణి జీవితంలో చాలా కీలకంగా మారింది. అలా పరిచయమైన స్నేహితులలో నోబుల్ బహుమతి పొందిన వెంకీ రామకృష్ణన్, ఖగోళ శాస్త్రవేత్త రమేష్ నారాయణ కూడా ఉన్నారు. అలాగే ఐఐటి బొంబాయిలో ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీ ఉమెన్‌కు సంబంధించిన స్కాలర్‌షిప్ అప్లికేషన్ ఆమెను విదేశాల్లో చదివించేలా మలుపు తిప్పింది. అయితే అక్కడ పిహెచ్.డి అయిపోయిన తర్వాత అవకాశాలున్నా స్వదేశానికి తిరిగి వచ్చి ముంబైలోని టీఐఎఫ్ఆర్‌లో పనిచేశారు. 1995లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో చేరారు. ఈ సంస్థలో ఆమె పరిశోధకురాలుగానే కాకుండా ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ నిర్వహించే ఫిజిక్స్ జర్నల్ 'ప్రమాణ'కు ఎడిటర్‌గా కూడా వ్యవహరించారు. మాన్యూల్ డ్రీస్, ప్రబీర్‌రాయ్‌తో కలసి రాసిన 'సూపర్ సిమెట్రీ' ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులు, విద్యార్థులు అధ్యయనం చేస్తున్నారు.

పరిశోధనారంగంలో వివక్ష అనే అంశంపై పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు రోహిణిలో కొత్త ఆలోచనలను పురిగొల్పింది. ఫలితంగా ఒక నూతన దృక్పథంతో తన పాతికేళ్ల పరిశోధక జీవితాన్ని నిశితంగా పరిశీలించుకునేట్టు ఆమెను ప్రేరేపించింది. మేరీ క్యూరీ వంటి వారి జీవితాలు గొప్పస్ఫూర్తిగా మనకు అందుబాటులో ఉన్నా, ఆమె చేరిన స్థాయి మామూలు విద్యార్థులకు కించిత్ భయాన్ని కూడా కలిగిస్తుంది. కనుక స్థానికంగా మన దేశంలోని ప్రతికూల పరిస్థితులను నిభాయించుకుని విజయం సాధించిన మహిళా శాస్త్రవేత్తలను పరిచయం చేసేందుకు సంకల్పించిన రోహిణి, రామ్ రామస్వామితో కలిసి 'లీలావతి డాటర్స్– : ది ఉమెన్ సైంటిస్ట్స్ ఆఫ్ ఇండియా' అనే స్ఫూర్తిదాయక గ్రంథాన్ని రాశారు. 2008లో బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఆ పుస్తకాన్ని ప్రచురించింది. 12వ శతాబ్దానికి చెందిన భాస్కరుడు బాలవితంతువైన తన కూతురు లీలావతికి వినోదం కలిగించేందుకు 'లీలావతి గణితం' రాశారనే చారిత్రక ఐతిహ్యం ఒకటి ఉన్నది. ఆ స్ఫూర్తితోనే రోహిణి తన పుస్తకానికి 'లీలావతి డాటర్స్' అని నామకరణం చేశారు. ఈ పుస్తకం మూడో ఎడిషన్‌లో జానకి అమ్మాళ్, అసిమా చటర్జీ, అన్నమణి, కమలాసోనీ మొదలైన వైజ్ఞానిక విదుషీమణుల జీవిత కథనాలతో పాటు మరో 90 మంది మహిళా శాస్త్రవేత్తలు తాము పరిశోధనా రంగంలో చవిచూసిన అనుభవాలను వివరిస్తూ రాసిన వ్యాసాలు ఉన్నాయి. భారతదేశ వైజ్ఞానిక పరిశోధనా రంగంలో ఉన్న వివక్షను, మహిళా శాస్త్రవేత్తల పరిశోధనా కృషికి ఎదురవుతున్న అవరోధాలకు సంబంధించి తొలిసారి పూర్తిగా దృష్టి పెట్టి, అధ్యయనం చేసి ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో మార్పులు వచ్చేట్టు దోహదం చేసిన అపురూప శాస్త్రవేత్త రోహిణీ గాడ్బోలేకు మనందరం నివాళులు అర్పించాలి.

● నాగసూరి వేణుగోపాల్

న్యాయ నిర్ణయాలలో ఆ స్వతంత్రత ఏదీ?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

అయోధ్యలో బాబ్రీ మసీదు తాళాలు తెరిచి, రామ్ లల్లా విగ్రహాన్ని భక్తుల సందర్శనానికి వీలు కల్పించేలా 1986లో ఫైజాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ కెఎం పాండే ఆదేశాలు జారీ చేశారు. 'ఆ రోజు విచారణ జరుగుతున్నంత సేపు ఒక నల్లటి కోతి కోర్టు గది కప్పుపై కూర్చుని ఉండేది. తుది తీర్పు వినేందుకు వచ్చిన వేలాది ప్రజలు ఆ కోతికి పళ్లు, ఇతర ఆహార పదార్థాలు ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం వాటిని ముట్టుకునేది కాదు. చివరకు మసీదు తాళాలు తెరవాలని సాయంత్రం 4.40 గంటలకు తీర్పు ఇచ్చిన వెంటనే ఆ కోతి అక్కడి నుంచి మాయమైపోయింది. తీర్పు ఇచ్చిన తర్వాత నేను అక్కడి నుంచి బంగళాకు చేరుకునే సరికే ఆ కోతి ఆశ్చర్యకరంగా వరండాలో కనిపించింది. ఇది దైవిక శక్తి కాకపోతే మరేమిటి?' అని పాండే తన ఆత్మకథ 'వాయిస్ ఆఫ్ కాన్షియస్' (అంతరాత్మ స్వరం)లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కూడా అన్నీ దైవ సంకల్పితాలని నమ్మేవారిలో ఒకరు. అయోధ్యలో వివాదాస్పద భూమిని రామమందిర నిర్మాణానికి అప్పగించి, మసీదుకోసం వేరే స్థలం కేటాయించాలన్న సుప్రీంకోర్టు తుది తీర్పు కూడా దైవ ఘటనే అని ఆయన విశ్వసించారు! అయోధ్య సమస్యకు పరిష్కారం చూపాలని తాను ఇంట్లో దేవుడి విగ్రహం ముందు కూర్చుని ప్రార్థించానని జస్టిస్ చంద్రచూడ్ కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో ఒక సమావేశంలో వెల్లడించారు. భారతదేశంలో విశ్వాసాల విషయంలో ఒక జిల్లా మెజిస్ట్రేట్‌కూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ పెద్ద తేడా లేదని ఈ ఉదంతాలు నిరూపిస్తాయి.

ఎవరు అవునన్నా, కాదన్నా, రాజ్యాంగం, రూల్ ఆఫ్ లా, చట్టాలతో పాటు మన దేశంలో మనిషి భక్తి విశ్వాసాలు, నమ్మకాలు కూడా కీలకమైన పదవుల్లో ఉన్న వారి నిర్ణయాలను ప్రభావితం చేయకతప్పదు. చాలా అరుదైన వ్యక్తులు మాత్రమే తమ వ్యక్తిగత విశ్వాసాలను, నమ్మకాలను పక్కన పెట్టి తాము తీసుకున్న నిర్ణయాలు ఈ రాజ్యాంగం ప్రకారం, దేశ చట్టాల ప్రకారం సరైనవా కాదా అని మాత్రమే చూస్తారు. వచ్చే వారం పదవీవిరమణ చేయనున్న జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ల పనితీరును అంచనా వేయాలంటే ఆయన ఈ రెండేళ్లలో ఇచ్చిన తీర్పులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన వ్యవహరించిన తీరును పరిశీలించాల్సి ఉంటుంది. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో మాకు మా విధుల గురించి బాగా తెలుసు. రాజకీయ కార్యనిర్వాహక వర్గానికీ వారి విధుల గురించి తెలుసు. ఏ న్యాయమూర్తీ న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ముప్పు రానివ్వరు.' అని జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల ముంబైలో లోక్‌సత్తా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ అన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన నివాసానికి వచ్చి పూజలు చేసిన విషయం వివాదాస్పదం కావడం గురించి మాట్లాడుతూ ఆయన ఈ వివరణ ఇచ్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే జస్టిస్ చంద్రచూడ్ ఈ వ్యాఖ్య ద్వారా ప్రభుత్వం తరఫున కూడా వివరణ ఇచ్చారు. న్యాయమూర్తి తనకు తన విధుల గురించి తెలుసని చెప్పుకోగలరు కాని ఇతరులకు కూడా తమ విధుల గురించి తెలుసని ఎలా చెప్పగలరు?

రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు పరిరక్షిస్తుందని మన రాజ్యాంగవేత్తలు, న్యాయనిపుణులు భావిస్తారు. సుప్రీంకోర్టు తొలి దశకంలో (1950–60) కనియా, పతంజలి శాస్త్రి, మెహర్‌చంద్ మహాజన్, ముఖర్జీ, ఎసఆర్ దాస్ వంటి ప్రముఖుల నాయకత్వంలో రాజ్యాంగంలోని మూడు విభాగాల మధ్య ఖచ్చితమైన సమతుల్యం ఏర్పడేలా చూశారు. ఆ తర్వాతి దశకంలో (1960–70) నెహ్రూ మరణానంతరం ఏర్పడిన రాజకీయ అస్థిరత, ఆర్థిక అస్థిరత్వం అవినీతి పెచ్చరిల్లడం తదితర పరిస్థితుల్లో సుప్రీం తన భూమికను తాను నిర్వచించుకుంది. ఈ కొత్త మార్పుకు తెలుగువాడైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా సుబ్బారావు సారథ్యం వహించారు. గోలక్‌నాథ్ కేసు, ప్రీవీ పర్సు కేసు, బ్యాంకు జాతీయాకరణ కేసులపై చరిత్రాత్మక తీర్పులు ఇదే కాలంలో వచ్చాయి. రాజకీయ గుత్తాధిపత్యానికి ఈ తీర్పులు అడ్డుకట్ట వేసి ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశాయి. ఈ కేసులను చెల్లకుండా చేసేందుకు 1971 తర్వాత పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేసింది. ఈ కాలంలో కూడా కోర్టులు ప్రభుత్వాన్ని ప్రతిఘటించాయి. కేశవానంద భారతి కేసులో ప్రాథమిక హక్కులతో పాటు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత ఈ దేశంలో సర్వోన్నత న్యాయస్థానం అధికారాలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ కోర్టు తట్టుకుని నిలబడింది.

ఎమర్జెన్సీ అనంతరం 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 1978లో మనేకా గాంధీ కేసులో కోర్టు వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది. మినర్వా మిల్, వామనరావు కేసుల్లోనూ రాజ్యాంగంలోని మౌలిక స్వరూపానికి కోర్టు రక్షణలు కల్పించింది. 1980 తర్వాత కోర్టులు పేదలు, నిస్సహాయులు, అణగారిన వర్గాల తరఫున నిలబడేందుకు, ఖైదీల ప్రయోజనాలు కాపాడేందుకు, రూల్ ఆఫ్ లాను కాపాడేందుకు ప్రాధాన్యతనిచ్చాయి. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)కు ఇదే కాలంలో ప్రాచుర్యం లభించింది. భగవతి, కృష్ణయ్యర్, దేశాయి, చిన్నప్పరెడ్డి, జస్టిస్ థాకర్ లాంటి వారు ఒక టీమ్‌గా పనిచేసి సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని పెంచారు. 1990వ దశకంలో కూడా ఇందిరా సహానీ, ఎసఆర్ బొమ్మై, విశాఖ, సమతా, మోహినీ జైన్ తదితర కేసుల్లో కీలకమైన తీర్పులు వచ్చాయి. రిజర్వేషన్లు కల్పించడం, రాష్ట్రపతి పాలనను దుర్వినియోగం చేయడం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు అరికట్టడం, ఆదివాసీ ప్రాంతాలను మైనింగ్ దోపిడీ నుంచి పరిరక్షించడం, చదువుకునే హక్కును జీవించే హక్కుగా మార్చడం మొదలైన అంశాలపై అనేక కీలక తీర్పులు వెలువడ్డాయి.

సంస్కరణల అనంతరం కోర్టు తీర్పుల స్వరూప, స్వభావాలు మారినప్పటికీ ప్రైవసీ, మానవ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ వంటి అంశాలపై కీలకమైన తీర్పులు వెలువడ్డాయి. జస్టిస్ వెంకటాచలయ్య లాంటి ప్రధాన న్యాయమూర్తులు ప్రధానమంత్రులను సుప్రీంకోర్టుకు ఆమడ దూరంలో ఉంచారు. ఆయన తర్వాత జస్టిస్ జెఎస్ వర్మ, జస్టిస్ దీపక్ మిశ్రా వంటి వారు కీలకమైన తీర్పులను వెలువరించారు. మూక ఊచకోత లాంటి వాటిని తీవ్రంగా గర్హించడంతో పాటు స్త్రీలు, గే ల విషయంలో చెప్పుకోదగ్గ తీర్పులు ఇచ్చిన జస్టిస్ దీపక్ మిశ్రాను విలేఖరుల సమావేశంలో విమర్శించిన జస్టిస్ గొగోయ్ తర్వాతి కాలంలో వివాదాస్పదుడై పదవీ విరమణ అనంతరం రాజ్యసభ సభ్యత్వాన్ని పొందారు.



> ప్రభుత్వ ప్రతి నిర్ణయాన్ని న్యాయవ్యవస్థ వ్యతిరేకించాలని ఎక్కడా లేదు. అయితే ప్రభుత్వమూ, న్యాయవ్యవస్థల మధ్య పరిధులు చెరిగిపోతున్నాయని, ప్రభుత్వ అభిప్రాయాలు, భావజాలానికి న్యాయవ్యవస్థ అనుగుణంగా నడుస్తోందని, సంపన్నులు, పలుకుబడిగల వారికే న్యాయం జరుగుతోందనే అభిప్రాయం ఏర్పడడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందా?

నిజానికి తెలుగువాడైన జస్టిస్ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీబాధ్యతలు చేపట్టే నాటికి ఆయనకు ముందున్న ముగ్గురు సిజెలు సుప్రీంకోర్టు ప్రమాణాలను తగ్గించారనే విమర్శలు ఉండేవి. ఆ ప్రమాణాలను నిలబెట్టడమే ఆయనకు తలకు మించిన పని అయింది. జస్టిస్ రమణ సుప్రీం న్యాయమూర్తిగా ఉన్న కాలంలోనే మహారాష్ట్రలో రాత్రికి రాత్రి ప్రభుత్వాన్ని పడగొట్టడాన్ని వ్యతిరేకించి తక్షణం సభలో విశ్వాస పరీక్షకు ఆదేశించడంతో ఉద్ధవ్ థాకరే ప్రభుత్వం మళ్లీ కొనసాగగలిగింది. రమణ సిజె అయిన తర్వాత కూడా ఇచ్చిన తీర్పుల ప్రాముఖ్యత ఎంతో ఉన్నది. అనురాధా బాసిన్ కేసులో ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ కశ్మీర్‌లో ఇంటర్నెట్ పునరుద్ధరించడం, లఖీంపూర్ ఖేరీ హత్యాకాండపై విచారణకు ఆదేశించడం, బెయిల్ వచ్చిన వెంటనే ఖైదీలు విడుదలయ్యేందుకు ఫాస్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టడం, కేరళ జర్నలిస్టు సిద్దిఖీ కప్పన్‌కు తక్షణ వైద్య సహాయం అందేలా చూడడం, ట్రిబ్యునల్స్‌కు వెంటనే ఛైర్మన్లను నియమించాలనడం వీటిలో ఉన్నాయి.

జస్టిస్ రమణ తర్వాత సిజె అయిన ఉదయ్ ఉమేష్ లలిత్ ఎక్కువ కాలం ఉండలేదు. కాని జస్టిస్ చంద్రచూడ్‌కు ఎక్కువకాలం ఉండే అవకాశం వచ్చింది. ఆయన ప్రైవసీ హక్కు, ఢిల్లీలో అక్రమంగా కట్టిన సూపర్ టెక్ ట్విన్ టవర్స్‌ను కూలగొట్టడం, అబార్షన్ హక్కులను అవివాహితలకు కూడా కల్పించడం, అడల్ట్రీని నేరం కాదని చెప్పడం, సేమ్ సెక్స్ సంబంధాలను ఆమోదించడం వంటి చెప్పుకోదగ్గ తీర్పులు ఇచ్చారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా తన పేరు చర్చకు వచ్చే కేసులపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాని ఆయన హయాంలో ఎలెక్టోరల్ బాండ్ల విషయంలో కీలక తీర్పు వెలువడింది. అయితే జరిగిందేమిటి? ఎలెక్టొరల్ బాండ్లు అక్రమం అని సిజె ప్రకటించినప్పటికీ ఈ అక్రమానికి కారకులైన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? చండీఘడ్ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను చెల్లకుండా చేసిన ఎన్నికల అధికారిని క్రిమినల్‌గా అభివర్ణించారు కాని ఆయనపై కూడా ఎలాంటి చర్యా లేదు. మహారాష్ట్రలో ఏర్పడ్డ షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్ ప్రభుత్వాన్ని అక్రమమని ప్రకటించారు కాని అదే ప్రభుత్వం కొనసాగడానికి వీలు కల్పించారు. మణిపూర్ హింసాకాండపై కానీ, సాయిబాబా బెయిల్ ఆగమేఘాలపై రద్దు చేయడంలో కానీ సిజెగా ఆయన కలుగచేసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. జస్టిస్ రమణ హయాంలో బినామీ వ్యవహారాల నిషేధ చట్టం, 2016ను గతంలో ఎప్పుడో జరిగిన వ్యవహారాలకు అన్వయించడం సరి కాదని, చట్టం ఆమోదించిన నాటి నుంచీ అన్వయించాలని తీర్పు నిచ్చారు. కాని జస్టిస్ చంద్రచూడ్ ఈ తీర్పును రద్దు చేశారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించేందుకే ఈ తీర్పును రద్దు చేయించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వ నియంత్రణకు అనుమతించారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ప్రతి నిర్ణయాన్ని న్యాయవ్యవస్థ వ్యతిరేకించాలని ఎక్కడా లేదు. అయితే ప్రభుత్వమూ, న్యాయవ్యవస్థల మధ్య పరిధులు చెరిగిపోతున్నాయని, ప్రభుత్వ అభిప్రాయాలు, భావజాలానికి న్యాయవ్యవస్థ అనుగుణంగా నడుస్తోందని, సంపన్నులు, పలుకుబడి గల వారికే న్యాయం జరుగుతోందనే అభిప్రాయం ఏర్పడడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

సృజనశీలతలో నవ తరంగం

'కృత్రిమ మేధ వలన కార్మికుల ఆదాయాలలో కోత పడింది. ఈ ఆదాయ క్షీణతకు ప్రధాన కారణం కృత్రిమ మేధ సంబంధించిన ఆటోమేషన్ -ఆధారిత ఆవిష్కరణలు'

– అంతర్జాతీయ కార్మిక సంస్థ World Employment and Social Outlook 2024 నివేదిక.

అసలు కృత్రిమ మేధ అంటే ఏమిటి? కృత్రిమ మేధకు సంబంధించి ప్రస్తుతం ప్రపంచంలో వస్తున్న మార్పులు ఏమిటి? ఆ మార్పుల ప్రభావం ఉద్యోగాలపై ఎలా ఉంటోంది? తదితర అంశాలను ఈ సందర్భంగా చర్చించాల్సిన అవసరమున్నది.

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ) మన రోజువారి జీవితంలో ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, మీరు సిరి లేదా గూగుల్ అసిస్టెంట్ లాంటి వాయిస్ అసిస్టెంట్‌ని ఉపయోగించి, 'ఈ రోజు వాతావరణం ఎలా ఉంది?' అని అడిగితే, ఎఐ మీ ప్రశ్నను అర్థం చేసుకుని సమాధానం ఇస్తుంది. అలానే మీరు కంప్యూటర్ కానీ మొబైల్ ఫోన్‌లో కానీ పదాలను టైప్ చేస్తూ తప్పు చేస్తే, అక్షర దోషాలను ఎత్తిచూపడం, లేదా ఆటో -కరెక్ట్ చేయడం కూడా ఎఐ పని. మీరు ఫోన్‌లో యూట్యూబ్‌లో మీకు నచ్చిన వీడియోలు చూసినప్పుడు, ఎఐ వాటిని గుర్తించి, మీకు నచ్చే ఇతర వీడియోలను సిఫారసు చేస్తుంది. అలాగే, గూగుల్ మ్యాప్స్ లాంటి నావిగేషన్ యాప్‌లు మీకు అత్యంత సులభమైన దారి చూపించడం కూడా ఎఐ పుణ్యమే. ఇవన్నీ సాధారణ ఎఐ మన నిత్య జీవితంలో మన పనిని ఎలా సులభతరం చేస్తుందో చెప్పే ఉదాహరణలు.


అయితే ఇప్పుడు ఈ సాంకేతికత మరొక అడుగు ముందుకువేసింది. సాధారణ ఎఐలో ఒక పాయ మరింత అభివృద్ధి చెంది జెనరేటివ్ ఎఐ(జెన్ ఎఐ) ఏర్పడింది. జెన్ ఎఐ అనేది ఒక ప్రత్యేకమైన సృజనాత్మక మేధస్సు. ఉదాహరణకు, మీరు జెన్ ఎఐకి 'ఒక రాజు గారు- –ఏడుగురు కొడుకుల కథ' అనే అంశం ఇచ్చి కథ రాయమంటే చిటికెలో ఒక కథని సృష్టించగలదు. మీరు చిత్రాన్ని వేయాలని అడిగి, కొన్ని సూచనలు ఇస్తే, మీకు కావలసినట్లుగా ఒక అందమైన బొమ్మను గీయగలదు. మీరు కొత్త పాట రాయాలనుకుంటే, జెన్ ఎఐ మీకు ఆసక్తి ఉన్న సంగీత శైలుల ఆధారంగా ఒక కొత్త పాటను సృష్టించగలదు.

సాధారణ ఎఐకు జెన్ ఎఐకు తేడా చెప్పాలంటే సాధారణ ఎఐ అనేది ఒక తెలివైన రోబో లాంటిది, ఇది మనం ఇచ్చిన సూచనలు పాటిస్తూ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, గణిత సమస్యలు పరిష్కరించడం, సినిమాలు సూచించడం లాంటి నిర్దిష్ట పనులు చేస్తుంది. కానీ సొంతంగా ఆలోచించి కొత్తగా దేన్నీ సృష్టించలేదు. జెన్ ఎఐ మాత్రం, చాలా క్రియేటివ్ రోబో లాంటిది. ఇది చూసి, నేర్చుకున్న వాటిని ఉపయోగించి కొత్త విషయాలను సృష్టించగలదు. స్థూలంగా చెప్పాలంటే, సాధారణ ఎఐ మనం ఇచ్చిన నియమాలను పాటిస్తూ పనిచేస్తే, జెన్ ఎఐ తాను నేర్చుకున్న జ్ఞానాన్ని ఉపయోగించి కొత్త విషయాలను సృష్టిస్తుంది! అంటే సాధారణ ఎఐ పాత వంటగాడు లాంటిది: తనకు ఇప్పటికే తెలిసిన వంటకాలను మాత్రమే తయారుచేయగలదు. మీరు ఈ చెఫ్‌కు చికెన్, మసాలా దినుసులు, బియ్యం, పంచదార ఇస్తే, బహుశా ఈ దినుసులతో ఎలాంటి వంటకం సాధ్యం కాదు అనొచ్చు. కానీ జెన్ ఎఐ మాత్రం ఇప్పటివరకూ ఎవరికీ తెలియని తీపి వంటకాన్ని సృష్టించగలదు.

అసలు కృత్రిమ మేధ అనే భావన మొదట, 1950ల మధ్యలో శాస్త్రజ్ఞులు ఊహించారు. 1956లో, జరిగిన 'డార్ట్‌మౌత్ సదస్సు'లో 'కృత్రిమ మేధస్సు' అనే పదం పుట్టింది. అప్పటి నుండి కంప్యూటర్లు మానవ మేధస్సు చేయగలిగిన పనులు చేయగలవని కలలు కనడం మొదలయ్యింది. 1980వ దశకంలో, కొన్ని కొత్త కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు ఎఐ రంగంలో కొంత అభివృద్ధిని తీసుకువచ్చినప్పటికీ, కొన్ని సమస్యలు కూడా ఎదురయ్యాయి. ఉదాహరణకు, ఎఐకు శిక్షణ ఇవ్వడానికి అవసరమైన పెద్ద డేటా సెట్లు అందుబాటులో లేకపోవడం, అభివృద్ధికి కావాల్సిన కంప్యూటర్ సామర్థ్యం తక్కువగా ఉండడం వలన ఎఐ అభివృద్ధి నెమ్మదించింది. ఈ కారణంగా, ఈ కాలాన్ని 'ఎఐ శీతాకాలం' అని పిలుస్తారు.

2000ల తరువాత, సూపర్ కంప్యూటర్ల ఆగమనం, వాటికి శిక్షణ ఇవ్వడానికి పెద్ద డేటా సెట్లు అందుబాటులోకి రావడం వలన ఎఐ మళ్ళీ పుంజుకుంది.

> మానవుల్లా ఆలోచించగలిగే శక్తి 'జెనరేటివ్ ఎఐ'కు ఉన్నది. సంక్లిష్టమైన పనుల్ని మనుష్యుల కంటే వందల రెట్లు వేగంగా చేయగల అధునాతన సాంకేతికత అది. మెరుగైన జీవన ప్రమాణాలకు స్వచ్ఛమైన నీరు, విద్యుత్ వెలుగులు ఎంత కీలకమో, ఆవిష్కరణ, విద్య, వ్యక్తిగత అభివృద్ధికి జెన్ ఎఐని ఉపయోగించుకునే సామర్థ్యమూ అంతే ముఖ్యం.



2010లలో కృత్రిమ నరాలు అధునాతన దశకు చేరుకున్నాయి. ఈ నరాలు మానవ మేధస్సు ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకుని వాటిని అనుకరించడానికి సహాయపడతాయి. 2014లో, 'జనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్వర్క్స్' (GANs) అనే ఒక ప్రత్యేకమైన ఎఐ మోడల్ వచ్చింది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది: ఒక భాగం కొత్త విషయాలు సృష్టించడానికి ప్రయత్నిస్తే, మరొక భాగం ఆ విషయాల ప్రామాణికతను తనిఖీ చేస్తుంది. అంటే ఉదాహరణకు మొదటి భాగం పిల్లి బొమ్మను గీస్తే రెండవ భాగం ఆ బొమ్మ నిజమైన పిల్లికి దగ్గరగా ఉందా లేదా అని చూసి మొదటి భాగానికి ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా తనను మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతుంది. తర్వాత 2017లో, 'ట్రాన్స్‌ఫార్మర్' అనే కొత్త టెక్నాలజీ వచ్చింది. ఇది ఎఐని మంచి కథలు, గీతాలు లాంటివి సృష్టించడంలో సహాయపడుతుంది. ఒకరకంగా ఈ టెక్నాలజీ జనరేటివ్ ఎఐకి పునాది లాంటిది.

జెన్ ఎఐ మానవుల్లా ఆలోచించగలిగే శక్తి వలన చాలా ఉపయోగాలు ఉన్నాయి. విసుగు విరామం లేకుండా పదే పదే చేయాల్సిన పనులను జెన్ ఎఐ automate చేయగలదు, కంటెంట్‌ను వేగంగా సృష్టించగలదు, కొత్త ఆలోచనలను ప్రేరేపించగలదు. ప్రస్తుతానికి జెన్ ఎఐ ట్యూమర్ డిటెక్షన్, మెడిసిన్/డ్రగ్ ట్రయల్స్, విద్యార్థుల కోసం వ్యక్తిగతంగా వారికి అనుమానాలు తీర్చడానికి పలు పాశ్చాత్య దేశాలలో వాడుతున్నారు. ఎలాంటి సంక్లిష్టమైన భావనను ఐనా సరళమైన భాషలో విడమర్చి చెప్పే శక్తి జెన్ ఎఐ సొంతం. అంతే కాకుండా సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ కోడ్ రాయడం, డేటా విశ్లేషించడం తదితర సంక్లిష్టమైన పనుల్ని మనుష్యుల కంటే వందల రెట్లు వేగంగా చేయగలదు. అలానే ఎఐ వినియోగం వల్ల, గుమస్తా పనులు, డిజైనర్, సృజనాత్మక రంగాల్లో పలు పనులు సులభతరం అవుతాయి. ఇక స్థానిక భాషలలో జెన్ ఎఐ వినియోగంలోకి రావడం సాంకేతికత ప్రజాస్వామీకరణలో ఒక పెద్ద అడుగు.

ఇవన్నీ బానే ఉన్నా జెన్ ఎఐ ప్రతికూల ప్రభావాలు కూడా ఎక్కువే. గత రెండు దశాబ్దాలుగా, ఎఐలో పురోగతితో సహా సాంకేతిక ఆవిష్కరణలు కార్మిక ఉత్పాదకత, ఆర్థిక ఉత్పత్తిలో నిరంతర పెరుగుదలకు దారితీశాయని, అయితే, ఈ ఆవిష్కరణలు ఏకకాలంలో కార్మికుల ఆదాయం వాటా క్షీణతకు దారి తీశాయని ఇటీవల విడుదల అయిన World Employment and Social Outlook – 2024 నివేదిక వెల్లడించింది.

ఈ క్షీణతకు ముఖ్య కారణాలలో ఆటోమేషన్- ఆధారిత సాంకేతిక పురోగతి ఒకటి అని నివేదిక పేర్కొంది. ఎఐ ఒకవైపు ఉత్పాదకతను పెంచుతూ, మరొకవైపు మానవ శ్రమకు డిమాండ్‌ను తగ్గిస్తుందని, ఈ పరిస్థితిని మార్చడానికి బలమైన విధాన జోక్యాలు అవసరమని నివేదిక తెలిపింది. అలానే 2004 నుండి 2024 వరకు, కార్మిక ఆదాయం వాటా 1.6 శాతం పాయింట్లు తగ్గిందని, దీని ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా వారి ఆదాయంలో $ 2.4 ట్రిలియన్ క్షీణత నమోదు అయ్యిందని కూడా నివేదిక తేల్చింది. ఎఐ ఆధారిత ఆటోమేషన్, ఎఐ ఆధారిత ఆవిష్కరణలు ఈ క్షీణతకు కారణమయ్యాయని ఆ నివేదిక తెలిపింది.

అలానే కార్మిక ఆదాయంలో తగ్గుదలతో పాటు, మూలధన ఆదాయం పెరగడం వలన ఆదాయ అసమానతలు మరింత ఎక్కువవుతున్నాయి. మూలధన ఆదాయం కొంతమంది దగ్గరే కేంద్రీకృతం కావడం వలన అసమానతలు మరింత పెరుగుతున్నాయి.

సాంకేతిక పురోగతులు దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి లాభదాయకమైనప్పటికీ, తాత్కాలికంగా కార్మిక విభాగాల్లో మాత్రం సంక్షోభ స్థితికి దారితీసే పరిస్థితులు ఉన్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. అలానే జెన్ ఎఐ సాంకేతికత మొత్తం గూగుల్, మైక్రోసాఫ్ట్ తదితర బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యంలో ఉండడం ఆందోళనకరం. ఈ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా, ఓపెన్ సోర్స్ ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, న్యాయమైన పోటీకి అవకాశం కల్పించడంతో పాటు విభిన్న ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం. అలానే జెన్ ఎఐ శిక్షణ కోసం అనుమతి లేకుండా కాపీరైట్- మెటీరియల్‌ను ఉపయోగించారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

చివరిగా సాంకేతికత మన జీవితాలను లోతుగా ప్రభావితం చేస్తున్న ఈ యుగంలో, జెన్ ఎఐకి అందుబాటు అందరికీ హక్కుగా పరిగణించబడాలి. మెరుగైన జీవన ప్రమాణాలకు స్వచ్ఛమైన నీరు, విద్యుత్ సేవలు ఎంత కీలకమో, ఆవిష్కరణ, విద్య, వ్యక్తిగత అభివృద్ధికి జెన్ ఎఐని ఉపయోగించుకునే సామర్థ్యమూ అంతే ముఖ్యం అనే ఎరుక అవసరం. జెన్ ఎఐ ఫలాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడం అంటే మానవ నాగరికత సమసమాజ స్థాపన అనే విలువ దిశగా ఒక అడుగు వేసినట్లే.

■ రణధీర్ మళ్ల
పీహెచ్‌డీ విద్యార్థి, ఎక్సెటర్ యూనివర్సిటీ, ఇంగ్లాండు

■ చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకులు, లిబ్‌టెక్ ఇండియా

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
బుధవారం 30 అక్టోబరు 2024



బెజవాడలో కపిల్‌దేవ్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్‌దేవ్ మంగళవారం విజయవాడలో సందడి చేశారు. సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన ఆయన విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని)తో భేటీ అయ్యారు. ఇద్దరూ క్రికెట్‌కు సంబంధించిన పలు విషయాలపై ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా కపిల్‌దేవ్‌ను ఎంపీ చిన్ని ఘనంగా సన్మానించారు.

ఉచిత గ్యాస్ బుక్ చేసుకోండి

- వినియోగదారులకు కలెక్టర్ విజ్ఞప్తి

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పథకంలో భాగంగా లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. జిల్లాలోని 55 గ్యాస్ ఏజెన్సీలలో బుకింగ్ ప్రారంభించినట్లు తెలిపింది. ఈ నెల 31వ తేదీ నుంచి పథకం ప్రారంభమవుతుందని తెల్ల రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ ఉన్న వారందరూ అర్హులని పేర్కొంది. మార్చి 31వ తేదీలోపు ఎల్పీజీ కోసం బుక్ చేసుకోవచ్చునని తెలిపింది. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో గ్యాస్ వినియోగదారులకు ఆధార్ లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌కు నేరుగా నగదు మొత్తం జమ అవుతుందని స్పష్టం చేసింది.



జిల్లా కమిషనర్ కార్యాలయం

అధికారులే మోకాలడ్డు?

- ఆటోనగర్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికుల విన్నపాలు

8లో



మార్పుతో మెరుగైన సమాజం

- గర్భిణుల అప్రమత్తతతోనే ఆరోగ్యవంతమైన శిశువుల జననం
- ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడమే మానవ ధర్మం
- సమాజ చైతన్యం కోసం మార్పు స్వచ్ఛంద సంస్థ కృషి
- వరదల్లో పేదలకు అన్నదానం

కెరీర్ గైడెన్స్‌తో ఉన్నత జీవితం

భావి భారత పౌరుల జీవన శైలిలో వచ్చే 'మార్పు'తోనే మెరుగైన సమాజం సాధ్యం. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పాకెట్ మనీ వినియోగం, సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన కల్పించేందుకు అడుగుముందుకేసింది. పుట్టబోయే బిడ్డల మంచి కోసం నడుం బిగించింది. బుడమేరు వరద బాధితుల ఆకలి తీర్చి అండగా నిలిచింది విజయవాడలోని 'మార్పు' స్వచ్ఛంద సంస్థ. మానవ సేవే మాధవ సేవగా తలంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకుంటున్న 'మార్పు' సంస్థపై ప్రత్యేక కథనం. 8

ఇసుకపై పోలీస్ వ్యూహం

ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పోలీస్‌శాఖ చెక్ పెట్టింది. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో 17 చెక్‌పోస్టులతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రత్యేక పోలీస్ బలగాలు, డ్రోన్ల సాయంతో నిరంతర నిఘా ఏర్పాటు చేయనుంది. వాహనాల జీపీఎస్ ఓసీసీసీకి అనుసంధానం చేయడం ద్వారా ఇసుక రేణువు కూడా బయటకు పోకుండా పకడ్బందీ వ్యూహం అమలు చేస్తోంది.



ఇసుక అక్రమ రవాణా కట్టడికి పోలీస్ ప్రణాళిక

తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో 17 చెక్ పోస్టులు

- సీపీల వద్ద స్థానిక, ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గస్తీ
- చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎనిమిది మొబైల్ పార్టీలతో పెట్రోలింగ్
- ఎస్పీ, సీపీల వద్ద డ్రోన్‌ల నిఘా
- వాహనాల జీపీఎస్ ఓసీసీసీకి అనుసంధానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) ప్రభుత్వం ఒక సంకల్పంతో ప్రకటించిన ఉచిత ఇసుకకు ఖరీదు రెక్కలు వస్తున్నాయి. ఇసుక పై ఆదాయాన్ని రుచి మరిగిన స్థానిక నేతలు ధరను అమాంతంగా పెంచేశారు. ఇసుక దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే జిల్లాలో ఉన్న ఇసుకను నిర్మాణ రంగం మంచి ఊపు మీద ఉన్న హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లా నిద్రపోతున్న వేళ ఇసుక నేతలు మేతకు సిద్ధమవుతున్నారు. దొడ్డిదారిన తెలంగాణకు తరలించి కాసుల పంట పండించుకుంటున్నారు. ఇసుక నేతల అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసులు వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించారు. తెలంగాణకు పరుగులు తీస్తున్న ఇసుక వాహనాలకు కళ్లెం వేయాలని నిర్ణయించారు. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు టెక్నాలజీతో నిఘాను ముమ్మరం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పది చెక్‌పోస్టులు ఉన్నాయి. వాటిని మరింతగా పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో శివారున తెలంగాణ సరిహద్దును ఆనుకుని ఉన్న గ్రామాల్లో మొత్తం 17 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయబోతున్నాయి. తెలంగాణలోకి ప్రవేశించడానికి మార్గాలు ఉన్న అన్ని గ్రామాల్లోను ఈ చెక్‌పోస్టులు పెడుతున్నారు.

పోలీస్ అధికారులకు సీపీ హెచ్చరిక

ఇసుక అక్రమ రవాణా పెరగడం, ధరలు విపరీతంగా ఉండడంతో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో ఉన్న పోలీసు అధికారులతో కొద్దిరోజుల క్రితం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లా నుంచి ఇసుక ఒక్క రేణువు తెలంగాణలో పడినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అసలు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఏం చేయాలన్న దానిపై డీసీపీలతో సమావేశమై ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం జాతీయ రహదారిపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఉంది. దీన్ని పరిస్థితులను బట్టి వివిధ శాఖలు ఉపయోగించుకుంటాయి. దీన్ని పూర్తిస్థాయిలో వినియోగించడంతోపాటు సరిహద్దు గ్రామాల్లో కొత్తగా ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు.

ప్రత్యేక నిఘా ఏర్పాట్లు

ప్రస్తుతం పనిచేస్తున్న చెక్‌పోస్టుల్లో స్థానిక పోలీసులను ఉపయోగిస్తున్నారు. వారు అక్రమ రవాణాదారులతో కుమ్మక్కైతే మిగతా 6లో..



బాణసంచా స్టాల్స్ రెడీ

తొలి రోజు అమ్మకాలు అంతంతమాత్రమే

గోడౌన్ల దగ్గరే కొనుగోళ్లు.. అది కూడా అరకొరగా.

బుధవారం వ్యాపారంపైనే టపాసుల వ్యాపారుల ఆశలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా అమ్మకాలకు జిల్లా వ్యాప్తంగా దుకాణాలు సిద్ధమయ్యాయి. సాధారణంగా పండుగకు మూడు, నాలుగు రోజుల ముందు నుంచే కొనుగోళ్లు పతాక స్థాయిలో ఉంటాయి. ఈ సారి దుకాణాలు తెరిచినా ఆశించినంతగా సందడి కనిపించలేదు. తొలి రోజైన మంగళవారం ఐదు శాతం వ్యాపారం కూడా వీరు చేయలేకపోయారు. కొనుగోలుదారులు గోడౌన్లకే వెళుతున్నారు. అలాగని రెండు రోజుల ముందు గోడౌన్ల దగ్గర కనిపించే భారీ రద్దీ కూడా ఈ సారి కనిపించడంలేదు. పండుగకు ఇంకా ఒక్క రోజు మాత్రమే ఉండటంతో బుధవారం జరిగే వ్యాపారం మీదనే టపాసుల వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. పండుగ రోజు సాధారణంగా వ్యాపారం భారీగా జరిగే అవకాశాలు ఉంటాయి. కిందటేడాది ఇదే సమయంలో పావు వంతుకు పైగా విక్రయించటం జరిగింది. దీంతో మళ్లీ బాణసంచాను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈ దఫా ఎందుకో ఆశించిన విధంగా కొనుగోళ్లు ఉండటం లేదనిపిస్తోంది.

ఈవెంట్ డ్యాన్సర్ అనుమానాస్పద మృతి

మృతురాలి ఒంటిపై గాయాలు

- రాత్రి మద్యం పార్టీ.. తెల్లారక ఆత్మహత్య
- పోలీసుల అదుపులో ఓ యువకుడు, స్నేహితురాలు



వెంకట లక్ష్మి(ఫైల్)

విజయవాడ/అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈవెంట్ డ్యాన్సర్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే... కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన బంటుపల్లి వెంకటలక్ష్మి(36) ఈవెంట్స్‌లో డ్యాన్సర్‌గా పనిచేస్తుంది. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో పాల్గొనడానికి వెళ్లింది. అక్కడి నుంచి సోమవారం విజయవాడ ఆంధ్రప్రభ కాలనీలో ఉంటున్న స్నేహితురాలు, ఈవెంట్స్ డ్యాన్సర్ కసీం జ్యోతి ఇంటికి వచ్చింది. ఈవెంట్స్‌లోనే వారి మధ్య స్నేహం ఏర్పడింది. హైదరాబాద్‌కు చెందిన ఈవెంట్స్ నిర్వహించే శ్రావణ్ అనే యువకుడు అదే రోజున జ్యోతి ఇంటికి వచ్చాడు. జ్యోతి ఇక్కడ ఒంటరిగా నివసిస్తోంది. ఈ ముగ్గురు కలిసి రాత్రి మద్యం తాగారని సమాచారం. రాత్రంతా శ్రావణ్, వెంకటలక్ష్మి, జ్యోతి ఒకే గదిలో ఉన్నారు. మంగళవారం ఉదయం 6.45 గంటలకు శ్రావణ్ ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఆ తర్వాత వెంకటలక్ష్మి ఉరిపోసుకుంది. ఇది గమనించిన జ్యోతి ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. అప్పటికే ఆమె చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. జ్యోతి ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించారు. శ్రావణ్ ఇంటి నుంచి వెళ్లిపోయేటప్పుడు వెంకటలక్ష్మి ఇంటి తలుపులు తీసింది. అతడు వెళ్లిపోగానే ఆమె తలుపులు వేసుకుంది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల ఫుటేజీలో కనిపించాయి. వెంకటలక్ష్మి మృతదేహం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మార్చురీలో ఉంది. ఆమె కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తారు. కేసు నమోదు చేసిన అజిత్‌సింగ్ నగర్ పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లిపోతున్న శ్రావణ్‌ను సూర్యాపేట వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వెంకటలక్ష్మి స్నేహితురాలు జ్యోతిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో ముగ్గురు కలిసి మద్యం తాగామని ఆమె చెప్పినట్టు సమాచారం. తాను నిద్రలో ఉన్నప్పుడు వెంకటలక్ష్మి ఉరిపోసుకుందని పోలీసులకు వివరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆత్మహత్య విషయాన్ని వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులకు పోలీసులు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారు కాకినాడ నుంచి విజయవాడకు బయలుదేరారు. స్టేషన్‌లో శ్రావణ్, జ్యోతిని పోలీసులు వేర్వేరుగా విచారిస్తున్నారు. ఒకరికొకరు సంబంధం లేకుండా పోలీసులకు సమాధానాలు చెబుతున్నారు. ఈ కేసు మొత్తం ఒక మిస్టరీగా ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈవెంట్స్ విషయంలో ఈ ముగ్గురి మధ్య ఏమైనా వివాదాలు ఉన్నాయన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇది కాకుండా ప్రేమ వ్యవహారాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. వెంకటలక్ష్మి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయితే అసలు విషయాలు బయటకు వస్తాయని పోలీసులు చెబుతున్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా ఏపీ

- సంక్రాంతిలోగా 'ఆడుదాం ఆంధ్ర'

అక్రమార్కులపై చర్యలు: శాప్ ఛైర్మన్ అనిమిని

8లో

వైసీపీ దోపిడీ పర్వం!



తోట్లవల్లూరు మండలం కళ్లంవారిపాలెం క్వారీలో కనిపించని బాట

ఉదయం నుంచి సాయంత్రం వరకు దిగబడిన ట్రాక్టర్ వద్దే డ్రైవర్

కళ్లంవారిపాలెం ఇసుక క్వారీలో దందా

వందల సంఖ్యలో వస్తున్న ట్రాక్టర్లు

- బాట పేరుతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.200 వసూలు
- రోజుకు రూ.2 లక్షలుపైనే జేబులోకి..
- ట్రాక్టర్ దిగబడితే లాగేందుకు మరో రూ.500
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంలో అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉచితం మాటున దళారులు రంగప్రవేశం చేసి ఒక్కో ట్రాక్టర్ నుంచి బాట ఖర్చుకి రూ.200 చొప్పున రూ.లక్షల్లో వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా సాగుతున్న ఈ వ్యవహారంలో వైసీపీ సానుభూతిపరులు, ఓ వైసీపీ నేత కుమారుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

తోట్లవల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కళ్లంవారిపాలెం కృష్ణానదీ పాయలో భారీగా ఇసుక దిబ్బ ఏర్పడింది. వరద ప్రవాహం తగ్గటంతో ఈ ఇసుక కోసం జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు భీమవరం నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లు ఇక్కడకు వస్తున్నాయి. ఇసుక లోడింగ్ చేసేందుకు అనేక గ్రామాల నుంచి కార్మికులు తరలివస్తున్నారు. అయితే స్థానికులు కొందరు మాఫియాగా ఏర్పడి దోపిడీ పర్వానికి తెరతీశారు. అధికారులు పట్టించుకోకపోవటంతో మేమే రాజులం అన్నట్టు స్థానికులు తయారై ఒక్కో ట్రాక్టర్ నుంచి బాట ఖర్చుకు రూ.200 వసూలు చేయటం మొదలు పెట్టారు. కార్మికులు ఒక ట్రాక్టర్ ఇసుక లోడింగ్‌కు రూ.1200 డ్రైవర్ నుంచి వసూలు చేసి అందులో రూ.200 ఇక్కడ దళారులకు సమర్పించుకుంటున్నారు. పగలు మాత్రమే నడవాల్సిన క్వారీ రాత్రుళ్లు సైతం యథేచ్ఛగా నడుస్తోంది. ఇలా రోజుకు వెయ్యి ట్రాక్టర్లు వస్తుండగా రూ.200 చొప్పున రూ.2 లక్షలు వసూలు చేసి మొత్తం జేబులు నింపుకుంటున్నారు. బాట వేయకపోవటంతో లోడింగ్ ట్రాక్టర్లు దిగబడిపోతే దానిని మరో ట్రాక్టర్‌తో లాగేందుకు రూ.500 వసూలు చేస్తున్నారు. ఇలా ఒక ట్రాక్టర్ ఇసుకతో బయటకు వచ్చే సరికి రూ.1700 వరకు సమర్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా డబ్బులు వసూలు చేయటంలో ఓ వైసీపీ నేత కుమారుడు, వైసీపీ కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పథకం అమలు చేసినపుడు ఒక ట్రాక్టర్‌కి ఇసుక నింపితే కార్మికులకు రూ.300 చెల్లించేవారు. బాట ఖర్చుకి రూ.30 తీసుకునే వారు. కాని ఇపుడు ఏకంగా రూ.1200 వసూలు చేయటంతో వినియోగదారులపై తీవ్ర భారం పడుతోంది. ట్రాక్టర్ ఇసుకను రూ.7 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇసుక క్వారీని వదిలేయటంతో వినియోగదారులకు శాపంగా మారింది. తక్కువ ఖర్చుకి ఇసుక లబ్ధిదారుడికి చేరాలన్న సీఎం చంద్రబాబు ఆశయం నీరు గారిపోతోంది.

నాడు ట్రాక్టర్‌కి రూ.300
నేడు రూ.1200

క్వారీలో ఘర్షణ

కళ్లంవారిపాలెం క్వారీలో మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్లు, ఎడ్ల బండ్ల యజమానుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసులు, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి క్వారీకి వెళ్లినా అక్కడి పరిస్థితులు ఏ మాత్రం మారలేదు. కళ్లంవారిపాలెం ఉచిత ఇసుక క్వారీ విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా ఉచిత క్వారీపై మాకింకా ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదన్నారు. వరద నీరు తగ్గటంతో ఇసుక కోసం వాహనాలతో వచ్చేస్తున్నారని చెప్పారు. వారిని అదుపు చేయలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం మాకు అనుమతి ఇచ్చిందని చెపుతున్నారని, క్వారీలో బాట కోసం డబ్బులు వసూలు చేసేది ఎవ్వరో తెలియదన్నారు.


విజయవాడ స్టేషన్‌లో పరిశీలిస్తున్న గైడెడ్ మీడియా టూర్ బృందం

పండగ రద్దీకి రైల్వే సిద్ధం

- విజయవాడ నుంచి 40 ప్రత్యేక రైళ్లు
- ప్రధాన స్టేషన్లలో సిబ్బందితో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు
- స్టేషన్ డైరెక్టర్ ఎండీ అలీఖాన్ వెల్లడి



రైల్వేస్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు విజయవాడ డివిజన్ పూర్తిగా సన్నద్ధమని విజయవాడ స్టేషన్ డైరెక్టర్ ఎండీ అలీఖాన్, ఎం.శైలజలు తెలిపారు. విజయవాడ డివిజన్ నుంచి వివిధ ప్రాంతాలకు 40 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రధాన స్టేషన్లలో అదనపు బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు టిక్కెట్ తనిఖీ సిబ్బందితో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై విజయవాడ స్టేషన్‌లో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై గైడెడ్ మీడియా పర్యటన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విస్తృత ఏర్పాట్లను మీడియా సిబ్బంది పరిశీలించారు. దీపావళి, చత్‌పూజ సమయంలో రైలు ప్రయాణానికి పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లను ప్రముఖ మార్గాల్లో నడుపుతున్నామని, ఈ సీజన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే 850 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. వెయిటింగ్ లిస్టు ప్రయాణికుల కోసం అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రత్యేక టిక్కెట్ తనిఖీ బృందాలు, అన్నిస్టేషన్లలో పరిశుభ్రత, 24 గంటలు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారని, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు, సమయపాలన పాటించేందుకు అధికారులు షిఫ్టుల పద్ధతిలో పనిచేస్తారని తెలిపారు. నైట్ పెట్రోలింగ్, ఫుట్‌ప్లయిట్ తనిఖీలు, డ్రైవ్‌లు ఉంటాయన్నారు. కేటరింగ్ స్టాల్స్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా ఆహార పదార్థాలను సిద్ధం చేస్తారని, ఇందుకోసం ఐఆర్‌సీటీసీతో సమన్వయం చేయటం జరిగిందని పేర్కొన్నారు. సీసీ టీవీ పర్యవేక్షణతో పాటు అక్రమార్కులపై నిఘా, ప్రయాణికులకు భద్రత వంటి అనేక కార్యక్రమాలను చేపట్టినట్టు, వీటిపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్టు అలీఖాన్, శైలజలు చెప్పారు.

ఇసుకపై పోలీస్ వ్యూహం

(5వ పేజీ తరువాయి)

మంచి ఫలితాలు రావన్న ఉద్దేశంతో రెండు, మూడు విభాగాల నుంచి సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద నియమించడానికి మ్యాప్ రెడీ చేశారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద స్థానిక పోలీసులు, స్పెషల్‌బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ విభాగాల సిబ్బందిని నియమిస్తారు. ఈ సిబ్బందిని రెండు రోజులకు ఒకసారి గానీ, వారం రోజులకు ఒకసారి గానీ మార్చేసి కొత్త వారిని నియమిస్తారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాలు అమర్చుతారు. వాటిని విజయవాడలో ఉన్న ఆపరేషనల్ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది కదలికలపై సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. ఈ కెమెరాలను పోలీసు కమిషనర్ చాంబర్‌లో ఉన్న మినీ వీడియోవాల్‌కు అనుసంధానం చేస్తారు. ప్రస్తుతం నది నుంచి ఇసుక బయటకు రాకుండా అక్కడక్కడ ఉన్న మార్గాల్లో పోలీసులు కొద్దిరోజుల క్రితం గండ్లు కొట్టారు. ప్రస్తుతం కృష్ణా నది నిండు కుండలా ఉంది. ఎగువ నుంచి వరద వస్తోంది. ఫలితంగా ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు జరగడం లేదు. జిల్లాలో మొత్తం 15 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేయాలని భూగర్భ గనుల శాఖ నిర్ణయించింది. ఇక్కడి నుంచి కూలీల ద్వారా ఇసుకను తవ్వించే ప్రక్రియ ఈనెల 16 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అన్ని రీచ్‌ల్లోకి వరద నీరు చేరడంతో తవ్వకాలు ఆగిపోయాయి. తవ్వకాలు జరిగి ఇసుక ఒడ్డుకు వచ్చేలోపు సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో గస్తీ నిర్వహించడానికి ఎనిమిది మొబైల్ టీంలను ఏర్పాటు చేయబోతున్నారు. ఇంటర్‌సెప్ట్ వాహనాల్లో ఈ టీంలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయి.

ఇసుక వాహనాలకు జియో ఫెన్సింగ్

రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకెళ్లే వాహనాలు కచ్చితంగా జీపీఎస్ కలిగి ఉండడంతోపాటు భూగర్భ గనుల శాఖ వద్ద తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇప్పటి వరకు 700 వాహనాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. సొంత వాహనాలను ఉపయోగించుకునే అవకాశం ఉంది. రీచ్‌లో ఇసుకను లోడ్ చేసిన వాహనాలు వాటిని స్టాక్ పాయింట్ల (ఎస్‌పీ) వద్ద అన్‌లోడ్ చేయాలి. ఇలా జీపీఎస్ పరికరాలు ఉన్న వాహనాలను మొత్తం ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. వాటికి జియో ఫెన్సింగ్ ఇస్తారు. ఆ వాహనాలు రీచ్‌ల నుంచి గమ్యస్థానాలకు మాత్రమే వెళ్లాలి. మ్యాప్‌ను దాటి వెళ్తే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జియో ఫెన్సింగ్ అలర్ట్ వస్తుంది.

● ఇసుక పక్కదారి పట్టకుండా చేయడానికి డ్రోన్‌లను వినియోగించాలని పోలీసులు నిర్ణయించారు. జిల్లాలో త్వరలో తవ్వకాలు జరిగే 15 రీచ్‌లతోపాటు స్టాక్ పాయింట్లలో డ్రోన్లతో నిఘా పెట్టబోతున్నారు. ఈ ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి వాస్తవ పరిస్థితిని ప్రత్యక్షంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షిస్తారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే 17 చెక్‌పోస్టుల మార్గాల్లోను డ్రోన్లు ఎగురుతాయి.

● చెక్‌పోస్టులు పెట్టే ప్రాంతాలు జొన్నలగడ్డ, కొణతమాకూరు, వి.అన్నవరం, పెద్దాపురం, శివాపురం, గుమ్మడిదుర్రు, వత్సవాయి, పోలంపల్లి, పెంట్యాలవారిగూడెం, కంభంపాడు, తాళ్లూరు, గండ్రాయి, మల్కాపురం, అన్నవరం, ముక్త్యాల, బూదవాడ, గరికిపాడు.



దసరా మహోత్సవాల విజయ కీర్తి..

కూటమి ప్రభుత్వానిదే

- విజయోత్సవ సభలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక శోభతో దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన కీర్తి కూటమి ప్రభుత్వానికి దక్కిందని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. దేవస్థానంలో మంగళవారం దసరా మహోత్సవ విజయోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించినందుకు అధికారులను, సిబ్బంది, ఉద్యోగులను అభినందించారు. ఈ విజయంలో పాలుపంచుకున్న అందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు..

ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు, ఆదేశాల మేరకు సామాన్యులకు పెద్దపీట వేస్తూ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. మంత్రివర్గ సహచరులు, ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించారని, వినూత్నమైన చర్యలతో భక్తుల ప్రశంసలను పొందారని తెలిపారు. ఆధ్యాత్మిక శోభకు నాందిగా మూలా నక్షత్రం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గమ్మ వారికి పట్టు వస్త్రాలను సమర్పించారని పేర్కొన్నారు. ఉత్సవాలు విజయవంతం కావటంలో సహకరించిన మీడియాకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీఐపీ, ప్రొటోకాల్ దర్శనాలు, మూలానక్షత్రం నాడు ఉచిత దర్శనాలు, విజయదశమి నాడు అందరికీ ఉచిత దర్శనం, ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ వంటివి హైలెట్‌గా నిలిచాయన్నారు. దసరా ఉత్సవాలు ముగిసిన తరువాత భవానీ దీక్షల విరమణలకు భవానీలకు వెసులుబాటుగా మరో రెండు రోజుల పాటు అమ్మవారి దర్శనం కలిగించన్నారు. మంచినీళ్ల బాటిళ్లు, మజ్జిగ, పాలు నిర్విరామంగా అందించామన్నారు. భక్తులకు పులిహోర, కట్టు పొంగలి, దద్దోజనం వితరణ చేసినట్టు తెలిపారు.

ఏర్పాట్లపై 92శాతం మంది సంతృప్తి

ఐవీఆర్ఎస్ ద్వారా భక్తులు 92శాతం మంది దసరా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇది యంత్రాంగానికి అంతటికీ గర్వకారణమని తెలిపారు. ఐదు సంవత్సరాల తరువాత మళ్లీ కృష్ణమ్మకు ప్రతి రోజూ నవహారతులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించటం భక్తుల మనోభావాలను పరిరక్షించటం ఎంతో సంతోషదాయకమన్నారు. ఉత్సవాలను దిగ్విజయం చేశామని, ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, ఇకముందు కూడా ఇలాంటి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. ప్రతి దేవాలయంలోనూ ఏర్పాటు చేసే బాక్స్‌ల్లో భక్తులు తమ సూచనలు, సలహాలు తెలియజేయవచ్చునని తెలిపారు. వాట్సాప్ నంబర్ ద్వారా భక్తుల సలహాలను తీసుకోవటంతో పాటు ఈ విధానాలను పర్యవేక్షించటానికి ప్రత్యే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

అంతే ఘనంగా కార్తీక ఉత్సవాలు

దసరా ఉత్సవాలను విజయవంతం చేసినట్టుగానే కార్తీకమాస ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శైవక్షేత్రాలు, ప్రముఖ దేవాలయాల్లో చర్యలు తీసుకుంటున్నామని, ప్రశాంత, ఆహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాలను దేవదాయ ధర్మదాయ శాఖ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిపారు. కార్తీకమాసంలో పరమేశ్వరుడికి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించటంతో పాటు భక్తుల నదీస్నానాలకు ప్రసిద్ధి పొందిన ఘాట్ల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వైష్ణవాలయాలు, శివాలయాలు రెండింటిలోనూ కార్తీక మాస విశేష పూజాధికాలు జరుగుతుంటాయని తెలిపారు. శ్రీశైలం, మహానంది, అమరావతి, పెద కాకాని, పట్టిసీమ, శ్రీకాళహస్తి, ద్రాక్షారామం, కోటిపల్లి, క్షీరారామం, భీమారామం, ఇలా ప్రసిద్ధి పొందిన అనేక శైవక్షేత్రాల్లో అభిషేకాలు, అన్నవరంలో వ్రతాలు, ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతుంటాయని తెలిపారు. అన్ని దేవాలయాల్లోనూ నెల రోజుల పాటు భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారి మనోభావాలకు అనుగుణంగా దేవాలయాల్లో వాతావరణం ఉంటుందని తెలిపారు. క్యూలు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య, ఆరోగ్య సేవలు, తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అన్నిరకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆలయాల్లో దేవతామూర్తులకు సంబంధించిన నామస్మరణ నిరంతరం జరిగే విధంగా, దేవాలయాల ప్రాశస్త్యం, కార్తీక మాస విశేషం తదితరాలను వివరించేందుకు వీలుగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఈవో కె.ఎస్.రామారావు, అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

శాశ్వత ఉద్యోగులుగా నియమించండి

- దేవదాయ మంత్రికి ఎన్ఎంఆర్‌ల వినతి

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో బేసిక్ పే పై ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న ఉద్యోగులు తమను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని మంగళవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల కాలంగా వివిధ విభాగాల్లో కీలక విధులు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. దసరా మహోత్సవాల విజయోత్సవ సభకు విచ్చేసిన మంత్రిని ఎన్ఎంఆర్‌లు కలిసి మాట్లాడుతూ, గతంలో కొంతమందికి కోర్టు ఉత్తర్వుల ప్రకారం శాశ్వత నియామకాలు జరిపారని, అదేతీరులో తమకు కూడా ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రికార్డులను పరిశీలించి ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని హామీఇచ్చారు. గోరంట్ల పునీత్ కుమార్ ఆధ్వర్యంలోని ఎన్ఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా ఓటర్లు

15,38,937

- పురుషులు 7,45,774, మహిళలు 7,93,108, ఇతరులు 55 మంది
- 22,669 మంది తొలగింపు
- నూతనంగా చేరినవారు 43,351మంది

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో ఓటర్ల జాబితాల సవరణ ప్రకియకు భారత ఎన్నికలసంఘం ప్రత్యేక షెడ్యూలును ప్రకటించింది. జిల్లాకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాను కలెక్టర్ బాలాజీ మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15,38,937 ఉండగా.. వీరిలో పురుషులు 7,45,774, మహిళలు 7,93,108, ఇతర ఓటర్లు 55మంది ఉన్నట్టుగా చూపారు. సాధారణ ఎన్నికల అనంతరం జిల్లాలో 22,669మంది ఓటర్లను జాబితాలనుంచి తొలగించగా, ఇప్పటివరకు నూతన ఓటర్లుగా 43,351మందిని చేర్చినట్టుగా చూపారు. ప్రస్తుతం ప్రకటించిన ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను ఈనెల 29 నుంచి నవంబరు 28వరకు తెలియజేసేందుకు అవకాశం కల్పించారు. నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో పోలింగ్‌బూత్‌ల వద్ద ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. 2025 జనవరి 6న తుది జాబితాను ప్రకటిస్తారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారంతా తప్పనిసరిగా నూతన ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. 18, 19సంవత్సరాల మధ్య ఉన్న వారు 21,802 మంది జిల్లాలో ఉన్నారని, వీరు నూతన ఓటర్లుగా నమోదు చేయించుకోవాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించే నాటికి ఆయా నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
గన్నవరం	134354	144941	12	279307
గుడివాడ	97827	106652	11	204490
పెడన	82817	84422	0	167239
మచిలీపట్నం	94754	101843	11	196608
అవనిగడ్డ	104457	107630	16	212103
పామర్రు(ఎస్సీ)	89307	95111	3	184421
పెనమలూరు	142258	152509	2	294769
మొత్తం ఓటర్లు	745774	793108	55	1538937

సర్వీస్ ఓటర్ల వివరాలు ఇలా..

గన్నవరం నియోజకవర్గంలో పురుషఓటర్లు 65మంది, మహిళాఓటర్లు ఐదుగురు, గుడివాడ నియోజకవర్గంలో పురుషులు 85, మహిళలు ముగ్గురు, పెడన నియోజకవర్గంలో పురుషులు 55, మహిళలు ఒకరు, మచిలీపట్నం నియోజకవర్గంలో పురుషులు 80మంది, మహిళలు నలుగురు ఉన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో పురుషులు 119మంది, మహిళలు నలుగురు, పామర్రు నియోజకవర్గంలో పురుషులు 76మంది, మహిళలు ఎనిమిదిమంది, పెనమలూరునియోజకవర్గంలో పురుషులు 64మంది, మహిళలు ఆరుగురు ఉన్నారు. జిల్లాలో సర్వీస్ ఓటర్లు పురుషులు 544మంది, మహిళలు 31మంది ఉన్నట్లుగా చూపారు.

ఉపాధి సాకుతో దోచేశారు!

- వైసీపీ పాలనలో ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం!
- సామాజిక తనిఖీల్లో అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదులు
- వి.అన్నవరంలోనే రూ.6 లక్షల వరకు అవకతవకలు


వీరులపాడులో ఎఫ్ఏల అవినీతిని వివరిస్తున్న గ్రామస్థులు

వీరులపాడు/హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీరులపాడు మండలంలోని 22 గ్రామాల పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటాన్ని గ్రామస్థులు బట్టబయలు చేశారు. మంగళవారం జుజ్జూరులోని కమ్యూనిటీ హాల్‌లో అధికారులు ఏప్రిల్ 2023-2024 మార్చివరకు చేసిన పనులకుగాను అక్టోబరు 14-28 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో గ్రామస్థులు ఎఫ్ఏల అవినీతి బాగోతాన్ని ఆధారాలతో సహా అధికారుల ముందుంచారు. ఒక్క వి.అన్నవరం గ్రామంలోనే 250 జాబ్ కార్డుకి సుమారు 50 జాబ్ కార్డు ఫేక్ అని గ్రామస్థులు పీడీ ఎ.రాముకు వివరించారు. గ్రామంలో సుమారు రూ.6 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్టు ఆరోపించారు. విచారణ చేపడితే మరింత అవినీతి బయటపడుతుందన్నారు. బోడవాడ, తాటిగుమ్మి, వెల్లంకి, పెద్దాపురం, గోకరాజుపల్లి గ్రామాల ప్రజలు కూడా తమవద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ చేస్తామని, నిరూపణ అయితే చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, స్టేట్ రీసోర్స్ అధికారి సూర్యనారాయణ, ఎంపీడీవో అరుంధతిదేవి, ఎంపీపీ కోటేరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో..

బాపులపాడులో ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల ఉపాధి కల్పనకు అమలు చేస్తున్న పథకం పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్వీ శివప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద 2023-24 సంవత్సరంలో రూ.10.96కోట్ల 2,164 పనులకు సంబంధించి సామాజిక తనిఖీల్లో కె.సీతారాంపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మంగలపాటి మరియమ్మ అక్రమాలకు పాల్పడుతున్నట్టు గ్రామస్థులు పీడీకి ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ఆమెను తొలగించి వేరొకరిని నియమించాలని మూకుమ్మడిగా కోరడంతో వీఆర్పీని విచారించి మరియమ్మను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్టు పీడీ ప్రకటించారు. ఆమె స్థానంలో సీనియర్ మేట్‌ను నియమించాలని ఏపీవో అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. సామాజిక తనిఖీ నివేదికలో ప్రొసీజర్ ల్యాప్స్ కింద రూ.70 వేల పనులకు, రికార్డులకు వ్యత్యాసం ఉన్నట్టు తేలింది. ఆ మొత్తాన్ని సిబ్బంది నుంచి రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. గ్రామసభలో గ్రామంలో ఏఏ పనులు ఉన్నాయో జాబితా తయారు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగాభవాని, ఎస్సార్‌పీ సత్యానారాయణ, ఏపీడీ నాంచారావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించిన కృష్ణా కలెక్టర్, ఎస్పీ

గుడ్లవల్లేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని మంగళవారం రాత్రి కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్‌లు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కలెక్టర్, ఎస్పీలను శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు బహూకరించారు. ఆలయ ప్రధానార్చకులు శివసంతోష్ శర్మ వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించారు.

లైసెన్స్ లేని బాణసంచా సీజ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపల్లిలో ఎం.రమణమూర్తి అనే కిరాణాషాపు యజమాని లైసెన్స్ లేకుండా బాణాసంచా విక్రయిస్తున్నాడన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈనెల 26న దాడులు చేసి సరుకు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.2.80 లక్షల విలువగల సరుకును ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. సరుకు సీజ్‌చేసి దుకాణ యజమాని ఎం.రమణమూర్తిపై కేసు నమోదు చేసినట్టు ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. కేసు ఆలస్యంగా నమోదు చేయలేదని అదే రోజున నమోదు చేశామని సోషల్ మీడియాలో పోలీసులపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.

సి.ఎల్.ఐ.ఎస్‌సి. కోర్సుకు దరఖాస్తులు

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఐదు నెలల సి.ఎల్.ఐ.ఎస్‌సి. కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని పీఎన్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, గుంటూరులోని వావిలాల లైబ్రరీ సైన్స్, కడపలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ శిక్షణా సంస్థల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఒక్కో సంస్థలో 40 చొప్పున మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. నవంబరు 1 నుంచి 15వరకు శిక్షణా సంస్థల్లో దరఖాస్తులు విక్రయిస్తారని, వాటిని నవంబరు 18లోగా పోస్టు చేయాలని వివరించారు. డిసెంబరు నుంచి ఏప్రిల్ 30 వరకు తరగతులు జరుగుతాయన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు కృష్ణా జిల్లా విద్యార్థులు

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణా విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడలోని పటమట కేబీసీ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి.సఫియా, బి.జాహ్నవి, డి.జ్యోత్స్నలత, కె.సంతోష్, ఆర్.ఏసు, ఎస్కే అబ్దుల్ రహీంబాషా, బి.యశ్వంత్ ఎంపికైనట్లు సమగ్రశిక్ష కార్యాలయం తెలిపింది. ఈ విద్యార్థులను సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మంగళవారం ఆయన కార్యాలయంలో అభినందించారు.

పరిహాసంగా పరివాహన్!



- పోర్టల్‌లో అప్‌డేట్ కాని వాహనాల డేటా
- రిజిస్ట్రేషన్ల రెన్యువల్స్‌లో తీవ్ర ఇబ్బందులు
- ఆర్‌సీలు లేవు.. నెంబర్ ప్లేట్లు రావు
- రెండు నెలలుగా వాహనదారులకు చుక్కలు
- కేంద్ర స్థాయిలోనే అంటున్న రవాణా శాఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రిజిస్ట్రేషన్లు జరగవు.. రెన్యువల్స్ సాగవు.. నెంబర్ ప్లేట్లు రావు.. ఇన్సూరెన్స్‌లు అప్‌డేట్ కావు.. చెప్పుకుంటే పోతే సమస్యలు కోకొల్లలు.. రవాణా శాఖ పరిధిలోకి రెండేళ్ల క్రితం తీసుకువచ్చిన 'వాహన్ పరివాహన్' పోర్టల్ కష్టాలు ఇవి.. పోర్టల్ సమస్య కారణంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెద్దసంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. వాహనదారులకు చిరాకు తెప్పిస్తున్నాయి. ఆన్‌లైన్ ఆధారిత సేవలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ కావాల్సిన వాహనాలు నెలరోజులు దాటినా పని జరగదు. రోజుల్లో రావాల్సిన నెంబర్ ప్లేట్ నెల గడిచినా అందదు. రెన్యువల్ రిజిస్ట్రేషన్ల పరిస్థితి మరీ ఘోరం. అసలు వాహన డేటానే లేదని వస్తోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వందలాది దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి.

రెండేళ్లు కావస్తున్నా..

వాహన సంబంధిత సేవలన్నీ దేశంలో ఒకటిగా ఉండాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 'పరివాహన్' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్‌కు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పరిధిలో పోర్టల్ మాన్యువల్ ప్రకారం రవాణా సేవలు అందించాల్సి ఉంటుంది. పరివాహన్ వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించకపోగా.. కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించి యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు దీని సంగతి మరిచారు.

ఉమ్మడి జిల్లాలో డేటా సమస్యలు

దేశవ్యాప్తంగా ప్రారంభించిన ఈ ప్రయోగాత్మక పోర్టల్ పరిధిలోకి ఉమ్మడి జిల్లాను తీసుకురావటం జరిగింది. విజయవాడ కేంద్రంగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ సైట్ నిర్వహణ నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) నేతృత్వంలోనే జరుగుతోంది. ఈ సైట్‌కు సంబంధించి డేటా అప్‌లోడ్ అంతా విజయవాడలో రవాణా శాఖ సిబ్బంది అప్‌లోడ్ చేస్తుంటారు. కానీ అప్‌లోడ్ చేసిన డేటా 'పరివాహన్' సైట్‌లోకి రావటం లేదు. రవాణాశాఖ అధికారులు మాత్రం తాము రిమైండ్స్ చేస్తున్నామని, కేంద్ర స్థాయిలో ఎన్ఐసీ విభాగం అప్‌డేట్ చేయాల్సి ఉందని చెబుతున్నారు. వాహనాల డేటా పరివాహన్ వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ కాకపోవటం వల్ల.. రిజిస్ట్రేషన్ల రెన్యువల్స్‌కు ఇబ్బందిగా ఉంటోంది.

దరఖాస్తులో అనేక సమస్యలు



పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవటానికే అనేక సమస్యలు వస్తున్నాయి. చాలామందికి కేవైసీ చేసుకోవాల్సిందిగా వస్తోంది. మొదటి రిజిస్ట్రేషన్ సమయంలోనే వాహనదారులు కేవైసీ చేసుకుంటారు. రిజిస్ట్రేషన్ రెన్యువల్ సమయంలో వాహనానికి అర్హత ఉందీ, లేనిదీ ఎంవీఐ పరిశీలించి అనుమతి ఇస్తారు. తర్వాత ఆఫీసు గుమాస్తా దగ్గరకు వెళుతుంది. ఆఫీసు గుమాస్తా నుంచి ఏవోకు వెళుతుంది. అక్కడి నుంచి ఆర్టీవో దగ్గరకు వెళుతుంది. ఏవో దగ్గరకు వచ్చేసరికి వెహికల్ నాట్ ఫౌండ్ అని, నాట్ వ్యాలిడేట్ అని వస్తున్నది. అంటే వాహనం లేదని అర్థం. ఎక్కువ సమస్యలు రిజిస్ట్రేషన్లకు సంబంధించే వస్తున్నాయి. వాహన బదిలీ దరఖాస్తులకు సంబంధించి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనాన్ని మరో వ్యక్తికి అమ్మితే.. వాహన బదిలీకి సంబంధించి అమ్మిన, కొనుగోలు చేసిన వ్యక్తులు వేలిముద్ర ఇవ్వాల్సి ఉంటుంది. అమ్మిన వ్యక్తి వేలిముద్రను పరివాహన్ పోర్టల్ స్వీకరించటం లేదు.

రెన్యువల్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి దరఖాస్తును కొంతవరకు స్వీకరించి ఫీజులు చెల్లించే సందర్భంలో కేవైసీ చేసుకోవాలని అడుగుతుంది. వాహనాలు కొనుగోలుచేసినపుడు మొదటి రిజిస్ట్రేషన్ల (ఫ్రెష్)కు సంబంధించి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ జరిగిన వాటికి నెల దాటినా.. సర్టిఫికెట్ (ఆర్‌సీ) రావటం లేదు. నెంబర్ ప్లేట్లు రావటం లేదు. రిజిస్ట్రేషన్ జరిగిన రెండు మూడు రోజుల్లో షోరూమ్‌కు నెంబర్ ప్లేట్ రావాల్సి ఉంది. అయితే నెల రోజులు దాటినా రావటం లేదు. వాహనాల ఇన్సూరెన్స్‌లు కూడా సకాలంలో అప్‌లోడ్ కావటం లేదు. గతంలో స్థానికంగా ఆర్‌టీఏ సిటిజన్ ఈ ప్రగతి సైట్‌ను తీసుకురాటం జరిగింది. ఇది చాలా యూజర్ ఫ్రెండ్లీగా ఉండేది. ఎవరైనా ఆన్‌లైన్‌లో తేలిగ్గా దరఖాస్తు చేసుకునే విధంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఏకీకృత సర్వీసు పోర్టల్ పేరుతో 'పరివాహన్' సైట్‌ను కష్టతరంగా మార్చివేసింది. దీని వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

18వ డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు



రాణిగారితోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ నినాదమని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాలతో డివిజన్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పగడాల వెంకటేశ్వరరెడ్డి, పత్తి రామారావు, అంబటి కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





గోతుల మయంగా మారిన రామలింగేశ్వరనగర్ కరకట్ట రోడ్డు

నిధులు మంజూరైనా పనులేవీ?

- గోతుల మయంగా రామలింగేశ్వరనగర్ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

(రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి)

నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా రామలింగేశ్వరనగర్ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడంలేదు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కరకట్ట రోడ్డు అనేక చోట్ల గోతుల మయంగా మారి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. అవనిగడ్డకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఆర్టీసీ బస్సులు తిరిగే మార్గం కావడంతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. స్క్యూ బ్రిడ్జి నుంచి కొండ వరకు వాహనాలపై ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించ వలసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారం ఆక్రమణలు పెరిగిపోవడంతో రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిత్యం ఈ గతుకుల రోడ్లో ఏదో ఒక ప్రమాదం జరుగుతూ వాహనదారులు గాయపడుతున్నా సంబంధిత అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతు పనులు ప్రారంభించాలి



గత ఎన్నికల ముందు ఈ రోడ్డు మరమ్మతుల కోసం స్క్యూ బ్రిడ్జి నుంచి పడవల రేవు వరకు, అక్కడి నుంచి కొండ వరకు దాదాపు రూ.91లక్షలు మంజూరు కావడంతో పాటు టెండర్ కూడా సిద్ధం అయ్యాయి. కానీ పనుల మాత్రం ప్రారంభం కావడం లేదు. దీనిపై గత, ప్రస్తుత మున్సిపల్ కమిషనర్లకు కలిసి పనులు ప్రారంభించాలని కోరినా ఫలితం లేదు. రోడ్డు గతుకుల మయం కావడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వర్షం పడితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుంది. వర్షం నీటిలో గోతులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించాలి.

- బెల్లం దుర్గ, 15వ డివిజన్ కార్పొరేటర్

ఎస్‌ఆర్‌ఆర్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలి

ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ భరత్ గుప్తా

గుణదల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తేవడానికి కృషి చేయాలని ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ భరత్ గుప్తా సూచించారు. ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటగా ఆయన మంగళవారం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కళాశాలలోని పలు విభాగాధిపతులతో సమావేశమై అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన సౌకర్యాలను అడిగి వాటి ఏర్పాటు కోసం కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఎస్‌ఆర్‌ఆర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ గుర్తింపునకు తగ్గట్టుగా అధ్యాపక సిబ్బంది అంకిత భావంతో పనిచేసి మంచి ఫలితాలు రావడానికి కృషి చేయాలని కోరారు. నిధులు మంజూరు కాక కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఆగిపోయాయని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కళాశాల ఆవరణలో ఉన్న ఇండోర్ స్టేడియంను పరిశీలించారు. కళాశాల ఆవరణలో మొక్క నాటారు.



రెసిడెన్షియల్ కళాశాల రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ భరత్ గుప్తా

కళాశాల ఆవరణలోనే ఉన్న రెసిడెన్షియల్ విభాగంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నీరజ చాంబర్‌కు వెళ్లి రికార్డులను పరిశీలించారు. రెసిడెన్షియల్ విభాగంలో వసతి, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు కేటాయించిన భూమి ఆక్రమణ పాలై పోవడంతో సదరు విషయం కోర్టులో ఉందని, ఆ విషయమై దృష్టి పెట్టి కళాశాలకు దాతలు ఇచ్చిన స్థలంలో తాత్కాలిక రేకుల షెడ్లయినా ఏర్పాటు చేయాలని పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు డాక్టర్ భరత్ గుప్తాను కోరారు. ఆ విషయమై కూలంకషంగా పరిశీలించాక నిర్ణయం తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట అధ్యాపక బృందం ఉన్నారు.

ఏపీ ప్రభుత్వం ఐటీఐ అండ్ డీఎల్‌టీసీ

స్టాఫ్ అసోసియేషన్ నూతన సంఘం ఎన్నిక

భారతీనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ అండ్ డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర నూతన సంఘం ఎన్నిక జరిగింది. మంగళవారం సున్నపుబట్టీల సెంటర్‌లోని అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్ర సంఘం సభ్యులు అందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీవో నాయకులు నాగభూషణం, పురుషోత్తమ నాయుడు ఎన్నికల అధికారిగా విచ్చేశారు. ఎన్నికల్లో గెలిచిన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర నాయకులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ గణేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌కు నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించారు.

నూతన కమిటీ సభ్యులు

రాష్ట్ర అధ్యక్షుడు పుట్టగుంట వెంకట రమేష్, ప్రధాన కార్యదర్శి కె. రత్నరాజు, కోశాధికారి కేవీఎస్ శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.సుధాకర్, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 13 జిల్లాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పటమటలంక మున్సిపల్ బాలికల పాఠశాలలో బాలికలకు పెన్నులు అందజేస్తున్న పటమటలంక వాకర్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎంపీ శివనాథ్

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని ఏడవ డివిజన్ శిఖామణి సెంటర్‌కు చెందిన బాధపడుతున్న కొండవీటి అనిల్‌కు రూ1.50లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ అందించారు. మెదడు సంబంధిత వ్యాధితో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న బాధితుడు ఎంపీ సహకారంతో అర్జీ పెట్టుకోగా నిధులు మంజూరయ్యాయి. గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో బాధితుడి కుటుంబ సభ్యులు బి.కార్తీక్, బి. భగత్‌చంద్‌లకు చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే సుజనా చౌదరి

మొగల్రాజపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యువత, పెద్దలు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు నరిశెట్టి ఆదిశేషు ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ కళాశాల వద్ద మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.



డాక్టర్ వెంకటేశ్వర్లుకు అభినందనలు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కర్నూల్ సార్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనను యూనియన్ సభ్యుడు బాజ్జి, మరి కొందరు సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంటరిమ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వి.వి నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా డాక్టర్ గంగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓటు హక్కు వినియోగాన్ని బాధ్యతగా భావించాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఓటర్ల నమోదు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె

పటమట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు వారి ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని బాధ్యతగా భావించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని అన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమం నిర్వహించగా, ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి గద్దె అనురాధ, కుమారుడు గద్దె క్రాంతికుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యత్వానికి బీజేపీ, టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థిగా ఆలపాటి రాజా పోటీ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కార్యాలయంతో పాటు, గాయత్రీనగర్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గద్దె క్రాంతి తెలిపారు. నవంబరు ఆరో తేదీతో నమోదు గడువు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నాబత్తుల బాబీ, బద్రి, కోగంటి ప్రసాద్, అన్నాబత్తుల శ్రీదేవి, కర్రి రాజేష్, కర్ణా రమేష్, షేక్ హనీఫ్, ఎన్ఆర్ఐ స్కూల్ డీన్ లక్ష్మణరావు, ఎన్ఆర్ఐ స్కూల్ టీచర్ గోశాల అవినాష్‌లు పాల్గొన్నారు.

కబడ్డీలో పీబీ సిద్ధార్థ జట్టుకు తృతీయస్థానం

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 29 : నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల టీమ్ తృతీయస్థానం పొందింది. ఈ జట్టు నుంచి ప్రతిభ కనపర్చిన కె. మహేష్ వర్సిటీ టీమ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో సిద్ధార్థ యాజమాన్యం టీమ్‌ను అభినందించింది. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ సి. నాగేశ్వరరావు, సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు క్రీడాకారులను అభినందించారు.



క్రీడా జట్టును అభినందిస్తున్న యాజమాన్యం



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పటమట/గుణదల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వాహన రాకపోకలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాల్గవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ రామారావు తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద ముఠా కార్మికులతో మంగళవారం ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదచారులు రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపై నడవాలని చెప్పారు. రోడ్డు దాటే సమయంలోనూ పాదచారులు నిర్లక్ష్యంగా ఉండకుండా రోడ్డుకు ఇరువైపులా చూసుకుని దాటాలన్నారు. 18 ఏళ్లలోపు వారికి ద్విచక్రవాహనాలను ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. సౌండ్ పొల్యూషన్‌తో కూడిన హారన్లు ద్విచక్రవాహనాలకు ఏర్పాటు చేస్తే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

బాలికను పెళ్లి చేసుకుని వేధిస్తున్న మేనమామ

పోక్సో కేసు నమోదు, అరెస్టు

గుణదల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకుని వేధిస్తున్న మేనమామను పోక్సో కేసులో అరెస్టు చేసినట్లు గుణదల పోలీస్‌స్టేషన్ సీఐ వాసిరెడ్డి శ్రీను తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా బూర్జమండలం సుంకరపేటకు చెందిన ఓ కుటుంబం విజయవాడ మధురానగర్ వచ్చేశారు. వీరు 2019 నుంచి 2022 వరకు మధురానగర్‌లోనే ఉన్నారు. వీరి కుమార్తె 2022లో 9వ తరగతి చదువుతున్న సమయంలో వరుసకు మేనమామ పిట్ట సూరిబాబు(22) తనను ప్రేమించాలని వెంటపడటం, బలవంతం చేయడం జరిగింది. దీంతో 2022లోనే పెద్దల సమక్షంలో వారిద్దరికి వివాహం చేశారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు శ్రీకాకుళం వెళ్లిపోయారు. బాలిక, సూరిబాబు దంపతుల కుమారుడు(ఏడాది వయస్సు) పుట్టిన తర్వాత తరచూ భర్త, అత్త మామలు బాలికను శారీరకంగా మానసికంగా వేధించడం ప్రారంభించారు. తట్టుకోలేక బాలిక శ్రీకాకుళంలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన శ్రీకాకుళం పోలీసులు పెళ్లి సమయంలో మీరు విజయవాడలో ఉన్నందున ఈ కేసు దర్యాప్తు అక్కడే జరగాలని కేసును మంగళవారం గుణదల పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. బాలికను పెళ్లి చేసుకోవడం నేరమని, దానికి తోడు వేధిస్తుండటంతో సూరిబాబుపై పోక్సో కేసు, వేధింపుల కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటర్ కాలేజియేట్ డిబేట్‌లో

సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ఫస్ట్

లబ్బీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కాలేజియేట్ డిబేట్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు క్వాలిఫయర్ రౌండ్‌లో మొదటి బహుమతి సాధించినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధవి తెలిపారు. ఈ పోటీలు ఎక్స్ఐఎంఈ ఆధ్వర్యంలో మారియా ఫిలిప్ ఫ్యూచర్ లీడర్స్ డిబేట్ పోటీలు 2024-25 లో భాగంగా నిర్వహించగా, నగరంలోని వివిధ కళాశాలల నుంచి 15 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ బృందాల మధ్య జరిగిన పోటీల్లో కళాశాలకు చెందిన ఎం. శ్రీవైష్ణవి, ఎం.ఎం.సంకీర్తనలు మొదటి బహుమతితో పాటు రూ.10వేలు గెలిచారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు నవంబరు 22న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి డిబేట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆర్.మాధవి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



బహుమతులు పొందిన విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

వృత్తివిద్యను ఆర్థిక వనరులుగా మార్చుకోవడం మంచి పరిణామం

మొగల్రాజపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మారుతున్న అవసరాల వృత్తివిద్యను నిర్లక్ష్యం చేయకుండా ఆర్థిక వనరులుగా మార్చుకోవడం మంచి పరిణామం అని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి కె.శ్రీనివాసరావు చెప్పారు. జనశిక్షణా సంస్థాన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో మొగల్రాజపురం కార్యాలయంలో కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యను బోధించే బోధకుడు సిలబస్‌కు సాంకేతికతను జోడించి అర్థమయ్యేలా చెప్పాలని చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ మాజీ పీడీ సుహాసిని, ఛైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడారు. స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ పోర్టల్‌పై శిక్షకులకు, అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ చేసే విధానం, అసెస్‌మెంట్ నిర్వహించే విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

మార్పుతో మెరుగైన సమాజం



ప్రస్తుతం పుడుతున్న పిల్లల్లో ప్రతి ఐదుగురిలో ఒకరికి హైపర్ ఉంటుంది. వీరు హైపర్ యాక్టివ్‌గా ఉండడానికి కారణం గర్భం దాల్చిన మహిళల్లో గాడి తప్పిన సమయపాలన. గర్భ నిర్ధారణ తర్వాత ఆ మహిళలను కుటుంబ సభ్యులు ఎంతో సున్నితంగా, జాగ్రత్తగా చూసుకుంటారు. చాలామంది ఎలాంటి శారీరక శ్రమ లేకుండా సుఖజీవనానికి అలవాటు పడుతున్నారు. సరిగా నిద్రలేకపోవడం, సమయం పాలన లేని ఆహారం, రాత్రి సమయాల్లో మొబైల్ ఫోన్లతో గడపడం చేస్తున్నారు. దీంతో గర్భిణుల జీవనశైలి గాడి తప్పుతోంది. ఈ ప్రభావం కడుపులోని శిశువుపై పడడంతోనే పిల్లల్లో హైపర్ యాక్టివ్ లక్షణాలు వస్తున్నాయి. ఈ లక్షణాలకు జీన్స్ ఒక కారణమైతే, ఎక్కువ శాతం గర్భిణుల జీవనశైలి సక్రమంగా లేకపోవడమే. భర్త శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఇటువంటి వారిలో మార్పు తెచ్చి మెరుగైన సమాజాన్ని నిర్మించాలనే ధ్యేయంతో 'మార్పు' అనే స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం చుట్టారు తులసి పద్మశ్రీ. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి న్యూట్రీషన్‌గా పనిచేసిన విజయవాడకు చెందిన ఆ మహిళ అంతరంగాన్ని ఆవిష్కరించడమే ఈ కథనం. - ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్

రూ.28లక్షలతో వరద బాధితులకు అన్నదానం

తులసి పద్మశ్రీ శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు ఇంజనీరింగ్. కుమార్తె నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్. వారి విద్యాభ్యాసం కోసం పొదుపు చేసుకున్న డబ్బును ఇటీవల వచ్చిన వరదల్లో దానాలకు ఖర్చు చేశారు. ఎలాంటి విరాళాలు సేకరించకుండా సొంత డబ్బులు రూ.28లక్షలతో బాధితులకు భోజనాలు పెట్టించారు. ఇబ్రహీంపట్నం, అజిత్‌సింగ్, నున్న, భవానీపురం, అంబాపురం ప్రాంతాల్లో వేలాది బాధితుల కడుపును నింపారు.



భర్త శ్రీనివాస్‌తో తులసీ పద్మశ్రీ

అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులకు అవగాహన కల్పించాలని తులసి పద్మశ్రీ భావించారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా అవగాహన సదస్సులు నిర్వహించడం కుదరదని చెప్పడంతో వెనకడుగు వేయకుండా ఆమె ఇంటి వద్దే ఆ మె ఈ కార్యక్రమాలు చేస్తున్నారు. ఫ్రెండ్ సర్కిల్, తెలిసిన వారికి, ఇంటి చుట్టుపక్కల ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అంతేకాకుండా పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపైనా అవగాహన కల్పిస్తున్నారు. తులసి పద్మశ్రీ భర్త శ్రీనివాస్ యూనియన్ బ్యాంక్ ఇండియాలో ఉద్యోగి. గతంలో నేవీలో పనిచేశారు. ఈ సందర్భంగా ముంబై, గుజరాత్‌లో పనిచేసినప్పుడు తులసి పద్మశ్రీ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. అక్కడ వివిధ వాణిజ్య సముదాయాలు, కంపెనీలకు వెళ్లి అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులకు లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై అవగాహన కల్పించారు. పోష్ (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్) హైదరాబాద్‌లోను అవగాహన సదస్సులు నిర్వహించారు. విజయవాడలోనూ వాణిజ్య సముదాయాలు, కంపెనీల్లో ఇలా అవగాహన కల్పించాలని భావించినప్పుడు నిరాశ ఎదురైంది. యాజమాన్యులు అంగీకరించలేదు. దీంతో ఆమె మార్పు ఆధ్వర్యంలో పోష్ కార్యక్రమాలు చేస్తున్నారు.

భవిష్యత్తు ప్రణాళికలు...

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి విద్యార్థులుంటారు. కొంతమంది విద్యలో టాప్‌గా ఉంటారు. మరికొందరు అల్లరి చేస్తుంటారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఉపాధ్యాయులు అందరిపైనా శ్రద్ధ చూపించలేకపోతున్నారు. ఈ అవకతవకలకు కారణం విద్యార్థులకు తమ కెరీర్‌పై సరైన గైడెన్స్ లేకపోవటమే. తల్లిదండ్రులు తమ పిల్లలకు పాకెట్ మనీ ఇస్తుంటారు. వారు చిరుతిండికి వినియోగిస్తుంటారు. ఆ తిండి తమ శరీరానికి పోషకాలను అందిస్తుందా లేదా అన్నది ఆలోచించరు. ప్రస్తుతం సమాజంలో సోషల్ మీడియా రాజ్యమేలుతోంది. దీంతో వచ్చే ప్రయోజనాల కంటే దుష్పరిణామాలే ఎక్కువ. కొంతమంది తమ ఉన్నతికి వినియోగించుకుంటుంటే మరికొందరు గేమ్స్ పేరిట తమ చదువులను చెడగొట్టుకుంటున్నారు. వీటన్నింటినీ గమనించిన తులసి పద్మశ్రీ వారికి కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని నిర్ణయించుకుంది. అందుకే 13 నుంచి 19 ఏళ్ల విద్యార్థుల కోసం ఒక ప్రోగ్రాంను డిజైన్ చేశామని ఆమె వెల్లడించారు. టెన్త్ వరకు టాప్‌లో ఉన్న విద్యార్థులు ఇంటర్‌కు వచ్చేసరికి వెనుకబడుతున్నారు. వారికి ఏఏ సబ్జెక్టుల్లో ఆసక్తి ఉందో గ్రహించి టెన్త్ దాటాక ఏ కోర్సు భవిష్యత్తుకు బాట వేస్తుందో చెప్పాలని నిర్ణయించుకున్నారు. అలాగే తల్లిదండ్రులిచ్చిన డబ్బులను ఎలా పొదుపు చేసుకోవాలో తర్ఫీదును ఇవ్వబోతున్నారు. సామాజిక మాధ్యమాలను ఎలా ప్రయోజనకరంగా ఉపయోగించుకోవాలి, ఎలాంటి విషయాలను వాటి నుంచి నేర్చుకోవచ్చన్న దానితోపాటు ఏఏ అంశాల జోలికి వెళ్లకూడదన్న వాటిపై అవగాహన కల్పిస్తారు. సమాజంలో పెద్దల పట్ల ఎలా మర్యాదగా వ్యవహరించాలి, సామాజికంగా ఎలాంటి విలువలతో అడుగులు వేయాలన్న విషయాలను వివరిస్తామన్నారు. తమ మార్పు సొసైటీలో ప్రస్తుతం 9 మంది సభ్యులున్నారు. వారు ప్రతి 15 రోజులకొకసారి పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడతారు. విద్యార్థుల్లోని ప్రతిభను, వెనుకబడి ఉన్న పిల్లల్లోని లోపాలను గుర్తించి ప్రణాళికలను అమలు చేస్తామన్నారు. ఇలా చేయడానికి ఒక్కో పాఠశాలకు ఏడాది సమయం పడుతుందని ఆమె చెబుతున్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా ఏపీ

● సంక్రాంతిలోగా 'ఆడుదాం ఆంధ్ర' అక్రమార్కులపై చర్యలు: శాప్ ఛైర్మన్ అనిమిని



విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడాశాఖను, శాప్‌ను భ్రష్టు పట్టించారని, తన కార్యాలయం బాగుచేత నుంచి ఆంధ్రప్రదేశ్ క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్టు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు. 2014-19లో చంద్రబాబు హయాంలో క్రీడలకు ఒక ప్రణాళిక అమలు చేశారని, దాన్ని వైసీపీ పాలకులు భ్రష్టుపట్టించారని, తాను నెలరోజులు రాష్ట్రంలోని క్రీడా వికాస కేంద్రాలు, ఇతర అకాడమీల సందర్శనలో క్రీడలను ఏ ఎలా నిర్వీర్యం చేశారో తెలుసుకున్నానన్నారు. మంగళవారం శాప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతతూ క్రీడాకారుల నుంచి ప్లే అండ్ పే వసూళ్లను రద్దు చేస్తారా? అన్న ఆంధ్రజ్యోతి ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రైవేట్ కాంప్లెక్సుల్లో ఈ విధమైనవి రద్దు చేశామని, వైసీపీ కబంధ హస్తాల్లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్సులను స్వాధీనం చేసుకుంటామన్నారు. తిరుపతిలోని శ్రీనివాస్ కాంప్లెక్సును సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడుదాం-ఆంధ్రలో రూ.119 కోట్లను వైసీపీ రాజకీయ క్రీడగా మార్చేసుకుని, ఓట్లకు వినియోగించుకుందనీ, ఐదు గేమ్‌లలో ఒక్క నైపుణ్యం ఉన్న క్రీడాకారుడ్ని తయారు చేయలేదని ధ్వజమెత్తారు. ఇందులో కోట్లు బొక్కిన వారున్నారని, ఇందులో ఎంతటి వారున్న ఊపేక్షించేది లేదని, ఇప్పటికే ఆధారాలు సేకరించామని, సంక్రాంతిలోగా అసలైన దొంగలను తేల్చుతామన్నారు. ప్రస్తుతం స్పోర్ట్స్ పాలసీని రూపొందిస్తున్నామని, త్వరలో క్రీడాకారులకు అమలు చేస్తామన్నారు. స్కూల్స్‌లో సర్వశిక్షాభియాన్ కింద కొనుగోలు చేసిన ఆట పరికరాలు ఉపయోగం లేకుండా ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలో మంజూరై వైసీపీ ప్రభుత్వం చేతకానితనం వల్ల అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాసకేంద్రాలు, అకాడమీలు, స్పోర్ట్స్ కాంప్లెక్సులను తమ స్వంత ఇంజనీరింగ్ శాఖ ద్వారా సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం, మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు కలిసి సమన్వయంతో పనిచేస్తామన్నారు. నకిలీ సర్టిఫికెట్లను ఇచ్చే క్రీడా సంఘాలపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న పేదింటి క్రీడాకారులను ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్తలు, మాజీ క్రీడాకారులు దత్తత తీసుకోవాలని, సీఎస్ఆర్ ఫండ్స్‌ను క్రీడలకు ఉపయోగించడానికి ముందుకు రావాలని రవినాయుడు పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో టైలర్ మృతి

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక వారధి సమీపంలోని సాయిబాబా గుడి వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మొగల్రాజపురానికి చెందిన టైలర్ పెండ్యాల శివశంకర్ రావు (50) లారీ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మధ్యాహ్నం అన్నా క్యాంటీన్‌లో భోజనం చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రధాన హైవేపై అటుగా వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఏపీ39యు 7463 లారీచక్రాల కింద అతను పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ అతని దేహాన్ని సుమారు పదడుగుల వరకు ఈడ్చుకు వెళ్లింది. సంఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ సంఘటనతో మృతుడి ఇంట విషాద ఛాయలు అలముకున్నాయి.

పీఎం స్వ నిధిని వినియోగించుకోవాలి

● మంత్రి నారాయణ



లబ్ధిదారులు, బ్యాంకర్లు, అధికారులతో మంత్రి నారాయణ

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్వ నిధి కార్యక్రమాన్ని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పి.నారాయణ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన పీఎం స్వ నిధి పథకం రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎక్కువ అవార్డులు సాధించాలన్నారు. కొవిడ్ సమయంలో నష్టపోయిన వీధి వ్యాపారులను ఆదుకున్నది పీఎం స్వ నిధి పథకమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం రెట్టింపు కావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. దీని కోసం పట్టణ పేదరిక నిర్మూలన విభాగం (మెప్మా)లో అనేక కార్యక్రమాలు నడుస్తున్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకు మెప్మాలో అమలు చేసిన పథకాలను ఇప్పుడు మళ్లీ అమలు చేస్తున్నామన్నారు. అందుకే ఐఏఎస్ అధికారిని మెప్మా ఎండీగా సీఎంని అడిగి నియమించామన్నారు. పీఎం స్వ నిధి కింద రుణాలు తీసుకున్న వారికి 7శాతం వడ్డీ రాయితీ ఇస్తుందని, కేవలం 4.5శాతం వడ్డీ మాత్రమే లబ్ధిదారులు భరించాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే కోట్లలో రుణాలు పొందవచ్చన్నరు. ప్రధాన మంత్రి జన్ ధన్, జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన, తదితర పథకాలతో పాటు ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు పథకాలను గురించి వివరించారు. పీఎం స్వ నిధి కింద రాష్ట్రం నుంచి 5,48,957 మంది దరఖాస్తు చేసుకున్నారని, 5,02,894 మందికి రుణాలిచ్చారన్నారు. గుంటూరు కార్పొరేషన్, పుత్తూరు, రాయచోటి మేజర్ మునిసిపాలిటీలు ఉత్తమ పనితీరు కనబరిచి అవార్డులు అందుకున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే రూ.285 కోట్లు మేరకు రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రతి డిజిటల్ లావాదేవికి ప్రోత్సాహం ఉంటుందని, పీఎం స్వ నిధి పథకం సమర్థవంతంగా అమలు చేసినందుకు రాష్ట్రస్థాయిలో 38 మందికి ప్రైజ్ అవార్డులను ప్రకటించారన్నారు. ఈ పథకం ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించి అభివృద్ధికి కృషి చేసిన మెప్మా డైరెక్టర్, స్వ నిధి మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ వర్ధ్‌కు అభినందనలు తెలిపారు. ఎస్ఎస్‌బీసీ కో-ఆర్డినేటర్ దాస్యం శ్రీనివాస్ మాట్లాడుతూ స్వ నిధి పథకం అమలులో ఉత్తమ తీరు కనబరిచిన అధికారులకు, బ్యాంకర్లకు అవార్డులివ్వటం ముదావహమన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ రూ.10 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, విశాఖపట్నం మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, గుంటూరు మునిసిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ డీజీఎం మనీష్ కుమార్ సింగ్, ఎన్టీఆర్ జిల్లా మెప్మా పీడీ నారాయణ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయస్థానం 7 నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పును ఇచ్చింది. తాడేపల్లికి చెందిన వ్యక్తి రైల్వేస్టేషన్‌లో పనిచేసేవాడు. ద్విచక్ర వాహనాన్ని క్లాక్ టవర్ వద్ద పెట్టుకునేవాడు. రాజమండ్రి కొంతమూరు గ్రామానికి చెందిన సన్నాల నాగరాజు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ఈ బైక్‌ను చోరీ చేశాడు. గుడివాడలో చేసిన చోరీ కేసులో అతడ్ని అరెస్టు చేయగా రైల్వేస్టేషన్‌లో బైక్ చోరీ బయటకొచ్చింది. అతడిని పీటీ వారెంట్‌పై సత్యనారాయణపురం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువవడంతో నాగరాజుకు మూడో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు 7 నెలల జైలు, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

అధికారులే మోకాలడ్డు?

● ఆటోనగర్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ● ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికుల విన్నపాలు



ఐలా కమిషనర్ కార్యాలయం

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్‌పై వేల మంది చేతివృత్తి కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి ఆటోనగర్ నేడు అభివృద్ధికి అమడ దూరంలో ఉంది. దీని అభివృద్ధి కోసం స్వయం ప్రతిపత్తి కలిగిన ఐలా ఎంతోకృషి చేయాల్సి ఉంది. 40శాతం ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మిగిలిన 60 శాతం నిధులను ఐలా కేటాయించాలి. ఐలాకు వచ్చే ఆదాయం చేతివృత్తుల పరిశ్రమల నుంచి సమకూరుతోంది. ఆయా నిధులను ఆటోనగర్ అభివృద్ధికి వినియోగించాలి. ఐలా స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ ఐయినా ప్రభుత్వం కమిషనర్‌ని నియమిస్తుంది. ప్రతి 3 నెలలకోసారి అభివృద్ధికి తీసుకోవాల్సిన నిర్ణయాలపై అధికారులతో సమావేశాలు నిర్వహించాలి. ఆటోనగర్ అభివృద్ధికి కమిషనర్ ప్రణాళికలను రూపొందిస్తారు. గత వైసీపీ పాలనలో వచ్చిన ఏ అధికారి అభివృద్ధికి కావాల్సిన నిర్ణయాలు తీసుకోలేదు, సమావేశాలు ఏర్పాటు చేసిందీ లేదు. ఐలా అధికారుల నిర్ణయాలను ఏపీఐఐసీ పరిశీలించి నిధులు విడుదల చేస్తుంది. కానీ కమిషనర్‌గా వచ్చిన వారంతా తూతూమంత్రంగా వచ్చి వెళ్లిపోతున్నారు. దీంతో ఆటోనగర్ అభివృద్ధికి ఖచ్చిత ప్రణాళికలంటూ ఏవీ లేవు.

రెవెన్యూ అధికారులే కమిషనర్లు

ఐలా కమిషనర్లుగా వచ్చే అధికారులందరూ రెవెన్యూ అధికారులే. వీరికి రెవెన్యూలో మంచి పట్టుంటుంది కానీ ఇండస్ట్రీస్‌పై ఉండదు. ఆటోనగర్ అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన అవగాహన లేక అభివృద్ధికి అవరోధంగా మారింది. ఐలా కమిషనర్లుగా వచ్చిన వారంతా పారిశ్రామిభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆటోనగర్ అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది. పారిశ్రామికవాడపై అవగాహన ఉండే అధికారులు కమిషనర్లుగా వస్తే తమ సమస్యలు తీరతాయని చేతివృత్తుల పరిశ్రమలవారు కోరుతున్నారు. ప్రస్తుతం ఐలా కమిషనర్‌గా జోనల్ మేనేజర్ వ్యవహరిస్తున్నారు.

రోడ్లు నిర్మించి పదేళ్లు

ఇక్కడ సీసీ రహదారులు నిర్మించి దాదాపు పదేళ్లు గడిచిపోయాయి. దీంతో రహదారులు ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి నాశనమయ్యాయి. ఆటో క్లస్టర్ ఏర్పడిన తర్వాత మట్టి రోడ్లకు రూ.11 కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి అవే రహదారులు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కానీ ఐలా అధికారులు కానీ రహదారులు బాగు చేసిన పాపానపోలేదు. వర్షకాలం వస్తే రహదారులు నిండా నీరు చేరి ఆటోనగర్ మునిగిపోతుంది. అంతేకాకుండా వర్షపు నీటి పారుదలకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలు పూడిక తీయక అడ్డంకులు ఏర్పడ్డాయి. అధికారులు శానిటేషన్‌ను పూర్తిగా వదిలేశారన్న ఆరోపణలున్నాయి.

డపింగ్ యార్డు సమస్య

ఆటోనగర్‌కు డపింగ్ యార్డు సమస్య ప్రధానం. 6వ రోడ్లో డపింగ్ యార్డు కోసం ఐలా స్థలాన్ని కేటాయించింది. అక్కడ చెత్తను వేయాలని నిర్ణయించింది. కానీ వీఎంసీ అధికారులు ఎస్టీపీ కట్టాలని నిర్ణయించామని ఆ స్థలాన్ని తమకు కేటాయించాలని కోరింది. దీంతో చెత్త డపింగ్‌కు మరో స్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. డపింగ్ యార్డు కోసం కేటాయించిన స్థలంలో వీఎంసీ ఎస్టీపీ నిర్మించింది కానీ డపింగ్ యార్డుకు మాత్రం స్థలం కేటాయించలేదు. నేటికీ సొంత యార్డు లేక చెత్తను తరలించడం పెద్ద సమస్యగా మారింది.



డపింగ్ యార్డుకు కేటాయించిన స్థలంలో కార్పొరేషన్ ఎస్టీపీ

బస్సు ప్రయాణికులే టార్గెట్

● బస్సులో కెమెరా కిట్ చోరీ ● మీరట్ గ్యాంగ్‌లో ఇద్దరి అరెస్టు



విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ గ్యాంగ్ ఇప్పుడు ఈ గ్యాంగ్ విజయవాడలో దిగింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తోంది. ఇలా ఒక ప్రయాణికుడికి చెందిన కెమెరాను కొట్టేసిన ఇద్దరు నిందితులను సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఖాసీం, సిద్ధిఖి, ఇసాక్ ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా గోవిందాపురానికి చెందినవారు. కొద్దిరోజుల క్రితం విజయవాడ, అనంతపురం, ఒంగోలు, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలను టార్గెట్ చేసుకుని చోరీలు చేయడానికి వచ్చారు. వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నం మండలం గొల్లపూడికి చెందిన మొహమ్మద్ షరీఫ్ అనే యువకుడు ఈవెంట్స్‌కు ఫొటోగ్రాఫర్. ఈ నెల 20న ఒంగోలులో జరిగే ఈవెంట్‌కు బయలుదేరాడు. విజయవాడ బస్టేషన్‌లో ఒంగోలు బస్సు ఎక్కాడు. అక్కడ ఇసాక్‌తోపాటు మరో యువకుడు ప్లాట్‌ఫాంపై నిలబడి ప్రయాణికులను గమనిస్తున్నారు. ఖాసీం, సిద్ధిఖి ప్రయాణికుల్లా బస్సులోకి ఎక్కారు. వారిలో ఒకరు షరీఫ్ పక్కన కూర్చున్నాడు. మరొకరు షరీఫ్ లగేజ్ క్యారియర్‌పై పెట్టిన బ్యాగ్ వద్దకు వెళ్లి జిప్‌ను స్క్రూడ్రైవర్‌తో ముక్కలు చేశాడు. లగేజిని సర్దుకుంటున్నట్టుగా నటించి షరీఫ్ బ్యాగ్‌లోని కెమెరా లెన్స్, ఫ్లాష్ లైట్‌ను తన బ్యాగ్‌లో సర్దుకున్నాడు. షరీఫ్‌ను పక్కన కూర్చున్న యువకుడు మాటల్లో పెట్టాడు. పని పూర్తికాగానే బస్సు పీఎన్‌బీఎస్ బయటున్న కాళికామాత ఆలయం వద్దకు రాగానే మరో వ్యక్తి బస్టేషన్‌లో ఉండిపోయాడని చెప్పి దిగిపోయారు. కొంతదూరం వెళ్లాక చూసుకునే సరికి షరీఫ్ బ్యాగ్‌లోని కెమెరా, లెన్స్ కనిపించలేదు. దీనిపై అతడు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు సీసీఎస్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ సలాం ఆధ్వర్యంలో నిందితులను ఖాసీం, సిద్ధిఖిని అరెస్టు చేశారు. లెన్స్, ఫ్లాష్‌లైట్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కెమెరా విలువ రూ.5లక్షలు ఉంటుందన్నారు.

షార్ట్‌కట్ చిత్రం విజయవంతం కావాలి: 'ఆట' సందీప్

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న విడుదల కానున్న షార్ట్‌కట్ సినిమా విజయవంతం కావాలని దుర్గమ్మను వేడుకున్నట్టు బిగ్‌బాస్ ఫేం, డ్యాన్స్ మాస్టర్ సందీప్ అన్నారు. చిత్ర ప్రమోషన్ కోసం మంగళవారం విజయవాడ వచ్చిన ఆయన ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ చిత్రంలో తాను ఒక దర్శకుడి పాత్రలో నటిస్తున్నానన్నారు. జానీ మాస్టర్ బెయిల్‌పై విడుదల కావటం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు రామకృష్ణ మాట్లాడుతూ షార్ట్‌కట్ సినిమా ఆద్యంతం థ్రిల్లింగ్‌గా ఉంటుందన్నారు. ప్రేక్షకులు చిత్రాన్ని ప్రోత్సహించి ఆశీర్వదించాలని కోరారు. చిత్ర యూనిట్ సభ్యులు పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రధాని మోదీతో దేశ రక్షణ మరింత పటిష్టం

● ఎంపీ కేశినేని శివనాథ్



రోజ్‌గార్ మేళా లో పాల్గొన్న ముఖ్య అధికారులు, అభ్యర్థులు

రైల్వే స్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో డిఫెన్స్ రంగం మరింత పటిష్టమవుతోందని విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లోనూ మరింత ముందుకు పోతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రోజ్‌గార్ మేళా 2వ దశకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 కల్లా దేశాన్ని ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన ఆర్థిక దేశంగా ప్రధాని మోదీ తీర్చిదిద్దుతారని, ఇందుకు తగిన వనరులను సమీకరించుకుంటున్నారన్నారు. అనంతరం ఆయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 185 మందికి నియామక పత్రాలను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి అందజేశారు. విజయవాడ పరిధిలో పోస్టల్ డిపార్టుమెంట్ నుంచి 151 మంది, రైల్వేస్ నుంచి 10 మంది, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి 15 మంది, ఎఫ్‌సీఏ నుంచి ఆరుగురు, ఐవోబీ నుంచి ముగ్గురు నియామకాలు పొందారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 51వేల మంది ఉద్యోగ నియామక పత్రాలు అందచేయటం రికార్డ్ అని, ఇది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. విజయవాడ రీజనల్ పోస్టుమాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధరమూర్తి, ఏపీ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, డీఆర్ఎం కె.నరేంద్ర ఏ పాటిల్, బీఎస్ఎన్ఎల్ మేనేజర్ ఎం.శేషాచలం పాల్గొన్నారు.


ఆడపిల్లల రక్షణ, చదువు ప్రతి ఒక్కరి బాధ్యత

● శిశు సంక్షేమ శాఖ జిల్లా సాధికారత అధికారి

విజయవాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల రక్షణ, చదువు ప్రతి ఒక్కరి బాధ్యతని వారు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు తోడ్పాటు అందించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి జి.ఉమాదేవి అన్నారు. విజయవాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆటోనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉమాదేవి కిశోర బాలికలు, మహిళల సంరక్షణా కార్యదర్శులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు చేశారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ఎదురయ్యే అనర్థాలను తెలియజేయాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ, బాలికలపై జరిగే ఆఘాయిత్యాలకు పోక్సో చట్టం ఉందని అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. డీసీపీవో రాజేశ్వరరావు, వన్‌స్టాప్ సెంటర్ ఎస్సై వరలక్ష్మీ, సైకాలజిస్టు కె. సునీత రాజేష్ పాల్గొన్నారు.

దీక్షల విరమణను విజయవంతం చేస్తాం

● ఎమ్మెల్యే సుజనా చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించినట్టుగానే భవానీ దీక్షల విరమణలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. మంగళవారం ఇంద్రకీలాద్రిపై ఈవో కార్యాలయంలో దుర్గగుడిలో చేయాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించామని, ఆలయాభివృద్ధికి అవసరమయ్యే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇటీవల జరిగిన దసరా ఉత్సవాలను అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేసినట్టే భవానీ దీక్షల విరమణలోనూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. వచ్చే అయిదేళ్లలో పశ్చిమను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నామన్నారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు అధికారులు సాదరస్వాగతం పలికారు. ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు ఆయనకు చిత్రపటాన్ని అందజేశారు. పండితులు ఆశీస్సులు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్

వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి మార్కెట్‌యార్డులోని ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్‌ను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ద్వారాలకు వేసిన సీల్స్, రక్షణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల రికార్డింగులు పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎంలు, ఈవీప్యాట్ గోడౌన్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపాలన్నారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, గట్టి నిఘా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పలువురు, డీఆర్‌వో ఎ.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సెల్ డీటీ మధుబాబు పాల్గొన్నారు.

విదర్భపై 4 వికెట్లతో ఆంధ్ర ఘన విజయం

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూలపాడు వేదికగా దేవినేని వెంకటరమణ క్రికెట్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో విదర్భపై ఆంధ్రప్రదేశ్ జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. 78/3తో రెండో ఇన్నింగ్ మూడోరోజు మంగళవారం ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు మరో 3 వికెట్లను కోల్పోయి మరో 63 పరుగుల జోడించి ఘన విజయం నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 212 పరుగులకు ఆలౌట్ కాగా, ఆంధ్ర 176కే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ టీమ్ 98 పరుగులకు ఆలౌట్ కాగా, ఆంధ్ర టీమ్ 6 వికెట్లు కోల్పోయి 141 పరుగుల లక్ష్యాన్ని కేవలం 59.3 ఓవర్లలోనే అధిగమించింది. ఆంధ్ర బ్యాటర్ జీవీఎస్ తేజ 194 బంతుల్లో 58 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ విజయంతో ఆంధ్రాకు 11 పాయింట్లు రాగా, విదర్భకు 6 పాయింట్లు లభించాయి.

బీమా బూచోడు!

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోలేదు. ఇందులోనే సుజిత్ కన్సల్టెంట్‌గా చేరారు. సుజిత్ ముందుగా ఏపీజీఐసీఎల్, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వంలోని అన్ని కార్పొరేషన్లు, శాఖల్లో బీమా సంబంధిత సమాచారం ఇవ్వాలంటూ జీవోలు, సర్క్యులర్లు పంపించి డేటా మొత్తం సేకరించాడు. ఆయా శాఖలకు సంబంధించిన బీమా టెండర్లను ఏపీజీఐసీఎల్ ఖరారు చేసేలా నిబంధనలు మార్చారు. నిజానికి బ్రోకరేజ్ కంపెనీలు లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీలు నేరుగా ప్రభుత్వానికి కొటేషన్లు ఇవ్వొచ్చు. 2020 వరకు అలాగే జరిగింది. కానీ... జగన్ సర్కారు ప్రభుత్వ రంగంలోని బీమా కంపెనీలకు 'కళ్లెం' వేసింది. సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తేనే టెండర్‌లో పాల్గొనే అర్హత ఉంటుందంటూ మెలిక పెట్టింది. న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీల నిబంధనల ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించడం విరుద్ధం. అందుకే ఆ కంపెనీలు టెండర్లకు దూరంగా ఉండిపోయాయి. దీంతో... కమీషన్లు దండిగా ఇచ్చే, అనామక కంపెనీలు తెరపైకి వచ్చాయి.

మరో ప్రభుత్వ సంస్థ పేరుతో

ఏపీజీఐసీఎల్‌కు ఐఆర్‌డీఏఐ గుర్తింపు రాకపోవడంతో.. ప్రభుత్వ కంపెనీ అయిన ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రా అసెట్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్)ను తమ 'కమీషన్ల'కు పావులా వాడుకున్నారు. దీనికి కార్పొరేట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ లైసెన్స్ ఇప్పించారు. తర్వాత ఒక్కో ప్రభుత్వ పథకం, బీమాలకు సంబంధించిన కమీషన్లు దండుకునే ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం సాగిపోయింది. చీఫ్ రిస్క్ ఆఫీసర్ (సీఆర్‌ఓ)గా తానే వ్యవహరిస్తూ సుజిత్ స్కామ్‌ను సాఫీగా కొనసాగించాడు. తామే ఏర్పాటు చేయించిన/తమ సన్నిహిత బ్రోకింగ్ కంపెనీలకు అనుగుణంగా టెండరు నిబంధనలను రూపొందించారు. ఏయే పథకాల్లో ఎలా కమీషన్లు దండుకున్నారో చెప్పేందుకు మచ్చుకు కొన్ని ఉదాహరణలు...

వైఎస్సార్ బీమాలో...: వైఎస్సార్ బీమా టెండరు 'యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్' అనే అనామక కంపెనీకి కట్టబెట్టారు. రఘునాల్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ఏజెన్సీ అనే కంపెనీ ద్వారా ఈ లావాదేవీ జరిగింది. దీనికిగాను 2021-22లో వచ్చిన బ్రోకరేజ్ కమీషన్ రూ.13 కోట్లు! 2022-23లో కూడా ఇదే సీన్! ఆ ఏడాది రఘునాల్‌కు దక్కిన కమీషన్ రూ.17 కోట్లు. ఇదే నేరుగా ప్రభుత్వ రంగ సంస్థలకు బీమా టెండరు దక్కి ఉంటే కమీషన్ల భారం ఉండేది కాదు. 2021-22లో బీమా పరిహారం మొత్తం రూ.210 కోట్లు. కానీ యూనివర్సల్ సోంపో 1,124 మందికి రూ.50 కోట్లు చెల్లించింది. 3,377 మందికి అందాల్సిన రూ.160 కోట్ల పరిహారం ఇంకా వారికి అందలేదు.

పశు బీమాలో ఇలా...

పశుసంవర్థక శాఖ అమలు చేసే పశు బీమా కోసం మూడేళ్ల పాటు ఒకే కంపెనీకి బ్రోకరేజ్ బాధ్యతలు అప్పగించేలా 2023లో ఎంవోయూ చేశారు. వోలో ఇన్సూరెన్స్ బ్రోకింగ్, అమేజ్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ జెన్‌మనీ ఇన్సూరెన్స్ కంపెనీలను ఎంపిక చేశారు. ఇవన్నీ గత ప్రభుత్వ పెద్దల అస్మదీయ సామాజిక వర్గం వారివే. 2023-26 వరకు పశువుల బీమాకు సంబంధించిన ప్రీమియం మొత్తం రూ.45 కోట్లు! ఇందులో కమీషన్ రూ.6.75 కోట్లు. విడతల వారీగా ప్రీమియం చెల్లింపులు జరుగుతున్నాయి. అందులో నుంచి కమీషన్లూ ముడుతున్నాయి.

20 లక్షల కమీషన్ కోసం కోటి నష్టం

తిరుపతి డీఎఫ్‌వోకి సంబంధించిన బీమాల్లో భారీగా అవినీతి జరుగుతోంది. రూ.20 లక్షల కమీషన్ కోసం ప్రభుత్వం చేత కోటి రూపాయలు ప్రీమియం అదనంగా చెల్లించారు. ఎర్రచందనం గోడౌన్ల కోసం బీమా తీసుకున్నారు. ఐఆర్‌డీఏఐ నిబంధనల్లోని ఫైర్ పాలసీ ప్రకారం ఈ విభాగంలోకి వచ్చే బీమాలకు ప్రీమియంలో 90 శాతం డిస్కౌంట్ ఉంటుంది. కానీ ఆ ఉద్యోగి.. చెల్లించే ప్రీమియం తగ్గిపోతే కమీషన్ తగ్గుతుందని భావించి, డిస్కౌంట్ వర్తింపజేయకుండా ప్రభుత్వం చేత రూ.1.18 కోట్లు ప్రీమియం కట్టించాడు. ఇందులో అతడికి వచ్చిన కమీషన్ రూ.20 లక్షలు. 90 శాతం డిస్కౌంట్ వర్తింపజేస్తే ప్రభుత్వానికి కోటి రూపాయలకు పైగా ప్రీమియం తగ్గేది. ఇంత ఖర్చు పెట్టి తీసుకున్న ఈ పాలసీలో భూకంపం, వరదల వల్ల నష్టం జరిగితే క్లెయిమ్ ఇవ్వరు.

సీఈవోను చేయాలంటూ... కన్సల్టెంట్ల నుంచి నేరుగా కార్యదర్శులకే ఫైళ్లు..

ఇటీవల ఏపీజీఐసీఎల్‌కు తనను సీఈవోగా నియమించాలంటూ సుజిత్ తనకు తానే ఫైలు పెట్టుకుని ఆర్థిక శాఖ కార్యదర్శులకు పంపారు. వాళ్లు ముందూ వెనుకా చూడకుండా ఆమోదించారు. ఆదేశాలు రావడమే తరువాయి. కానీ... ఆ ఉద్యోగి వివాదాస్పద వ్యక్తి కావడం, పత్రికల్లో వార్తలు రావడంతో ఆర్థిక శాఖ ఉద్యోగులు అభ్యంతరాలు వ్యక్తం చేసి సెక్రటరీల అనుమతితో ఆ ఆదేశాలు రాకుండా అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం... ఆర్థిక శాఖకు ఏదైనా ఫైలు రావాలంటే.. ఏఎస్‌వో, ఎస్‌వోల ద్వారా, ఎంఎల్‌వో ద్వారా కార్యదర్శులకు చేరుతుంది. కానీ... ఏపీజీఐసీఎల్ విషయంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఫైళ్లు నేరుగా అక్కడ కన్సల్టెంట్లుగా ఉన్న ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి నేరుగా కార్యదర్శులకు వస్తున్నాయి. సెక్రటరీలు వాటిని ఆమోదించి ఆదేశాలు ఇవ్వాలని కిందిస్థాయి సిబ్బందికి చెబుతున్నారు. ఇప్పుడూ అలాగే జరగడం గమనార్హం. ఏపీజీఐసీఎల్ బోర్డులో మార్పులు చేస్తున్నామని.. చైర్మన్‌గా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్‌ను, ఎండీగా అదే శాఖలో డీఎస్‌గా ఉన్న ఐఏఎస్ నూరుల్ కమర్‌ను, అదే శాఖ కార్యదర్శి నివాస్‌ను, సీనియర్ ఐఏఎస్ బి. రాజశేఖర్‌ను డైరెక్టర్లుగా.. వెంకటరత్నాన్ని స్వతంత్ర డైరెక్టర్‌గా నియమిస్తున్నామని పేర్కొంటూ నేరుగా సెక్రటరీలకు ఫైలు పంపారు. దీనిని కూడా వారు ఆమోదించారు. ఆదేశాలివ్వడానికి సిద్ధమవుతుండగా.. స్వతంత్ర డైరెక్టర్‌ను నియమించాలంటే ఆ శాఖ మంత్రి, సీఎం ఆమోదం తప్పనిసరని.. తనకు ఫైలు రాకుండా ఆదేశాలు ఎలా ఇస్తారని మంత్రి అభ్యంతరం వ్యక్తం చేయడంతో దానిని కూడా ఆపేశారు.

వివిధ సంస్థల్లో బ్రోకరేజ్ ఇలా..

1) **ఏపీ జెన్‌కో:** పవర్ ప్లాంట్లు, ఉద్యోగుల బీమాకు సంబంధించి ప్రీమియం రూ.35 కోట్లు ఉంటుంది. ఇందులో బ్రోకరేజ్ పేరుతో కమీషన్ రూ.2-3 కోట్లు ఉంటుంది.

2) **హౌసింగ్ కార్పొరేషన్:** గ్రూప్ మెడిక్లెయిమ్, కార్యాలయాలు, ఇతర భవనాల ఇన్సూరెన్సులు ఉంటాయి. కమీషన్ రూ.40-50 లక్షలు.

3) **ఆర్టీసీ:** జీఎంసీ-కమీషన్ రూ.20 లక్షల వరకు

4) **ఏపీ పోలీస్ (గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్):** జీపీఏ-ప్రీమియం రూ.4-5 కోట్లు ఉంటుంది. కమీషన్ రూ.30 లక్షలు.

5) **ఏపీఎండీసీ:** జీపీఏ.. రూ.30 లక్షల కమీషన్

6) **ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్:** గోడౌన్లు, బాటిళ్లకు ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.2 కోట్లు.. కమీషన్ రూ.30 లక్షలు

7) **ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్:** కమీషన్ రూ.10 లక్షలు

8) **సెర్ప్ కార్పొరేషన్:** ప్రీమియం రూ.5 కోట్లు.. కమీషన్ రూ.30 లక్షలు

9) **ఏపీ ఫారెస్ట్ ఎర్రచందనం బీమా:** ప్రీమియం 1.18 కోట్లు.. కమీషన్ రూ.20 లక్షలు

10) **ఏపీ ఆయిల్ ఫెడ్:** వాహనాలు, ఇతర యంత్రాలకు బీమా కమీషన్ రూ.5 లక్షలు

11) **ఏపీ పర్యాటక శాఖ:** భవనాలు, బోట్లకు బీమా కమిషన్ రూ.5 లక్షలు

12) **ఏపీ పౌరసరఫరాలు:** గోడౌన్లకు బీమా.. రూ.15 లక్షల కమీషన్

13) **ఏపీయూఐఏఎంఎల్:** రూ.10 లక్షల కమీషన్

14) **ఏపీ మారిటైమ్ బోర్డు:** కార్ పాలసీ.. 15-20 కోట్ల ప్రీమియం.. కమీషన్ రూ.3 కోట్లు

15) **రేషన్ వాహనాలు:** వీటి కొనుగోలుకు బ్యాంక్ ఆఫ్ బరోడా రుణం ఇచ్చింది. 9,647 వాహనాలు కొన్నారు. ఒప్పందం ప్రకారం ఆరేళ్ల పాటు ఆ వాహనాల బీమా బాధ్యత కూడా ఆ బ్యాంకుదే. కానీ, ఒప్పందాన్ని ఉల్లంఘించి ఆ వాహనాలకు బీమా కోసం ప్రభుత్వం చేత రూ.4.34 కోట్ల ప్రీమియం కట్టించారు. వీటిని నెలకు 2-3 రోజులు మాత్రమే వాడతారు. ఇందులో దాదాపు రూ.2 కోట్లు కమీషన్ తీసుకున్నారు.

పెట్టుబడులకు ఇదే మంచి సమయం

ఏపీకి రండి



రెడ్మండ్‌లోని మైక్రోసాఫ్ట్ కేంద్ర కార్యాలయంలో ఆ సంస్థ సీఈవో సత్యనాదెళ్లతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అవకాశాలను, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వారికి వివరించారు. ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్ల ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోందని చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడులకు తమ ప్రభుత్వం పన్నుల రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు గ్లోబల్ కంపెనీల కార్యకలాపాలను సులభతరం చేయడానికి రూపొందించిన విధానాలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయన్నారు.

ఐటీ హబ్‌లకు మైక్రోసాఫ్ట్ సహకారం కావాలి

రెడ్‌మండ్‌లోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సత్య నాదెళ్లతో లోకేశ్ చర్చించారు. ఏపీని టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఐటీ హబ్‌లు, ఇన్నోవేషన్ పార్కులను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ హబ్‌లను ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో మైక్రోసాఫ్ట్ సహకారం కావాలని కోరారు. క్లౌడ్ ఆధారిత ప్లాట్‌ఫాంల అమలు, డేటా అనలిటిక్స్ కోసం ఏఐని ఉపయోగించడం, సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం, స్మార్ట్ సిటీ కార్యక్రమాల వంటి వాటి అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించే డిజిటల్ గవర్నెన్స్ విధానాలకు మైక్రోసాఫ్ట్ సహకారం కావాలని మంత్రి అభ్యర్థించారు. రాజధాని అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా చేయాలని భావిస్తున్నామని, ఈ క్రమంలోనే అక్కడ ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డైనమిక్ టెక్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిని పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు రావాలని, నూతన ఆవిష్కరణల కోసం ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని సత్య నాదెళ్లను కోరారు. ఏపీలో పెట్టుబడులు పెట్టే అవకాశాలను పరిశీలించి, ఏపీ సమగ్రాభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వాములు కావాలన్నారు. ఐటీ, ఇంజినీరింగ్ ప్రతిభావంతులపై దృష్టి సారించాల్సిందిగా కోరారు. మైక్రోసాఫ్ట్ సాంకేతిక నైపుణ్యంతో ఉత్పాదకతను పెంచే వ్యవసాయ విధానాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా స్ట్రీమ్‌లైన్డ్ అప్రూవల్స్, ఫాస్ట్-ట్రాక్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్, ప్రొ-బిజినెస్ పాలసీలతో వ్యాపార, వాణిజ్య రంగాలకు వేగవంతమైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. ఏపీలో సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు, డిజిటల్ గవర్నెన్స్ వ్యూహాత్మక లాజిస్టిక్‌లకు అనువుగా ఉంటాయి. దీనికి బలమైన పర్యావరణ వ్యవస్థ మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఏపీలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ రంగాల అభివృద్ధికి సహకరిస్తామని సత్య నాదెళ్ల హామీ ఇచ్చారు.

అడోబ్ రీసెర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

డిజిటల్ మీడియా, క్లౌడ్ ఆధారిత సేవల్లో అగ్రగామిగా ఉన్న అడోబ్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని ఆ కంపెనీ సీఈవో శంతను నారాయణ్‌ను మంత్రి నారా లోకేశ్ కోరారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో అడోబ్ సీఈవోతో ఆయన సమావేశమై ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఇన్నోవేషన్ అండ్ గ్రోత్ విజన్‌తో అడోబ్ కంపెనీ చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విజన్‌కు సరిపోతుందని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను వేగవంతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ నైపుణ్యాలతో ఏపీ యువతను శక్తిమంతం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నామని, ఈ విషయంలో భాగస్వామి కావాలని అడోబ్ సీఈవోను కోరారు. డిజిటల్ ఎడ్యుకేషన్‌ను మెరుగుపర్చడంలో అడోబ్ నైపుణ్యం తమకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ-డ్రివెన్ సొల్యూషన్స్ అమలుకు ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు. పరిశ్రమల వినియోగానికి సంబంధించి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ప్రభుత్వ కార్యకలాపాలు, పౌర సేవల్లో క్లౌడ్ ఇంటిగ్రేషన్‌కు భాగస్వామ్యం వహించే అంశాన్ని పరిశీలించాలన్నారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, స్టార్టప్‌లకు అడోబ్ సృజనాత్మక సాధనాలు ఏపీ సమగ్రాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలనే లోకేశ్ ప్రతిపాదనలపై అడోబ్ సీఈవో శంతను నారాయణ్ సానుకూలంగా స్పందించారు. కంపెనీలో సహచరులతో చర్చించి ఏపీలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

యాపిల్ విస్తరణకు అవసరమైన సహకారం

ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా గుర్తింపు ఉన్న యాపిల్ సంస్థ కేంద్ర కార్యాలయాన్ని మంత్రి లోకేశ్ సందర్శించి.. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ప్రియా బాలసుబ్రహ్మణ్యంతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో యాపిల్ కార్యకలాపాలను విస్తరించాలని, అవసరమైన సహకారం ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఏపీలో ఉన్న 4 ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లలో అనుకూలమైన ప్రాంతాన్ని ఎంచుకుని తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని కోరారు. ఏపీలో ఉన్న అత్యంత నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్, అధునాతన సాంకేతిక పర్యావరణ వ్యవస్థ ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. విశాఖపట్నంలో ఇప్పటికే టీసీఎస్ సంస్థ తమ కార్యకలాపాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని తెలిపారు. యాపిల్ గ్లోబల్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌లో విస్తృత అనుభవం, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రొ-బిజినెస్ చర్యలు ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. యాపిల్ భాగస్వామ్యంతో ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా స్థానిక ప్రతిభను అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని చెప్పారు. మరోవైపు ప్రధాన మార్కెట్లకు సులభతరమైన యాక్సెస్ కలిగిన ఆంధ్రప్రదేశ్.. పెట్టుబడులకు వ్యూహాత్మక ప్రదేశమని మంత్రి లోకేశ్ వివరించారు. తయారీ, పంపిణీ వ్యవస్థలకు అనువైన ఎకోసిస్టమ్ ఏపీలో ఉందన్నారు. లాజిస్టిక్స్, సప్లయి చైన్ నిర్వహణకు భరోసా కల్పిస్తూ ఆధునిక నౌకాశ్రయాలు, రహదారులతో అన్ని విధాలుగా అనుకూలతలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటించాలని ప్రియా బాలసుబ్రహ్మణ్యంను మంత్రి లోకేశ్ ఆహ్వానించారు.

ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌కు లోకేశ్

పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని లాస్‌వెగాస్ ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తలను లోకేశ్ కోరారు. మంగళవారం రాత్రి లాస్‌వేగాస్‌లో జరిగిన ఐటీ సర్వ్ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల కిందట ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో పరిశ్రమలకు 21 రోజుల్లో అనుమతులు ఇచ్చేవారమని.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్, పెప్సికో మాజీ సీఈవో ఇంద్రనూయి, రేవేచర్ సీఈవో అశ్విన్ భరత్, సేల్స్‌ఫోర్స్ ఏఐ సీఈవో క్లారాషిహలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఐటీ సినర్జీలో లోకేశ్ కీలకోపన్యాసం చేశారు.

ఫెస్టివ్ టిప్స్

బడ్జెట్‌లో దీపావళి

దీపావళి... ఖర్చుతో కూడుకున్న పండగే! అందులో సందేహం లేదు. అయితే ఖర్చులు తడిచి మోపెడవకుండా, కొద్దిపాటి బడ్జెట్ లోనే పండుగను జరుపుకునే మార్గాలెన్నో ఉన్నాయి. అవే ఇవి!

క్యాండిల్స్ బదులుగా దివ్వెలు!: బల్బులు, క్యాండిల్స్‌తో దీపావళి వెలుగులు విరజిమ్మాలంటే ఖర్చు పెరుగుతుంది. కాబట్టి ఈ దీపావళినాడు మట్టితో తయారైన ప్రమిదలు సేకరించి, వాటి మీద ఆక్రిలిక్ కలర్స్‌తో డిజైన్లు గీయండి. వీటిలో నూనె లేదా ఘైనం నింపి వెలిగించండి. మట్టి ప్రమిదలు ఎక్కువ సమయం పాటు వెలగడమే కాదు, వాటిని తయారుచేసిన వారికీ మేలు చేసినవాళ్లం అవుతాం!

పువ్వుల రంగోలి!: రసాయనాలతో తయారైన కృత్రిమ రంగులకు బదులు పూల రేకులు, పసుపు, బియ్యం పిండిలతో రంగోలి తయారుచేయండి. వీటి ఖరీదు తక్కువ. పైగా అలంకరణ కూడా తేలికే!

బడ్జెట్‌లో వెలుగులు!: ఇంట్లో పనికి రాని గాజు సీసాలను సేకరించి వాటికి రంగు లేయండి. వాటి లోపల ఫెయిరీ లైట్లను నింపి, కిటికీల దగ్గర ఉంచి ఆన్ చేయండి. ఈ సీసాల్లో చిన్న చిన్న సందేశాలు, తీపి పదార్థాలనూ ఉంచి, స్నేహితులకు, పొరుగింటి వారికీ పండగ సందర్భంగా బహుమతిగా ఇవ్వవచ్చు.

దుపట్టాతో డెకరేషన్!: గది సీలింగ్ నుంచి మూలలకు రంగురంగుల దుపట్టా లేదా చీరలతో అలంకరించుకోవచ్చు. కిటికీలకు, తలుపుల దగ్గర కర్టెన్లుగానూ వాడవచ్చు. బెడ్ వెనకాల గోడకు డిజైన్‌లా దుపట్టాలను అలంకరించి, వాటి మీద అక్కడక్కడా పువ్వులను గుచ్చండి. గదులకు పండగ శోభ వస్తుంది.

కాగితం తోరణాలు: పూల తోరణాలకు బదులుగా రంగురంగుల కాగితాలతో తోరణాలు తయారుచేసి, వాకిళ్లకు కట్టుకోవచ్చు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల కాగితాలను ఇందుకు ఉపయోగించుకోవచ్చు.

పూల రేకులతో: మొత్తంగా పూల దండలు కొనడం ఖరీదైన వ్యవహారమే! అయితే



లూజ్ ఫ్లవర్స్ తక్కువ ధరకు దొరుకుతూ ఉంటాయి. కాబట్టి వాటిని తెచ్చి, విడదీసి, రేకులను కలిపి మాలగా కుట్టుకోవచ్చు. కొంత సృజనాత్మకతను జోడించి, ఆకులతో కలిపి ఆకర్షణీయంగా గుచ్చుకోవచ్చు. ఈ మాలలను గుమ్మాలకు వేలాడదీసుకుంటే, ఇంటికి పండుగ శోభ వచ్చేస్తుంది.

డాండియా!: డిజె లేదని దిగాలు పడవలసిన అవసరం లేదు. స్నేహితులను పోగు చేసి డాండియా ఆడుకోవచ్చు. వినసొంపైన గుజరాతీ లేదా బాలీవుడ్ ప్లేలిస్ట్ తయారుచేసుకుని దీపావళి రాత్రి డాండియాతో హంగామా చేయవచ్చు. ఇందుకోసం డాండియా స్టిక్స్, మిలమిల మెరిసే డాండియా దుస్తులు ఉంటే చాలు.

భలే బహుమతులు!: ప్రమిదలకు ఆకర్షణీయమైన రంగులతో పెయింట్ చేసి స్నేహితులకు ఇవ్వవచ్చు. ఘైనం కొని క్యాండిల్స్ తయారుచేసి బహూకరించవచ్చు. స్వీట్లు తయారుచేసే సామర్థ్యం ఉంటే వాటిని అందంగా గిఫ్ట్ ప్యాక్ చేసి స్నేహితులకు బహూకరించవచ్చు.

వారియర్

కథాబలం... పాత్రకు ప్రాధాన్యం ఉన్న చిత్రాలతో బాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న నటి... భూమి పెడ్నేకర్. తెర మీదే కాదు... నిజ జీవితంలోనూ భూమిది భిన్నమైన పాత్రే. వాతావరణ మార్పులతో పర్యావరణానికి... తద్వారా మానవాళికి పొంచివున్న ముప్పు గురించి ఆమె నిత్యం అవగాహన కల్పిస్తోంది. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' నుంచి 'యంగ్ గ్లోబల్ లీడర్' అవార్డు గెలుచుకున్న భూమి... కాలుష్యరహిత ప్రకృతి కోసం 'ఐక్యరాజ్య సమితి', ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఉద్యమిస్తోంది.



మార్పు కోసం పయనం

భూమి పెడ్నేకర్ చిత్రాలు వినోదాన్ని పంచుతూనే... సున్నితమైన సామాజిక అంశాలను స్పృశిస్తాయి. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్ కహానీ, రక్షాబంధన్, సాండ్ కీ ఆంఖ్ తదితర సినిమాలు అందుకు ఉదాహరణ. నిజ జీవితంలో కూడా భూతాపం వంటి వాతావరణ మార్పులు, సమస్యలకు సంబంధించిన వార్తల్లో 34 ఏళ్ల భూమి పేరు తరచూ కనిపిస్తుంటుంది. పర్యావరణ హితం కోరుతూ అనేక వేదికల మీద ఆమె ప్రసంగించింది. పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సదస్సుల్లో పాల్గొని అవగాహన కల్పిస్తోంది. సినిమా షూటింగ్ ఉన్నా... లేకపోయినా... ఆమెకు ఇది రోజువారీ కార్యక్రమాల్లో ఒక భాగం. సగటు బాలీవుడ్ తారలకు భిన్నంగా... సామాజిక చైతన్యమే లక్ష్యంగా సాగుతోంది ఆమె ప్రయాణం. అందుకే ఈ ఏడాది 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' (డబ్ల్యూఈఎఫ్) ఆమెకు 'యంగ్ గ్లోబల్ లీడర్' అవార్డును ఇచ్చి గౌరవించింది. సమాజంలో సానుకూల మార్పు తీసుకువచ్చేందుకు దూరదృష్టి, ధైర్యం, ప్రభావం చూపగల వ్యక్తులకు ఈ అవార్డును ఇస్తారు. 'పర్యావరణ పరిరక్షణకు భూమి ఆవేదనతో కూడిన తన గళాన్ని వినిపిస్తోంది. మార్పు కోసం అలుపెరుగని కృషి చేస్తోంది' అంటూ ఈ సందర్భంగా డబ్ల్యూఎఫ్ఈ కొనియాడింది.

2024 సంవత్సరానికి గానూ ప్రపంచవ్యాప్తంగా నలభై ఏళ్ల లోపు వయసుగల 90 మంది గ్లోబల్ చేంజ్ మేకర్స్‌ను డబ్ల్యూఎఫ్ఈ ఆ మధ్య అవార్డులు ప్రకటించింది. 'వారిలో నేను కూడా ఒకరిని అయినందుకు, సామాజిక ప్రయోజనాల కోసం నేను చేస్తున్న కృషికి గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉంది. ఈ పురస్కారం నాకు ఎంతో ప్రతిష్ఠాత్మకం. దీన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నా' అంటున్న భూమికి అవార్డులు కొత్తేమీ కాదు. పరిశ్రమలో ఎంతో ప్రతిభగల తారగా గుర్తింపు పొందిన ఆమెను... పలు 'ఫిలిమ్ ఫేర్ అవార్డు'లతో పాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు వరించాయి.

సమాజానికి తిరిగి ఇవ్వాలి...

'ప్రకృతిపరంగా, సామాజికంగా మనం ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నాం. అందుకు మనం కూడా ఈ సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి. చిన్నప్పటి నుంచీ నాలో ఈ భావన బలపడింది. సినిమాల ద్వారా, అలాగే అవగాహన, సేవా కార్యక్రమాల ద్వారా ఆ దిశగా నా వంతు కృషి చేస్తున్నా. ఇక వాతావరణంలో సంభవిస్తున్న ప్రతికూల మార్పుల గురించి 2016లోనే నేను గళం విప్పాను. నాటి నుంచి దీనివల్ల జరిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాను. ఒకరికి చెప్పాలంటే ముందు సంబంధిత అంశాలపై మనకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలి. దాని కోసం నేను ఎంతో పరిశోధించాను. విరివిగా పుస్తకాలు చదివాను. ఇందులోని సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు ఏంటన్నది అధ్యయనం చేశాను. తొలినాళ్లలో వాతావరణ మార్పులపై మాట్లాడినప్పుడు కొందరు నన్ను తప్పుపట్టారు. అవహేళన చేశారు. కానీ వాటిని నేను పట్టించుకోలేదు. నా ఆలోచనలకు దగ్గరగా ఉన్నవారితో కలిసి ఈ ప్రయాణం మొదలుపెట్టాను' అంటున్న భూమికి నలుగురిలో ఒకరిగా బతికేయడం అస్సలు నచ్చదు. అది సినీ పరిశ్రమ అయినా... బయటి ప్రపంచంలో అయినా... తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కావాలని కోరుకొంటుంది. దాని కోసం అహర్నిశలూ శ్రమిస్తుంది.



కల నిజం చేసుకొని...

'యష్‌రాజ్ ఫిలిమ్స్'లో అసిస్టెంట్ క్యాస్టింగ్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన భూమి... నటి కావాలని చిన్నప్పటి నుంచి కలలు కన్నది. ఎన్నో ఇబ్బందులు పడి పరిశ్రమలో నిలదొక్కుకున్న ఆమె... పుట్టింది, పెరిగిందీ ముంబయిలోనే. ఆమె తండ్రి సతీష్ మహారాష్ట్ర మాజీ మంత్రి. ఓరల్ కేన్సర్‌తో తండ్రి చనిపోవడంతో... తల్లి సుమిత్ర పొగాకు వ్యతిరేక ఉద్యమం నడిపారు. 'ఆర్య విద్యామందిర్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన భూమి.. పదిహేనేళ్ల వయసులోనే నటన వైపు అడుగులు వేసింది. నటనలో శిక్షణ కోసం 'విజిలింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్' స్కూల్‌లో చేరాలనుకుంది. బ్యాంకులో రుణం తీసుకుని మరీ అందులో చేర్పించారు ఆమె తల్లితండ్రులు.

అయితే తరగతులకు తరచూ డుమ్మా కొట్టడంతో భూమిని ఆ సంస్థవాళ్లు బయటకు పంపించారు. ఆ తరువాతే 'యష్‌రాజ్ ఫిలిమ్స్'లో చేరింది. ఆరేళ్లు అక్కడ పని చేసిన తరువాత... అంటే 2015లో ఊహించని బ్రేక్ వచ్చింది. 'దమ్ లగాకే హైసా'లో హీరోయిన్‌గా అవకాశం లభించింది. అందులో అధిక బరువు గల అమ్మాయి పాత్ర. దాని కోసం అప్పటికే బొద్దుగా ఉన్న భూమి... మరింత బరువు పెరిగింది. ఆ చిత్రంలోని నటనకు గానూ 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' లభించింది. ఇక అక్కడి నుంచి జయాపజయాలతో సంబంధం లేకుండా ఆమెకు అవకాశాలు వస్తూనే ఉన్నాయి.

వైవిధ్యానికి మారుపేరు...

కథల ఎంపిక విషయంలో భూమి ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది. వచ్చిన అవకాశాలన్నిటికీ ఓకే చెప్పకుండా వైవిధ్యమైన పాత్రలను మాత్రమే ఎంచుకొంటోంది. పాత్ర డిమాండ్ చేస్తే.. శరీర ఆకృతిని మార్చుకోవడానికి కూడా వెనకాడదు భూమి. ఆ క్రమంలోనే తొలి చిత్రం పూర్తయ్యేసరికి 89 కేజీల బరువున్న ఆమె... తరువాత ప్రాజెక్ట్ కోసం 57 కేజీలకు తగ్గింది.

పరిశ్రమలోకి వచ్చి పదేళ్లు కూడా కాలేదు. కానీ ఇరవైకి పైగా చిత్రాల్లో నటించింది. ఈ కొద్ది ప్రయాణంలోనే బడా స్టార్లు బాలీవుడ్‌ను ఏలుతున్నా... తనకంటూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకోగలిగిందంటే... వృత్తిపట్ల ఆమెకు ఎంతటి అంకితభావమో అర్థం చేసుకోవచ్చు.

భూమి ఫౌండేషన్...

ఒకవైపు వరుస సినిమాలతో బిజీగా ఉన్నా... మరోవైపు సామాజిక కార్యక్రమాల కోసం కూడా తగిన సమయం కేటాయిస్తుంది భూమి. అందుకు ఒక వేదిక ఉండాలన్న ఉద్దేశంతో 'భూమి ఫౌండేషన్' నెలకొల్పింది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా సముద్రతీరాల్లోని వ్యర్థాలను తొలగించడం, మొక్కలు నాటడం, వాన నీటి సంరక్షణ తదితర ప్రచార కార్యక్రమాలు చేపడుతోంది. 'వాతావరణ మార్పులకు సంబంధించిన వార్తలు, వాటివల్ల కలిగే దుష్పరిణామాలు నిత్యం పతాక శీర్షికల్లో చూస్తున్నాం. నా దృష్టిలో ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు ఇది. మా ఫౌండేషన్ ద్వారా ఆచరణాత్మక మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను' అంటున్న ఈ నటి అందుకు అవసరమైన నిధులను తానే సమకూర్చుకొంటోంది. 'ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం'లో కూడా భూమి భాగస్వామి అయింది.

తేనెతో వీటిని కలపొద్దు...

తేనె ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే తీపి పదార్థం. కొన్ని ప్రత్యేక వంటకాల్లో, బేకింగ్ ఉత్పత్తుల్లో చక్కెరకు బదులు తేనెను ఉపయోగిస్తుంటారు. అంతే కాదు ఎన్నో ఔషధగుణాలు ఉన్న తేనెతో ఆయుర్వేద మందులు కూడా తయారు చేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతోపాటు చర్మ సంబంధిత అలెర్జీల నివారణకు, కాలిన గాయాలను మాన్పడానికి, దగ్గు తదితర గొంతు సమస్యల నుంచి బయటపడేందుకు తేనె అద్భుతంగా పనిచేస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న తేనెను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. ముఖ్యంగా కొన్ని పదార్థాలతో తేనెను అసలు కలపకూడదు అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దాం!

వేడి నీళ్లు: బాగా వేడిగా ఉండే నీళ్లతో కలిపినపుడు తేనెలోని ఎంజైమ్స్, పోషకాలు నశిస్తాయి. అందులోని సహజ చక్కెరలు కూడా వేడెక్కి, కార్సినోజెనిక్ పదార్థాలను విడుదల చేస్తాయి. వీటివల్ల కేన్సర్ వచ్చే ప్రమాదముంటుంది. అందుకే గోరువెచ్చని నీటితో కలిపి సేవించడం మంచిది.

వెల్లుల్లి: కొన్ని చైనీస్ వంటకాల్లో తేనెను, వెల్లుల్లిని కలిపి అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఫ్రై చేస్తుంటారు. దీనివల్ల వెల్లుల్లిలోని ఘాటైన పొరలు తేనెకున్న సహజ స్వభావాన్ని నాశనం చేస్తాయి. ఈ రెంటినీ కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.

కీర: తేనె, కీర రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ వీటికున్న వ్యతిరేక లక్షణాల వల్ల రెంటినీ కలిపి తీసుకోవడం మంచిది కాదని ఆయుర్వేదం చెబుతోంది. కీరా శరీరాన్ని చల్లబరిస్తే తేనె వేడిని పుట్టిస్తుంది. ఈ రెంటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

డెయిరీ ఉత్పత్తులు: బాగా వేడిగా ఉన్న పాలు, కాఫీ, టీలతో తేనెను కలిపితే వాటిలోని ప్రొటీన్లు గడ్డ కట్టి తేనె స్వభావాన్ని మార్చి విషతుల్యం చేస్తాయి. వేడిగా ఉన్న గ్రీన్ టీ, ఫ్లేవర్డ్ మిల్క్, హాట్ చాక్లెట్‌లతో కూడా తేనెను కలపకూడదు.

పుల్లని పండ్లు: పుల్లని పండ్లలో ఆమ్ల లక్షణాలు ఉంటాయి. ఇవి తేనె రుచిని, స్వభావాన్ని మార్చి పొట్టలో గ్యాస్ట్రిక్ ట్రబుల్ వచ్చేలా చేస్తాయి. పైనాపిల్, మామిడి పండ్లతో కలిపి తీసుకుంటే మధుమేహం వచ్చే ప్రమాదముంటుంది. తేనెను యోగర్ట్, ఓట్స్, బ్రెడ్ వంటి ఆమ్లరహిత పదార్థాలతో కలిపి తీసుకోవడం మంచిది.

నెయ్యి: తేనె, నెయ్యి రెంటినీ సమానపాళ్లలో కలిపి తీసుకోవడం అత్యంత ప్రమాదం. దీనివల్ల శరీరంలో క్లోస్ట్రీడియమ్ బొటులిజం బ్యాక్టీరియా ఉత్పత్తవుతుంది. ఇది పలు టాక్సిన్లను విడుదల చేసి శ్వాసకోశ సమస్యలను, కేన్సర్‌ను, కడుపునొప్పిని కలిగిస్తుంది. దీనికి



సంబంధించిన వివరణ ప్రముఖ ఆయుర్వేద గ్రంథం చరక సంహితలో కూడా ఉంది.

మాంసం, చేపలు: గుడ్లు, మాంసం, చేపల్లో అధిక పరిమాణంలో ప్రొటీన్లు ఉంటాయి. వీటిని తేనెతో కలిపి తీసుకుంటే జీర్ణక్రియ ఆలస్యమవుతుంది. దీనివల్ల కడుపులో అజీర్తి, వికారం, వాంతులు వంటి సమస్యలు వస్తాయి.

ప్రకృతితో బంధం

వినూత్నం

చుట్టూ అడవి, కొండల మధ్యన ఒక క్యాంపు. అక్కడి ప్రకృతి అందాలు వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు ఆ క్యాంప్‌లో బస చేయవచ్చు. కానీ అందులో అటాచ్డ్ బాత్‌రూములు ఉండవు. గీజర్‌లు కనిపించవు. ఏసీల మాటే ఉండదు. రాజస్థాన్‌లోని గోద్వారాలో ఉన్న భాగీరా క్యాంప్‌లో అడుగుపెడితే కనిపించే దృశ్యం ఇది. పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ క్యాంప్‌ని ఏర్పాటు చేశారు వన్యప్రాణి సంరక్షకురాలు పద్మజా రాథోర్. ఇది రిసార్టు కాదు, జంగిల్ క్యాంప్ అంటున్న పద్మజా రాథోడ్ విశేషాలు ఇవి...

"ప్రకృతి నుంచి మనం వేరుగా లేము. దానికి అంతర్భాగంగా ఉన్నాం. ప్రతిఒక్కరూ ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని అంటారు పద్మజా రాథోడ్. వన్యప్రాణుల సంరక్షురాలిగా ఆమె గోద్వార్ ప్రజలకు సుపరిచితురాలు. అంతరించిపోతున్న జాతులను సంరక్షించడంతో పాటు స్థానిక మహిళలకు సాధికారత కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు పద్మజ. ప్రకృతికి, మనుషులకు మధ్య ఉన్న సామరస్యపూర్వక సంబంధాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆమె పనిచేస్తున్నారు. "నాకు నా తల్లిదండ్రులే ప్రేరణ. వారి సహకారంతోనే ఈ పనులన్నీ చేస్తున్నాను. మెహ్రాన్‌ఘర్ కోటలో మార్వార్‌లోని నీటి సంరక్షణా వ్యవస్థల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను" అని అంటారు పద్మజ.



అవగాహన కల్పించడం కోసం...

పద్మజా రాథోడ్ వైల్డ్‌లైఫ్ సోషల్ ఎంటర్‌ప్రైజ్ అండ్ కమ్యూనిటీ రిజర్వ్‌గా భాగీరా క్యాంప్‌ను ప్రారంభించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది ఒక ఆర్గానిక్ వెల్‌నెస్ క్యాంప్. గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కోర్సులను అందించే కేంద్రంగా ఉపయోగపడుతోంది. ఒకప్పుడు పచ్చదనం, సమృద్ధిగా ఉన్న భూగర్భజలాలతో గోద్వార్ ప్రాంతం కళకళాడుతూ ఉండేది. ఆ తరువాత మారిన పరిస్థితులతో విధ్వంసం జరిగింది. విచ్చలవిడి పర్యాటకం, పారిశ్రామికీకరణ, అడవులను నరికివేయడం, పెరిగిన జనాభా వంటివి విధ్వంసానికి కారణమయ్యాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు పద్మజా రాథోడ్ భాగీరా క్యాంప్‌ను నెలకొల్పారు. గోద్వార్ ప్రాంతంలోని జవాయిలో గ్రానైట్ కొండల మధ్య ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఇది లగ్జరీ సఫారీ అనుభవాన్ని అందించే చోటు అనుకుంటే పొరపాటు. ప్రకృతికి, మనుషులకు మధ్య ఉన్న సంబంధాన్ని పెంపొందించడం కోసం ఏర్పాటు చేసిన స్వర్గధామం అని చెప్పుకోవచ్చు. ప్రకృతి సరిహద్దుల గురించి అవగాహన కల్పించడం, ప్రజలు తమ పరిసరాల గురించి తెలుసుకునేలా చేయడం, చుట్టూ ఉండే జీవులను గౌరవించేలా ప్రోత్సహించడం అనే ఆలోచనతో



ఈ క్యాంప్ ప్రారంభమైంది.

ఆలోచన విజయవంతం

భాగీరా క్యాంప్ ఏర్పాటు చేశాక పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం, చిత్తడి నేలలు ఎండిపోవడం వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించడం కోసం 'రీవైల్డింగ్ జవాయి' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతాల్లో నీటివనరులు పునరుత్తేజం పొందేలా చేశారు. నీటిని నిల్వ చేసేందుకు భూమికి రంధ్రాలు చేశారు. ఈ విషయంలో ఆమె తండ్రి సహాయసహకారాలు అందించారు. ఆయన నీటి నిర్వహణలో నిపుణులు. ఒక దశాబ్దం తరువాత వారి కృషి ఫలించింది. జవాయిలో భూగర్భజలాలు విజయవంతంగా రీఛార్జ్ అయ్యాయి. వేసవికాలం రాకముందే ఎండిపోయే కిశోర్‌సాగర్ సరస్సు ఇప్పుడు ఏడాది పొడవునా జలకళతో కనిపిస్తోంది. అంతేకాకుండా నేలను సంరక్షించుకోవడం, వన్యప్రాణుల రక్షణలో స్థానిక కమ్యూనిటీలను భాగస్వాములను చేయడం, సాధికారతను కల్పించడం, దేశీయ పద్ధతులను ప్రోత్సహించడం వంటివి చేశారు. "గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌తో పాటు ముఖ్యమైన ఇతర జంతుజాలం అంతరించే దశలో ఉంది. 1995 నుంచి ఒంటెల సంఖ్య 60 శాతం తగ్గిపోయింది" అంటారు పద్మజ. ఈ పరిస్థితులను మార్చేందుకు ఆమె బహుముఖ విధానాన్ని అనుసరించారు. ఈ విధానంతో వన్యప్రాణులను సంరక్షించడమే కాకుండా, పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం సాధ్యమైంది. గడ్డిభూములు ఔషధ మొక్కలతో కొత్త రూపు సంతరించుకున్నాయి.

"భాగీరా క్యాంప్ స్థిరమైన జీవనానికి నిదర్శనం. ఇక్కడ సఫారీ కూడా ప్రకృతి పట్ల గౌరవంతో నిర్వహిస్తాం. ఇక్కడ బసచేసే వారు స్థానికుల వలే జీవించాల్సి ఉంటుంది. ప్రత్యేక వసతులు ఉండవు" అని వివరిస్తారు పద్మజ. ఆమె వన్యప్రాణుల సంరక్షణతో పాటు 'రాజ్ దాదిసా బదన్ కన్వర్ స్కూల్ ఆఫ్ సెల్ఫ్ స్టడీ'పేరుతో ఒక సంస్థను నడుపుతున్నారు. ఇక్కడ హోటల్ కార్యకలాపాలు, ఫొటోగ్రఫీ, ఫిల్మ్‌మేకింగ్ వంటి వాటిలో నైపుణ్య శిక్షణను అందిస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గ్రామీణ ప్రజలకు ప్రాథమిక విద్యతోపాటు ఆతిథ్య నైపుణ్యాలను అందించడం ద్వారా వారిని పర్యావరణ పరిరక్షకులుగా మార్చేందుకు ఆమె కృషి చేస్తున్నారు.

సుమారు ఐదువందలకు పైగా గిరిజనులతో కలిసి పనిచేస్తున్నారు. 2017లో భాగీరా క్యాంప్‌కు ఔట్‌లుక్ రెస్పాన్సిబుల్ ట్రావెల్ అవార్డు లభించింది.

నవ్య | చిత్రజ్యోతి



క్రిస్మస్ కోసం సిద్ధం

నితిన్ హీరోగా నటిస్తున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్ హుడ్' షూటింగ్ దాదాపు పూర్తయింది. శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఆరు రోజుల టాకీ వర్క్, రెండు పాటలు మాత్రమే బ్యాలెన్స్ ఉన్నట్లు దర్శకుడు వెంకీ కుడుముల చెప్పారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంతో జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ మొదటి వారంలో టీజర్ విడుదల చేస్తామనీ, క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 20న సినిమాను రిలీజ్ చేస్తామనీ నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. 'రాబిన్‌హుడ్' చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ కాగా, జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

లొకేషన్ల వేటలో జక్కన్న





మహేశ్‌బాబు-రాజమౌళి కలయికలో పాన్ ఇండియా చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఎస్ఎస్ఎంబీ 29 'అనేది ప్రచారంలో ఉన్న వర్కింగ్ టైటిల్. మహేశ్‌బాబు ఇప్పటికే ఈ సినిమా కోసం కొత్తలుక్‌తో సిద్ధమయ్యారు. ఈ సినిమాకు సంబంధించిన పనులు శరవేగంతో సాగుతున్నాయని రాజమౌళి చెప్పకనే చెప్పారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసిన రాజమౌళి లొకేషన్ల వేటలో పడ్డారు. మంగళవారం ఆయన సోషల్ మీడియాలో ఓ ఫొటోను పోస్ట్ చేసి 'వెతుకుతున్నాను' అని తెలిపారు. ఆ ఫొటోలో కెన్యాలోని అటవీ ప్రాంతంలో జంతువుల మధ్య తిరుగుతూ రాజమౌళి కనిపించారు. అటవీ నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కబోతోందని రాజమౌళి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన కెన్యాలోని అడవుల్లో చిత్రీకరణకు అనువైన ప్రదేశాలను వెతికే పనిలో ఉన్నారని తెలుస్తోంది. లొకేషన్లు ఖరారు అయితే సెట్స్‌పైకి వెళ్లడమే ఆలస్యం. కొత్త ఏడాదిలో చిత్రీకరణ ప్రారంభమవనుంది.



రిలీజ్ డేట్ ఫిక్స్

ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో హీరో సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ నటించిన మల్టీ స్టారర్ చిత్రం 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ద బ్రేవ్' దీని ట్యాగ్‌లైన్. ఎస్.ఎన్. రెడ్డి, పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. నవంబరు 22న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోస్టర్‌లో సత్యదేవ్, డాలీ ధనంజయ ఫెరోసియస్‌గా కనిపించారు. బ్యాక్ డ్రాప్‌లో కరెన్సీ నోట్లు, లైట్ హౌస్, ఫ్యాక్టరీ మొదలైన ఎలిమెంట్స్ ఉన్నాయి. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్స్, మోషన్ వీడియో, టీజర్‌తో మేకర్స్ క్యూరియాసిటీని పెంచారు. టీజర్ మంచి రెస్పాన్స్‌తో భారీ అంచనాలను నెలకొల్పింది.

రొమాంటిక్‌గా మరో సారి...



'స్వామి రారా', 'కేశవ' సినిమాల తర్వాత నిఖిల్ సిద్ధార్థ్, డైరెక్టర్ సుధీర్ వర్మ కలయికలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. రుక్మిణీ వసంత్, దివ్యాంశ కౌశిక్ కథానాయికలు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. నవంబర్ 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన రొమాంటిక్ ఫస్ట్ సింగిల్ 'హే తార' అందర్నీ ఆకట్టుకుంది. తాజాగా, ఈ సినిమా నుంచి రెండో పాటను విడుదల చేశారు. 'నీతో ఇలా' అని సాగే ఈ రొమాంటిక్ గీతంలో నిఖిల్ సిద్ధార్థ్, దివ్యాంశ కౌశిక్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. రాకేందు మౌళి సాహిత్యం అందించగా.. కార్తీక్, నిత్యశ్రీ ఆలపించారు. ఎడిటింగ్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం:కార్తీక్.

మంచి సినిమా నిర్మించా

హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ దర్శకులు. నిర్మాత **చింతా గోపాలకృష్ణారెడ్డి**. ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మీడియాతో ముచ్చటించారు.'నాకు చిన్నప్పటి నుంచి పాటలు వినడం ఇష్టం. అలా సినిమాల మీద బాల్యం నుంచే ఆసక్తి ఏర్పడింది. వృత్తిపరంగా వ్యాపారవేత్తగా మారినా సినిమాల మీద ఇంట్రెస్ట్ అలా ఉండిపోయింది. లాక్‌డౌన్ టైమ్‌లో 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు' అనే సినిమా ప్రొడ్యూస్ చేశాను. 'క' సినిమా కథ విన్నప్పుడు కంటెంట్ చాలా కొత్తగా ఉంది అనిపించింది.



ఇందులో సస్పెన్స్, సెంటిమెంట్ ఉన్నాయి. ఇద్దరు దర్శకులు సుజీత్, సందీప్ స్క్రిప్ట్ బాగా నెరేట్ చేశారు. కథను ఎంత బాగా చెప్పారో అంతకంటే బాగా తెరకెక్కించారు. ఔట్‌పుట్ చూసి ఇంప్రెస్ అయ్యాను. ఈ సినిమాకు సీక్వెల్ కూడా చేసుకోవచ్చు. కిరణ్ అబ్బవరం కష్టపడే తత్వం ఉన్న హీరో. చాలా మంచివాడు. 'క' సినిమాకు ఎంతో శ్రమించి వర్క్ చేశాడు. హైదరాబాద్‌లో చాలా మంచి థియేటర్స్ దొరికాయి. మొత్తంగా 350కి పైగా థియేటర్లలో 'క' రిలీజ్ అవుతోంది' అని తెలిపారు.

రాష్ట్రంలో 54 కరువు మండలాలు

- తక్కువ వర్షపాతం నమోదైన మండలాలను ప్రకటించిన ప్రభుత్వం
- కలెక్టర్ల ప్రతిపాదనలతో నోటిఫికేషన్ జారీ

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నిరుడు రాష్ట్రవ్యాప్తంగా సాధారణ స్థాయిలో కూడా వర్షాలు కురవకపోయినా.. గత ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడానికి మీనమేషాలు లెక్కించింది. తీవ్ర దుర్భిక్షం నెలకొన్న జిల్లాల్లోనూ మొక్కుబడిగా కరువు మండలాలను ప్రకటించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా అధిక వర్షపాతం నమోదైనా.. సగటు వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకుని, సాధారణం కన్నా అతి తక్కువ వానలు పడ్డ మండలాలను కరువు మండలాలుగా గుర్తించింది. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైన 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఆయా జిల్లాల కలెక్టర్ల ప్రతిపాదనల మేరకు 27 తీవ్ర కరువు మండలాలుగా, 27 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించింది. దీనిపై మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

కరువు మండలాలు ఇవే...

అనంతపురం జిల్లా నార్పల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, అన్నమయ్య జిల్లా గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, టి.సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లె, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, పెద్ద తిప్పసముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె, చిత్తూరు జిల్లా పెనుమూర్, యాదమర్రి, గుడిపాలను తీవ్ర కరువు మండలాలుగా ప్రకటించారు. కర్నూలు జిల్లా కౌతాళం, పెద్ద కడుబూరు, అనంతపురం జిల్లా విడపనకల్, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి, ధర్మవరం, నంబులపులకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి, చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వెంకటగిరికోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించారు.

మల్లన్న సన్నిధిలో జస్టిస్ ఎన్వీ రమణ


జస్టిస్ ఎన్వీ రమణకు ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం, అక్టోబరు 29: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంలోని రత్నగర్భ గణపతిస్వామికి అభిషేకం నిర్వహించుకున్నారు. అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జస్టిస్ ఎన్వీ రమణకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

'భావనపాడు'ను పరిశీలించిన కేంద్ర బృందం

సంతబొమ్మాళి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో మంగళవారం బెంగళూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ తీరప్రాంత ఇంజనీర్ వ్యవస్థ(సీఐసీఈఎఫ్) డిప్యూటీ డైరెక్టర్ ఎంబీ బెలియప్ప, సభ్యులు భావనపాడు తీరప్రాంతంలో పర్యటించారు. బోటులో వెళ్లి ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత స్థలాన్ని, సముద్ర ముఖద్వారం వద్ద మేటలు వేసిన ఇసుక దిబ్బలను, ముఖద్వారానికి ఇరువైపులా ఉన్న క్రీక్‌వాల్‌ను పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి ముందస్తు బెయిల్

- షరతులతో మంజూరు చేసిన హైకోర్టు

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి హైకోర్టు ఊరట కల్పించింది. పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ఆయనతోపాటు మరికొందరికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరూ రూ.10 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. మూడు నెలల పాటు ప్రతీ నెల 1, 15వ తేదీల్లో దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించింది. అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులను ప్రభావితం చేయడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడొద్దని తేల్చిచెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నేతిగుట్లపల్లె, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు విషయంలో వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, అతని అనుచరులు దాడి చేశారని పేర్కొంటూ ఏఎస్‌ఆర్‌కె ప్రసాద్, సొహైల్ బాషా వేర్వేరుగా చేసిన ఫిర్యాదుల మేరకు పుంగనూరు పోలీసులు ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప మరికొందరిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

అబద్ధాలకు కేరాఫ్ జగన్!

- వెలిగొండలో ఎంతో పని పెండింగ్
- అయినా ప్రజల కళ్లకు గంతలు
- నీళ్లు వచ్చేస్తున్నాయని నమ్మించి జాతికి అంకితం చేశారు
- తల్లిని, చెల్లిని మోసం చేసినవారికి ప్రజలను ముంచడం ఓ లెక్కా..?
- ప్రాజెక్టును పూర్తిచేసి ప్రారంభించేది చంద్రబాబే
- మంత్రి నిమ్మల స్పష్టీకరణ
- గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యేలతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలన


మార్కాపురంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు. చిత్రంలో మంత్రులు గొట్టిపాటి, స్వామి

మార్కాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నీళ్లు వస్తున్నట్లు నమ్మించి.. ప్రజల కళ్లకు గంతలు కట్టి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ అని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. అబద్ధాలు, అసత్యాలకు ఆయన కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా ప్రజల జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులను మంగళవారం ఆయన ఉమ్మడి జిల్లా మంత్రులు స్వామి, గొట్టిపాటి రవికుమార్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో కలిసి పరిశీలించారు. అనంతరం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ప్రాజెక్టు పనులు చాలా పెండింగ్‌లో ఉన్నా పూర్తిచేసి నీళ్లిస్తున్నట్లు ఎన్నికలకు ముందు ప్రజల్ని జగన్ నమ్మించాలని చూశారు. ఆస్తి కోసం సొంత తల్లిని, చెల్లినే మోసం చేసినవాడికి ప్రజల్ని నమ్మించి నట్టేటముంచడం ఓ లెక్కా..? ఆయన ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రాజెక్టు పనులను కేవలం 5 శాతమే పూర్తిచేసింది. రూ.3 వేల కోట్ల నిధులు కేటాయించి రూ.170 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. ఇందులో రూ.50 కోట్ల బిల్లులను బంధువులైన కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టర్లకు చెల్లించారు. 2014-19 మధ్య మా ప్రభుత్వం రూ.1,373 కోట్లు కేటాయించి రూ.1,319 కోట్లు ఖర్చుచేసింది. టన్నెల్-1 పూర్తయినా దానిలో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని టన్నెల్-2 నుంచి తోలారు. దీనిని తొలగించాలంటేనే ఆరు నెలలు పడుతుంది. టన్నెల్-2లో ఇంకా 7 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే టన్నెల్‌లో 11 కిలోమీటర్ల లైనింగ్ పూర్తికావడానికి 11 ఏళ్లు పట్టింది. ఈ టన్నెళ్ల నుంచి నీటిని జలాశయానికి తరలించాలంటే 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్ పూర్తికావాలి. ఆ పనులూ అసంపూర్తిగా ఉన్నాయి. ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.880 కోట్లు ఇవ్వాల్సి ఉంది. వైసీపీ పాలనలో వారికి ఒక్క రూపాయి కూడా పరిహారం అందజేయలేదు. ఇన్ని పనులు, సమస్యలను పెండింగ్‌లో ఉంచి జగన్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల ప్రజలకు నిలువునా వెన్నుపోటు పొడిచారు' అని నిమ్మల దుయ్యబట్టారు. పశ్చిమ ప్రకాశం ప్రజల ఆశాజ్యోతి వెలిగొండను పూర్తిచేసి ప్రారంభించేది ముఖ్యమంత్రి చంద్రబాబే నన్నారు. పోలవరం తర్వాత దీనికే అంతటి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రకాల సాగు, తాగునీటి ప్రాజెక్టులు గత ఐదేళ్లలో విధ్వంసానికి గురయ్యాయన్నారు. ముఖ్యంగా ఏటా ప్రాజెక్టులు, స్కీముల నిర్వహణకు రూ.980 కోట్లు ఖర్చుచేయాల్సి ఉండగా జగన్ ప్రభుత్వం రూ.220 కోట్లే ఖర్చు చేయడం సిగ్గుచేటని తెలిపారు. 1,040 ఎత్తిపోతల పథకాలుంటే నిర్వహణలేక 450 వరకు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వం త్వరలో వాటర్ పాలసీ తీసుకురానుందని చెప్పారు.

కార్యకర్తల్ని విస్మరించడం తగునా!

- సజ్జలను ప్రశ్నించిన వైసీపీ శ్రేణులు


సజ్జలను ప్రశ్నిస్తున్న వైసీపీ కార్యకర్తలు, నేతలు

పామర్రు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఏదో గడిచిపోయింది. ప్రస్తుతం అధికార పార్టీనుంచి పార్టీ శ్రేణులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. శ్రేణులు తమగోడు విన్నవించుకునే సమయం ఇవ్వకపోవడం తగునా?' అంటూ ఆ పార్టీ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని పలువురు కార్యకర్తలు ప్రశ్నించారు. గుడివాడకు చెందిన సీనియర్ వైసీపీ నేత ఎంవీఎస్ నాగిరెడ్డి ఇటీవల అనారోగ్యం బారినపడ్డారు. ఆయనను పరామర్శించేందుకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, దేవినేని అవినాశ్, సింహాద్రి రమేశ్‌తో కలసి సజ్జల మంగళవారం గుడివాడ బయలుదేరారు. దారిమధ్యలో పామర్రులోని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ ఇంటి వద్ద ఆగారు. కైలే నివాసం వద్ద పోగుపడిన వివిధ గ్రామాల వైసీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను పట్టించుకోకుండా సజ్జల బృందం గుడివాడ వెళ్లేందుకు సిద్ధమయింది. దీంతో అక్కడకు వచ్చినవారు తీవ్ర అసంతృప్తితో తమను పట్టించుకోకుంటే ఎట్లా? అంటూ నిలదీశారు. సజ్జల స్పందిస్తూ... 'నేను కార్యకర్తల సమావేశానికి రాలేదు. నాగిరెడ్డిని పరామర్శించే నిమిత్తం ఇటు వచ్చా. త్వరలో మనమందరం కలిసి అధికార పార్టీ అవలంబిస్తున్న విధానాలను ఎలా ఎదుర్కోవాలో చర్చిద్దాం' అని హామీ ఇచ్చి గుడివాడ వెళ్లిపోయారు. దాంతో నిరుత్సాహంతో వైసీపీ శ్రేణులు వెనుతిరిగాయి.

ఉపాధి సిబ్బందికి రెండ్రోజుల ముందే వేతనాలు

- దీపావళి పండక్కిముందే అందడంపై హర్షాతిరేకాలు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి దీపావళి సందర్భంగా ఒకటో తేదీకి ముందే జీతాలు ఖాతాల్లో వేశారు. ఈ నెల 31న దీపావళి పండుగ రావడం, ఉద్యోగులకు జీతాలు ఒకటో తేదీ తర్వాత వస్తుండటంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఉపాధి సిబ్బందికి రెండు రోజుల ముందే జీతాలు విడుదల చేయాలని ఆదేశించారు. గత వైసీపీ హయాంలో ఏ తేదీన జీతాలు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నుంచి రెండు రోజుల ముందే జీతాలు తీసుకునే పరిస్థితి రావడంపై కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. గత వైసీపీ హయాంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విపరీతమైన మానసిక ఒత్తిడికి గురయ్యారు. నెలలో ఏ తేదీన జీతాలు ఇస్తారో తెలిసేది కాదు. ఒక్కోసారి రెండు నెలల జీతాలు కూడా ఆగిపోయేవి.


వైఎస్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్ జగన్

జమ్మలమడుగు జగడంపై జగన్ భేటీ

- సుధీర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి మధ్య కుదరని సయోధ్య!
- రెండు రోజుల పర్యటనకు పులివెందులకు మాజీ సీఎం

పులివెందుల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం పులివెందులకు చేరుకున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో బెంగళూరు నుంచి ఇడుపులపాయకు ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని తండ్రికి నివాళులు అర్పించారు. అనంతరం ఇడుపులపాయలోని అతిథిగృహంలో మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులను కలిశారు. 12 గంటల ప్రాంతంలో జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మధ్య సయోధ్య కుదిర్చేందుకు జగన్ భేటీ అయ్యారు. వారు ఇరువురూ ఎవరికి వారే యమునాతీరే అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. భేటీలో ఈ ఇద్దరూ వారి వారి సమస్యలను జగన్ వద్ద ఏకరువు పెట్టారు. ఇరువురి మధ్య సయోధ్యలేని కారణంగా పార్టీ జమ్మలమడుగులో బలహీనపడుతోందని, ఇద్దరూ కలిసి పనిచేస్తేనే పార్టీ బలపడుతుందని వారికి జగన్ సర్దిచెప్పినట్లు తెలిసింది. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో చెరో మూడు మండలాల బాధ్యతలను చూసుకోవాలని జగన్ చెప్పినట్లు తెలిసింది. దీనికి సుధీర్‌రెడ్డి అంగీకరించలేదని సమాచారం. రెండు గంటలపాటు సాగిన సయోధ్య చర్చల అనంతరం ముందుగా సుధీర్‌రెడ్డి గెస్ట్‌హౌస్ నుంచి మౌనంగా వెళ్లిపోయారు. అనంతరం రామసుబ్బారెడ్డి వెళ్లిపోయారు. జగన్ సాయంత్రానికి పులివెందుల చేరుకున్నారు. క్యాంపు కార్యాలయంలో తన కోసం వేచిచూస్తున్న నాయకులను, కార్యకర్తలను కలిశారు. అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించారు. మంగళవారం ప్రజాదర్బార్‌కు పులివెందుల ప్రజలు చెప్పుకోనేంత స్థాయిలో రాలేదు. జగన్ రాత్రికి పులివెందులలోనే బస చేశారు.

గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు

- 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహణ
- 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో ప్రతిపాదలు



పుష్కరాల నిర్వహణపై మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి, చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారైంది. 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకూ పుష్కరాలు నిర్వహించనున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో మంగళవారం పుష్కరాల నిర్వహణపై తొలి సమావేశం జరిగింది. మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ పురందేశ్వరి ఈ సమావేశంలో మాట్లాడారు. పుష్కరాలకు సుమారు 8 కోట్ల మంది యాత్రికులు వస్తారని అంచనా వేస్తున్నారు. సుమారు రెండున్నరేళ్ల కంటే ఎక్కువ సమయం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి నుంచే రంగంలోకి దిగారు. అఖండ గోదావరి పుష్కరాలు-2027 ముసాయిదా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమైంది. అందరూ ఒకే ఘాట్‌లో స్నానాలు చేసే అవసరం లేకుండా గోదావరి నదిలో ఎక్కడైనా స్నానాలు చేయొచ్చని ప్రచారం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది వస్తారని అంచనా వేశారు. మరో నాలుగు కొత్త ఘాట్లు అవసరమని భావిస్తున్నారు. యాత్రికుల బస ఏర్పాట్లపై చర్చించారు. రాజమహేంద్రవరం పరిధిలో గోదావరి ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. కార్పొరేషన్ రోడ్ల అభివృద్ధికి రూ.456.5 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి రూ.678.76 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. సిటీ బ్యూటిఫికేషన్, ఐకానిక్ టూరిజం సైట్ ప్రాజెక్టు కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

8 దేశాల్లోని 13 నగరాల్లో శ్రీనివాస కల్యాణాలు

- పోస్టర్ విడుదల చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి శ్రీనివాస కల్యాణోత్సవాలను యూకే, ఐర్లాండ్, యూరప్ దేశాల్లో భారీస్థాయిలో నిర్వహించాలని టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాయి. నవంబరు 9 నుంచి డిసెంబరు 21వ తేదీ వరకు మొత్తం 8 దేశాల్లోని 13 నగరాల్లో స్వామి వారి కల్యాణోత్సవాల నిర్వహణకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో విడుదల చేశారు.

మరియమ్మ హత్య కేసులో..

సురేశ్‌కు బెయిల్‌పై 6న నిర్ణయం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన మరియమ్మ హత్య కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నవంబరు 6న నిర్ణయం వెల్లడిస్తామని హైకోర్టు తెలిపింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో సోమవారం హైకోర్టులో వాదనలు సుదీర్ఘంగా సాగాయి. సురేశ్ పూర్వ నేర చరిత్రకు సంబంధించి ప్రాసిక్యూషన్ సమర్పించిన వివరాలపై ఆయన తరపు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అభ్యంతరం లేవనెత్తారు. తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన (క్రైమ్‌నెం.154/2024)ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్ పేరు ఉందని, మరో ప్రతిలో పేరులేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాలని ప్రాసిక్యూషన్‌ను హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. పోలీసు ఉన్నతాధికారుల ఒత్తిడితో ఎఫ్ఐఆర్‌ను మేజిస్ట్రేట్ ముందు ఉంచే సమయంలో ఆయన పేరు తొలగించారని తెలిపారు. ఈ విషయాన్ని అప్పటి దర్యాప్తు అధికారి అంగీకరించి.. వివరణ ఇచ్చారన్నారు. పొన్నవోలు స్పందిస్తూ.. ప్రస్తుత ప్రభుత్వంలో ఎఫ్ఐఆర్‌లు ఎలా మారుస్తున్నారో దీనినిబట్టి అర్థమవుతోందన్నారు. ఆయన వాదనను పబ్లిక్ ప్రాసిక్యూటర్ తప్పుపట్టారు. ఎఫ్ఐఆర్‌లో పేరు తొలగింపు జూన్ 10న జరిగిందని.. కొత్త ప్రభుత్వం జూన్ 12న ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. సురేశ్ బెయిల్ పిటిషన్‌పై నిర్ణయాన్ని వాయిదా వేశారు. కాగా, మంత్రి సత్యకుమార్‌పై గతంలో జరిగిన దాడికి సంబంధించి తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నందిగం సురేశ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది.

నాకు బిర్యానీ పెట్టండి!



గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బోరుగడ్డ అనిల్

- ఇంటి నుంచైనా తెప్పించండి.. కస్టడీలో బోరుగడ్డ డిమాండ్
- ఒప్పుకోని గుంటూరు పోలీసులు .. స్థానిక మెస్ నుంచే భోజనం
- మట్టి గడ్డలు, రాళ్లు ఉన్న అన్నం పెట్టారని జడ్జికి అనిల్ ఫిర్యాదు
- విచారణలో బోరుగడ్డ అబద్ధాలపై నివేదిక సిద్ధం చేసిన పోలీసులు

గుంటూరు అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): "నాకు బిర్యానీ తినాలని ఉంది. తెప్పించండి. లేదా ఇంటి నుంచైనా ఆహారం తెప్పించండి" అని పోలీస్ కస్టడీలో ఉన్న వైసీపీ సానుభూతిపరుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ డిమాండ్ చేశారు. ఆయన డిమాండ్‌కు పోలీసులు ససేమిరా అన్నారు. సాధారణ నిందితులకు తెప్పించే విధంగానే మెస్ నుంచి భోజనం తెప్పించారు. అయితే, మంగళవారం బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు న్యాయాధికారి ఎదుట హాజరుపరిచిన సమయంలో ఆయన ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. "నాకు మట్టి గడ్డలు, రాళ్లు ఉన్న అన్నం పెట్టారు" అని చెప్పారు. దీనికి న్యాయాధికారి స్పందిస్తూ తాము తినేది కూడా అదే భోజనమని అనడంతో అనిల్ మిన్నకుండిపోయారు. అనిల్‌ను కోర్టు మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించడంతో ఆది, సోమవారాల్లో అరండల్‌పేట స్టేషన్‌లో పోలీసులు విచారించారు. కోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో మంగళవారం గుంటూరులోని జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం, ఆయనను ఐదవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి మళ్లీ రిమాండ్ విధించడంతో అనిల్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

చర్చనీయాంశంగా బోరుగడ్డ వ్యాఖ్యలు

కస్టడీ ముగియడంతో వైద్య పరీక్షల నిమిత్తం బోరుగడ్డను జీజీహెచ్‌కు తీసుకెళ్లిన సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత ఆయన పేరుతో ప్రకటనలు కూడా విడుదల చేశారు. తన వ్యక్తిత్వ హననం జరిగిందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు విమర్శలు గుప్పించారు. ఇది లావుంటే, పోలీసుల విచారణ సందర్భంగా కూడా అనిల్ తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారంటూ చెప్పగా పోలీసులు "నువ్వు ఇతర జిల్లాలకు వెళ్లి బోరుగడ్డ అనిల్ అనే పేరు గురించి ఎవరినైనా అడిగితే వారు ఎలాంటి కామెంట్ చేస్తారో ఒకసారి విను" అని సలహా ఇచ్చారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్న కొన్ని మీడియా సంస్థలకు తాను జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారానే సమాధానం చెప్తానని బోరుగడ్డ హెచ్చరించారు. ఇదంతా రాజకీయ కక్షని, తాను జగన్ అన్నకు సానుభూతిపరుడుగా ఉన్నానని, జగన్ అన్న మనిషినని కావాలనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. పోలీసుల కస్టడీ ముగియడంతో అరండల్‌పేట పోలీసులు మంగళవారం మధ్యాహ్నం బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు. అయితే, గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 9న రాత్రి తుళ్లూరులో జరిగిన రెండు ఘటనల్లో బోరుగడ్డ అనిల్ నిందితునిగా ఉన్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి, హౌసింగ్ ఏఈ గోపికృష్ణను బెదిరించారు. బోరుగడ్డ అనిల్ రెండు కార్లలో రావడంతో అక్కడ విధుల్లో ఉన్న ఏఎస్ఐ వి. ప్రసాద్ ఆయా కార్లను తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా ఆయనను తీవ్ర స్థాయిలో బెదిరించారు. రాబోయేది తమ ప్రభుత్వమని, మేం వైసీపీ నాయకులమని, మా వాహనాలు తనిఖీ చేస్తారా అంటూ బెదిరించారు దీనిని చిత్రీకరించిన ఏబీఎన్ విలేకరిపై కూడా దాడి చేశారు. ఏఎస్ఐ ప్రసాద్ ఫిర్యాదు మేరకు తొలుత పోలీస్‌స్టేషన్‌లో బోరుగడ్డ అనిల్, అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. ఆ తరువాత అనిల్ సమీపంలో ఉన్న ఓ రూములోకి తన అనుచరులతో దౌర్జన్యంగా వెళ్లి అక్కడ ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడిపై దాడికి ప్రయత్నించారు. ఆ గదిలో టీడీపీ జెండాలు ఉండడంతో వారు ప్రస్తుత కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరులు అంటూ ఒడిశాకు చెందిన హేమచంద్రపై దాడి చేసి కొట్టారు. దీనిపై కూడా తుళ్లూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఆ రెండు కేసుల్లో నిందితుడైన బోరుగడ్డను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి బుధవారం మంగళగిరి కోర్టులో హాజరు పరచనున్నారు. మరోవైపు, బోరుగడ్డపై శ్రీకాకుళం, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోనూ పలు కేసులు నమోదైనట్లు సమాచారం.

బోరుగడ్డ అబద్ధాలపై నివేదిక సిద్ధం

అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో రెండు రోజులపాటు పోలీసులు అనిల్‌ను విచారించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాధానం చెప్పినట్లు పోలీసులు నిర్ధారించారు. కనీసం ఫోన్ నెంబర్ కూడా తనకు తెలియదని చెప్పడాన్ని పోలీసు తప్పుబడుతున్నారు. ప్రాథమికమైన అంశాల్లోనూ కేసులు తప్పుదారి పట్టించేలా అబద్ధాలు చెప్పారని పేర్కొంటూ నివేదికను కోర్టుకు సమర్పించనున్నారు.

జనగణనతో పాటు బీసీ గణనా చేయండి

- సీఎం చంద్రబాబుకు బీసీ సంఘాల వినతి.. 10 లక్షల సాయం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా జరగనున్న జనగణనలో బీసీ జనగణన కూడా చేపట్టాలని బీసీ సంఘాల నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ అధ్యక్షులు కేసన శంకర్‌రావు నేతృత్వంలో బీసీ ప్రతినిధుల బృందం సీఎంను ఉండవల్లి నివాసంలో కలిసి పది అంశాలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ నేతలు వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల చెక్కును అందించారు. చంద్రబాబు వారిని అభినందించారు.

జల వనరుల శాఖలో ఎట్టకేలకు పదోన్నతులు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ ఇంజనీర్లకు పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీచేశారు. విజయవాడలో పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న కె.నాగరాజుకు పదోన్నతి కల్పించి అనంతపురం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుగా నియమించారు. క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండింగ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.పుల్లారావును గోదావరి డెల్టా సీఈగా నియమించారు. పోలవరం హెడ్‌వర్క్స్‌లో ఎస్ఈగా అదనపు బాధ్యతల్లో ఉన్న కె.నరసింహమూర్తికి సీఈగా అడ్‌హాక్ పదోన్నతి ఇచ్చారు.

అమెరికాలో ట్రంప్ తరఫున తెలుగువారి ప్రచారం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ తానా పూర్వ అధ్యక్షుడు సతీష్ వేమన, మిత్రులు ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. అక్కడ తెలుగువారి మద్దతు కూడగట్టి ప్రెసిడెంట్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయానికి కృషి చేస్తున్నారు. అమెరికా అధ్యక్ష అభ్యర్థి ట్రంప్, ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్‌తో కలిసి అమెరికా-భారత్‌ల మధ్య సత్సంబంధాలకు తమ వంతు కృషి చేస్తామని సతీష్ వేమన తెలిపారు.

దేవాలయాలకు నాణ్యమైన నెయ్యి: మంత్రి ఆనం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు స్వచ్ఛమైన నెయ్యి సరఫరాపై సమగ్రమైన విధానాన్ని రూపొందించేందుకు ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. సీనియర్ అధికారులు, డెయిరీల సంఘాలు, ఎస్వీ డెయిరీ కళాశాల ప్రతినిధులతో కూడిన ఈ కమిటీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను అధ్యయనం చేసి, 15రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. మంగళవారం దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆరోగ్యశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన వివిధ డెయిరీ సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు.

ఏపీలో మహిళలపై అకృత్యాలు పెరిగాయి: వైసీపీ

న్యూఢిల్లీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అకృత్యాలు పెరిగాయని జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ మహిళా కమిషన్‌లకు వైసీపీ మహిళా నేతలు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ యాక్టింగ్ చైర్‌పర్సన్ విజయ భారతిని కలిసి ఏపీలో పరిస్థితిని వివరించారు. అనంతరం ఏపీ భవన్‌లో వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరదు కల్యాణి, ఎంపీ తనూజా రాణి, మాజీ ఎంపీలు చింత అనురాధ, మాధవి మీడియాతో మాట్లాడారు.

బేడా బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని వినతి

న్యూఢిల్లీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బేడా బుడగ జంగం కులాన్ని ఎస్సీ కులాల జాబితాలో చేర్చాలని ఏపీ బేడా బుడగ జంగం సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం నేతలు మంగళవారం ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించారు. తమను ఎస్సీలుగా గుర్తించకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు అందడం లేదని ఆ సంఘం నేతలు తిరుపతి మనోహర్, తాటికొండ కొండయ్య తెలిపారు.

సీఆర్‌డీఏలో పర్యావరణ యూనిట్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పర్యావరణ, సామాజిక అంశాల్లో సమతుల్యత ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో రాజధాని ప్రాంతంలో భారీగా పనులు చేపడుతున్నారు. రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి పర్యావరణ, సామాజిక ప్రభావిత అంశాలను పరిశీలించేందుకు ఎన్విరాన్మెంటల్ అండ్ సోషల్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

స్త్రీనిధి ఎండీగా జీవీబీడీ హరిప్రసాద్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా జీవీబీడీ హరిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదటగా ఏడాదిపాటు ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ జారీ చేసిన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆయన విజయనగరంలోని యూబీఐ రీజినల్ డిప్యూటీ హెడ్‌గా ఉన్నారు.

తిరుపతి-కాట్పాడి డబుల్ రైల్వేలైన్‌పై కేంద్రం సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పీఎం గతిశక్తి ఆధ్వర్యంలోని నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్(ఎన్‌పీజీ) సమావేశంలో తిరుపతి-కాట్పాడి మధ్య డబుల్ రైల్వేలైన్ అంశంపై అధికారులు సమీక్ష చేశారు. డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) అదనపు కార్యదర్శి రాజీవ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడును కలిపే తిరుపతి-కాట్పాడి డబుల్ రైల్వేలైన్‌పైనా సమీక్ష జరిపారు.

విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వాని కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని విద్యాసాగర్ విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించిన కోర్టు తదుపరి విచారణను వచ్చే నెల ఐదో తేదీకి వాయిదా వేసింది. మరోవైపు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కుక్కల విద్యాసాగర్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కూడా వాయిదా పడింది. హైకోర్టులో విద్యాసాగర్‌కు ఎదురుదెబ్బ తగలడంతో కస్టడీ పిటిషన్‌పై మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను వచ్చేనెల 4కి వాయిదా వేసింది.

ఆగస్టులో తప్పు..

సెప్టెంబరులో ఒప్పు!

- రవాణా శాఖలో జేటీసీ జోన్లపై విస్మయం
- గత ప్రభుత్వంలో అవసరం లేకున్నా జోన్లు
- సమీక్షించి రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- నెల తిరక్కుండా మళ్లీ కొనసాగిస్తూ నిర్ణయం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో 'జోన్ల' వ్యవహారం వివాదంగా మారింది. అదే సమయంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ల(జేటీసీ) బదిలీ కూడా విస్మయానికి దారితీసింది. గత వైసీపీ ప్రభుత్వం.. ఆర్టీసీలో ఉన్నట్టుగానే రవాణా శాఖలోనూ జోన్లను ఏర్పాటు చేసింది. ఈ జోన్లకు ప్రత్యేకంగా జేటీసీలను నియమించింది. అయితే.. కూటమి సర్కారు వచ్చాక.. ఈ జోన్లను రద్దు చేశారు. జేటీసీలను జిల్లాలకు పంపించేశారు. కానీ, ఇది జరిగి నెల రోజులు కూడా కాకుండానే మరోసారి జోన్లను కొనసాగించారు. ఈ వ్యవహారం.. రవాణాశాఖలో చర్చనీయాంశంగా మారింది. రవాణా శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి, కమిషనర్ చుట్టూ చర్చ జరుగుతోంది. అంతేకాదు, గత ప్రభుత్వంలో జేటీసీలను జోన్లలో ఉంచడం తప్పయితే ఇప్పుడెందుకు ఒప్పయింది? అనే అంశం కూడా తెరమీదికి వచ్చింది.

అసలేంటీ వివాదం?

రవాణా శాఖలో మోటారు వాహన ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) నుంచి డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) వరకు జిల్లాల్లో పని చేస్తుంటారు. జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ), అదనపు రవాణా కమిషనర్ కమిషనరేట్‌లో ఉంటారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కుడి భుజంగా వ్యవహరించిన ఓ అధికారి జేటీసీగా పదోన్నతి తెచ్చుకున్నారు. దీంతో రాయలసీమలో ఉండేలా ప్లాన్ చేసి తిరుపతి, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలో నాలుగు జోన్ల ఏర్పాటుకు తెరదీశారు. ఆర్టీసీలో కడప, నెల్లూరు, విజయవాడ, విజయనగరం జోన్లు ఉన్నట్లు రవాణా శాఖలోనూ ఉండేలా పెద్దలను ఒప్పించారు. ఇప్పటికే రవాణాశాఖలో ఆర్టీవో, డీటీసీ ఉన్నారని.. మూడో అధికారి వస్తే మరింత భారం అవుతుందని ఎంవీఐలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం రూపాయి ఇవ్వక పోయినా తిరుపతి, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలో జేటీసీ కార్యాలయాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ ఖర్చును కూడా ఎంవీఐలే భరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి ఈ శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనీశ్‌కుమార్ సిన్హా శాఖ గురించి వివరిస్తూ జేటీసీలు ప్రస్తుతం జోన్‌లలో ఉన్నారని, వారు కమిషనరేట్‌లో ఉంటే పనిభారం తగ్గుతుందని వివరించారు. అంతేకాదు, జోన్లలో పని లేనందున వారిని హెడ్ క్వార్టర్స్‌కు తీసుకొస్తే పని విభజన చేయవచ్చన్నారు. ఈ సలహా సముచితంగా ఉందంటూ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి వెంటనే నలుగురు జేటీసీలను కమిషనరేట్‌కు రప్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఆగస్టు 18న ఆదేశాలు జారీచేయడంతో మరుసటి రోజు నలుగురు జేటీసీలు కమిషనరేట్‌కు వచ్చి జాయిన్ అయ్యారు.

నెలన్నర తిరగకుండానే

ఇలా కమిషనరేట్‌లో చేరిన జేటీసీలను నెలన్నర కూడా తిరక్కుండానే సెప్టెంబరు చివరిలో మళ్లీ తిరుపతి, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం జోన్లకు పంపారు. గత ప్రభుత్వంలో విశాఖపట్నం జేటీసీగా ఉన్న సుందర్‌ను కమిషనరేట్‌కు రప్పించి ఇక్కడున్న రమాశ్రీని విశాఖకు, తిరుపతిలో ఉన్న బసిరెడ్డిని కమిషనరేట్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలోకి కృష్ణవేణిని, విజయవాడ జేటీసీ శివరామ్ ప్రసాద్‌ను గుంటూరుకు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఆగస్టులో అంత హడావుడిగా జీవో ఇచ్చి జేటీసీలను వెనక్కి రప్పించడం.. ఇప్పుడు వారిని మళ్లీ పంపించడం చర్చగా మారింది. కేవలం ఇద్దరు మహిళా అధికారులను విశాఖపట్నానికి ఒకరిని, తిరుపతికి మరొకరిని పంపేందుకే ఇలా చేశారా? అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు

కబ్జాదారుల నుంచి భూముల్ని విడిపించండి

- బాధితుల మొర.. టీడీపీ నేతలకు అర్జీలు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారుల నుంచి తమ భూముల్ని విడిపించి, న్యాయం చేయాలని పలువురు బాధితులు టీడీపీ నేతలకు విజ్ఞప్తి చేశారు. సహకార సంఘం నిధులు దుర్వినియోగం చేసిన అధికారిపై విచారణ జరపాలని, కెపాసిటీ బిల్డింగ్ సెంటర్స్ నిర్వహణ బిల్లులు విడుదల చేయాలని మరికొందరు కోరారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీహెచ్‌సీ చైర్మన్ తాతయ్య, తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై అధికారులకు మంత్రి ఫోన్ చేసి, చర్యలకు ఆదేశించారు. ఒక దివ్యాంగుడికి వీల్‌చైర్ అందించారు. వీఆర్వో నకిలీ రికార్డులు సృష్టించి, తమ భూమిని కొట్టేయాలని చూసి, తమను పోలీసులతో బెదిరిస్తున్నారని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన సొట్టా నరసింహులు వాపోయారు. కాగా, టీడీపీ కేంద్ర కార్యాలయంలో 31న ప్రజావేదిక కార్యక్రమాన్ని దీపావళి పండగ సందర్భంగా రద్దు చేసినట్లు ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు.

చివరికి వస్తోంది సగమే!

- లక్షలు ఖర్చు చేసి దరఖాస్తులు వేశాం
- 20% మార్జిన్‌లో వస్తోంది 10 శాతమే
- లబోదిబోమంటున్న మద్యం వ్యాపారులు



అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏదో ఊహించుకుని, భారీ లాభాలు వస్తాయన్న అంచనాతో లక్షలు పెట్టుబడి పెట్టి మద్యం వ్యాపారంలోకి దిగితే చివరికి నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని లైసెన్స్‌దారులు లబోదిబోమంటున్నారు. అమ్మకాలపై 20శాతం మార్జిన్ అనుకుంటే చేతికి 10 శాతమే వస్తోందని వాపోతున్నారు. లైసెన్సు ఫీజులు దాదాపుగా రెట్టింపైనా తమకిచ్చే మార్జిన్‌లో మాత్రం పెద్దగా పెంపు లేదని, పైగా చెప్పిన దాంట్లో సగమే వస్తోందని అంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ వైన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు ఎక్సైజ్ అధికారులను కలిసి మొరపెట్టుకున్నారు. ఇలాగైతే వ్యాపారం చేయడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రైవేటు షాపుల పాలసీలో అన్ని రకాల పన్నులు విధించిన తర్వాత లైసెన్స్‌దారులకు మార్జిన్ ఇచ్చేవారు. కానీ గత ప్రభుత్వంలో కొత్తగా ప్రవేశపెట్టిన అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్(ఏఆర్ఈటీ) వ్యాపారులను దెబ్బకొట్టింది. కొత్త పాలసీలో ప్రభుత్వం ఇస్తామని ప్రకటించిన 20శాతం మార్జిన్‌ను అన్ని పన్నులు విధించిన తర్వాత కాకుండా, ఏఆర్ఈటీకి ముందే వేస్తున్నారు. అంటే పన్నులు విధించిన తర్వాత వచ్చే ధరపై 20 శాతం మార్జిన్ ఇస్తున్నారు. తర్వాత ఏఆర్ఈటీ విధిస్తున్నారు. ఇందులో లైసెన్సీలకు వాటా లేకుండా నేరుగా ప్రభుత్వానికి వెళ్తోంది. ఏఆర్ఈటీ పన్ను చాలా ఎక్కువగా ఉంటుంది. దేశంలో తయారైన ఫారిన్ లిక్కర్‌పై 137 శాతం నుంచి 220 శాతం, బీరుపై 211 శాతం, వైన్‌పై 187 శాతంగా ఉంది. ఈ పన్నుపై మార్జిన్ ఇవ్వకపోవడంతో వ్యాపారులకు ఇచ్చే దాంట్లో భారీగా కోత పడుతోంది. అలాగే కొత్తగా విధించిన 2 శాతం డ్రగ్ కంట్రోల్ అండ్ రీహాబిలిటేషన్ సెస్, 1 శాతం టీసీఎస్ పన్నుపైనా మార్జిన్ ఉండదు. సీసాలపై విధించే రౌండాఫ్‌పైనా మార్జిన్ ఇవ్వరు. ఉదాహరణకు ఒక సీసా ధర రూ.151 ఉంటే రౌండాఫ్ కింద రూ.160 ఎమ్మార్పీ చేస్తారు. అలా రౌండాఫ్‌లో పెరిగిన రూ.9పై లైసెన్సీలకు మార్జిన్ ఇవ్వరు. ఈ మూడు కేటగిరీలపై మార్జిన్ ఇవ్వకపోవడంతో పాటు, ఏఆర్ఈటీపైనా మార్జిన్ లేకపోవడంతో సగటున చివరికి 10 శాతమే వ్యాపారులకు దక్కుతోంది.

అంత పెట్టుబడికి ఇంతేనా..

కొత్త మద్యం పాలసీలో లైసెన్స్ ఫీజులు భారీగా పెంచారు. వార్షిక ఫీజు రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు ఉంది. షాపుల కోసం వ్యాపారులు దరఖాస్తులపై భారీగా పెట్టుబడి పెట్టారు. 3,396 షాపులకు 89,882 దరఖాస్తులు వచ్చాయి. రూ.1800 కోట్ల మేర ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. చాలామంది వ్యాపారులు ఒక్కో షాపు దక్కించుకోవడానికి దాదాపు ఒక ఏడాది లైసెన్స్ ఫీజును దరఖాస్తు రుసుముల రూపంలోనే చెల్లించారు. అవన్నీ కలిపితే ఎక్కువమంది రూ.కోటికి పైగానే పెట్టుబడి పెట్టారు. రూ.100 సీసాపై రూ.20 వస్తుంది అనుకున్నామని, కానీ రూ.10 మాత్రమే వస్తోందని, 10 శాతం అసలు వ్యాపారులకు చేరట్లేదని అంటున్నారు.

కొన్ని బ్రాండ్లపై మరీ తక్కువ!

మద్యంపై విధించే పన్నులు కేసు ధర ఆధారంగా మారిపోతాయి. ప్రీవియం బ్రాండ్లపై ఎక్కువ పన్నులు పడతాయి. వాటిపై మాత్రం మెరుగైన మార్జిన్ వస్తోంది. అయితే అలాంటి బ్రాండ్లు, విక్రయాలు తక్కువ. ఎక్కువగా అమ్ముడుపోయే చీప్ లిక్కర్, మీడియం బ్రాండ్లపై బాగా తక్కువ మార్జిన్ వస్తోంది. ఈ గణాంకాలను వైన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఎక్సైజ్ అధికారులకు అందించారు. కొన్ని బ్రాండ్లపై 9 శాతం, 8.9 శాతం కూడా మార్జిన్ వస్తోందని అందులో పేర్కొన్నారు.

వంశీ కోసం.. లాయర్ వేషం!

- దాడి భయంతో వైసీపీ నేతలను భద్రతకు తెచ్చుకున్న వల్లభనేని
- బెజవాడ కోర్టుల ప్రాంగణంలో హల్చల్

విజయవాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా వైసీపీ నాయకుల పంథా మారలేదు. పవిత్రమైన న్యాయవాద వృత్తికి కళంకం తెచ్చేలా తమ అనుచరులు కొందరితో న్యాయవాదుల వేషం వేయించి.. రక్షణగా నియమించుకున్నారు. దీనికి సోమవారం విజయవాడ కోర్టులో జరిగిన డ్రామానే నిదర్శనం. ఒకింత ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన చర్చనీయాంశం అయింది. ఒకే కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, గూడవల్లి నరసయ్య సోమవారం విజయవాడలోని కోర్టుకు హాజరయ్యారు. కేసు నమోదు చేసిన సమయంలో ఒకే పార్టీలో ఉన్న వంశీ, నరసయ్య ప్రస్తుతం ప్రత్యర్థులుగా ఉన్నారు. ఇరుపక్షాలు దాడులకు తెగబడతారన్న ఉద్దేశంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు వంశీ తనపై ప్రత్యర్థులు దాడి చేస్తారన్న భయంతో తన ఏర్పాట్లు తాను చేసుకున్నారు. తనకు రక్షణగా ఉన్న బౌన్సర్లను, అనుచరులను కోర్టు ప్రాంగణంలోకి అనుమతించరని భావించిన వంశీ.. వైసీపీ నాయకులను లాయర్ల అవతారం ఎత్తించి రక్షణగా తెచ్చుకున్నారు. గన్నవరంనియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు నల్ల కోటు, తెల్ల టై ధరించి లాయర్లుగా కోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించారు. వీరిలో రామవరప్పాడు గ్రామ వైసీపీ అధ్యక్షుడు సమ్మెట సాంబయ్య కూడా ఉన్నారు. కేవలం పదో తరగతి చదివిన సాంబయ్య వంశీ కోసం లాయర్‌గా మారిపోయారు. లాయర్ డ్రెస్‌లో ఉన్నాను కదా అని సరదాగాఫొటో తీసుకుని ఫేస్‌బుక్‌లో పోస్టు చేసుకోవడంతో గుట్టు రట్టయింది. ఈ విషయంపై టీడీపీ నేతలు ఆరాతీసి, కోర్టు ప్రాంగణంలో తీసిన ఫొటోలను, వీడియోలను పరిశీలించారు. పలువురు వైసీపీ నాయకులు సాంబయ్య తరహాలోనే నల్లకోట్లతో కనిపించడం గమనార్హం. ఈ వ్యవహారంపై మరింత లోతుగా ఆరా తీసిన టీడీపీ నాయకులకు.. వీరంతా వంశీకి రక్షణ కోసమే లాయర్ల అవతారం ఎత్తారని తెలిసింది. కాగా, వంశీకి సోమవారం పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు కల్పించడం వివాదాస్పదమైంది. వంశీ కాన్వాయ్‌కు ముందు, వెనుక పెట్రోలింగ్ జీపులతో రక్షణ కల్పించడం ఏమిటని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ నిందితుడిగా ఉన్నారని, అలాంటి వ్యక్తికి పోలీసులు భారీ రక్షణ కల్పించడం ఏమిటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



సోమవారం కోర్టు ప్రాంగణంలో లాయరు అవతారంలో రామవరప్పాడుకు చెందిన వైసీపీ నేత సమ్మెట సాంబయ్య

చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం!

- తిరుపతి జిల్లా వైసీపీ కార్యకర్త మృతిపై హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, వడ్డిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బండి చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించి, ఆ నివేదికను తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ఆస్పత్రి వైద్యుల బృందంతో రీపోస్టుమార్టం చేయించాలని, ఆ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయించాలని, మృతుడి భార్య, రక్తసంబంధీకులను మాత్రమే లోనికి అనుమతించాలని ఆ జిల్లా ఎస్పీ, పెళ్లకూరు ఠాణా సీఐలకు సూచించింది. ఈ వ్యవహారంలో ఇతరులు ఎవరూ జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని నిర్దేశించింది. తన భర్త మృతిపట్ల అనుమానాలున్నాయని, రీపోస్టుమార్టం నిర్వహించాలని స్వయంగా మృతుడి భార్య కోరుతున్నందున నివృత్తి చేసేందుకే ఈ ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. విచారణను పది రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ చెంచయ్య భార్య ప్రమీలమ్మ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పోలీసులతరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపించారు.

అటు పోస్టింగ్.. ఇటు పదవీ విరమణ!

- ఈడబ్ల్యూఎస్ స్పెషల్ సీఎస్‌గా ద్వివేదీకి పోస్టింగ్
- నేడు పదవీ విరమణ చేయనున్న గోపాలకృష్ణ ద్వివేది

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ ద్వివేదికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. 1993 బ్యాచ్‌కు చెందిన ఆయన అక్టోబరు 31న పదవీ విరమణ చేయాలి. ఆరోజు దీపావళి సెలవు కావడంతో బుధవారమే పదవీ విరమణ చేయనున్నారు. ఆయన్ను ఆర్థికంగా వెనుబడిన వర్గాల సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన ఐదుగురు ఐఏఎస్‌ల్లో 2009 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం.ప్రశాంతి బుధవారం పదవీ విరమణ చేయనున్నారు.

మంత్రి సత్యకుమార్‌ని కలిసిన కమిషనర్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కొత్త ఆరోగ్య శాఖ కమిషనర్ వాకాటి కరుణ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన ఆమెను ప్రభుత్వం ఆరోగ్య శాఖ కమిషనర్‌గా నియమించింది. సోమవారం ఉదయం ఆమె బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

విమాన టికెట్ ధరలు నియంత్రించాలి: నారాయణ

న్యూఢిల్లీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విమాన టికెట్ ధరలను నియంత్రించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. ప్రయాణ దూరం మారనప్పుడు ధరలెలా పెంచుతారని ప్రశ్నించారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తే.. ప్రైవేట్ విమానయాన సంస్థలు ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచుతున్నాయని విమర్శించారు.

కుటుంబ సమస్యను మాకు రుద్దడమా?: అనగాని

తిరుమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): షర్మిల, జగన్ కుటుంబ సమస్యను మాకు రుద్దడం హాస్యాస్పదమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అబద్ధాలే పునాదిగా వైసీపీ పుట్టిందన్నారు. అబద్ధాలను చెప్పి చెప్పి నిజాలుగా నిరూపించేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

220 కోట్లతో హాస్టల్ భవనాల అభివృద్ధి: మంత్రి స్వామి

కొండపి, అక్టోబరు 29: సంక్షేమ హాస్టల్ భవనాలను రూ.220 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు సాంఘిక సంక్షేమమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లా కొండపిలో రెండు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, పాక్షికంగా నెల్లూరు(జోన్-3) జిల్లాల గురుకులాల సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో మంగళవారం మంత్రి పాల్గొన్నారు.

అమ్మ.. ఆవేదన!

(మొదటి పేజీ తరువాయి)

షర్మిల పేర్కొంటుండగా.. 'ఆ ఆస్తుల్లో నీకు హక్కులేదు. కేవలం ప్రేమాభిమానాలతో కొంత వాటా ఇద్దామనుకున్నా. ఇప్పుడు అది కూడా ఇవ్వను' అని జగన్ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. పైగా.. ఆస్తుల పంపిణీపై గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేసేది లేదంటూ ఏకంగా తల్లీ చెల్లిపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్టీ)లో కేసు కూడా వేశారు. జగన్ లేఖ.. దానికి ప్రతిగా షర్మిల లేఖాస్త్రం.. కేసులతో కుటుంబ వివాదం రచ్చకెక్కింది. ఇదే నేపథ్యంలో మంగళవారం విజయలక్ష్మి ఆవేదన, ఆక్రోశంతో బహిరంగ లేఖ రాశారు. 'ఇదీ నిజం' అంటూ జగన్ వైఖరిని ఎండగట్టారు.

ఆస్తులు పంచలేదు... ఇస్తామన్నదీ ఇవ్వలేదు

'2019 వరకూ కలిసే ఉన్నాం. కుటుంబ ఆస్తుల్లో షర్మిలకూ సమాన వాటా ఉంది' అని విజయలక్ష్మి స్పష్టం చేశారు. షర్మిలను కుటుంబ వ్యాపారాల్లోకి రానివ్వలేదని... అయినప్పటికీ జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడిందని, ఆయన అధికారంలోకి రావడంలో షర్మిల కృషి ఎంతో ఉందన్నారు. అదే సమయంలో... ఆస్తులను పెంచడంలో జగన్ కష్టం ఉందన్నదీ నిజమేనన్నారు. 'అవన్నీ కుటుంబ ఆస్తులు అన్నది నిజం. బాధ్యతగల కుమారుడిగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలన్నది కూడా నిజం" అని తెలిపారు. వైఎస్ జీవించి ఉండగానే షర్మిలకు ఇప్పటికే ఆస్తులు పంచేశారంటూ వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. "పిల్లలు పెరుగుతున్న రోజుల్లో కొన్ని ఆస్తులు షర్మిల పేరిట, కొన్ని జగన్ పేరిట పెట్టారు. అది... ఆస్తుల పంపకం కానేకాదు" అని స్పష్టం చేశారు. ఆ ఆస్తులను పంచుకుందామనుకుంటున్న సమయంలో వైఎస్ దుర్మరణం పాలయ్యారని తెలిపారు. 2019లో సీఎం అయిన రెండు నెలలకు ఆస్తులు పంచేసుకుందామని జగనే ప్రతిపాదించారని చెప్పారు. "విజయవాడలో నా సమక్షంలోనే ఎవరికి ఏ ఆస్తులు అని ఎంవోయూ రాసుకున్నారు. షర్మిలకు హక్కు ఉంది కాబట్టే రూ.200 కోట్లు డివిడెండ్ ఇచ్చాడు. హక్కు ఉంది కాబట్టే అధికారికంగా ఎంవోయూ రాశారు. ఇవేవీ షర్మిలకు జగన్ గిఫ్టుగా ఇస్తున్నవి కావు. బాధ్యతగా ఇవ్వాల్సినవి" అని స్పష్టం చేశారు. కేసులు, ఈడీ కేసులు, జప్తుతో సంబంధం లేని సరస్వతి పవర్ వాటాలు 100 శాతం, ఎంవోయూలో లేని ఎలహంక ప్రాపర్టీ వందశాతం షర్మిలకు ఇస్తానని జగన్ అప్పుడే మాట ఇచ్చి, సంతకం చేశారన్నారు. అవి కూడా ఇప్పటికీ ఇవ్వలేదని ఆక్రోశించారు.

కొలిక్కి వస్తున్న 'సరస్వతి' లెక్కలు

» 2-3 రోజుల్లో మైనింగ్ లీజు భూముల పరిశీలన: తహశీల్దార్

మాచవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థ కొనుగోలు చేసిన భూముల లెక్కలు కొలిక్కి వస్తున్నాయి. ఈ కంపెనీ షేర్లకు సంబంధించి తన తల్లి వైఎస్ విజయలక్ష్మి, చెల్లెలు షర్మిలపై జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అసలీ కంపెనీ భూముల్లో ఏమేం ఉన్నాయో వివరాలు తేల్చాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించడంతో అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించిన సంగతి తెలిసిందే. సర్వే నంబర్ల ఆధారంగా రెవెన్యూ అధికారులు జరిపిన పరిశీలనలో కొన్ని ప్రభుత్వ భూములు, కొన్ని చుక్కల భూములు ఉన్నట్లు తేలింది. మాచవరం తహశీల్దార్ క్షమారాణి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చెన్నాయపాలెం, పిన్నెల్లి, వేమవరం గ్రామాల్లో కొనుగోలు చేసిన భూముల వివరాలను తెలియజేశారు. 'చెన్నాయపాలెంలో 307.05 ఎకరాలు, పిన్నెల్లిలో 80.41 ఎకరాలు, వేమవరంలో 645.29 ఎకరాలు.. మొత్తం 1,032.75 ఎకరాలు కొనుగోలు చేసి ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇందులో చెన్నాయపాలెంలో 307.05 ఎకరాలు, పిన్నెల్లిలో 61.04 ఎకరాలు, వేమవరంలో 588.33 ఎకరాలు.. మొత్తం 956.42 ఎకరాలు పట్టాభూమి. చెన్నాయపాలెంలో కొన్న భూముల్లో చుక్కల భూములు లేవు. పిన్నెల్లిలో మాత్రం 19.37 ఎకరాలు, వేమవరంలో 56.96 ఎకరాలు.. మొత్తం 76.3 ఎకరాల చుక్కల భూములు కొనుగోలు చేశారు' అని చెప్పారు. సరస్వతి సంస్థ మైనింగ్ లీజుకు తీసుకున్న సర్వే నంబర్ల భూములను పరిశీలిస్తున్నామని, వాటిలో ఏయే రకాల భూములు ఎంతెంత ఉన్నాయో 2-3 రోజుల్లో పరిశీలించి తుది నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు.

'భారతి' కొంగు బంగారమే!



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వ్యాపారం చేయడం, పరిశ్రమలు పెట్టి విజయం సాధించడం అంత సులభం కాదు. ఎంతో శ్రమ, ఆర్థికంగా ఒడిదొడుకులు, పన్నులు, అప్పులు.. ఇంత చేసినా పదిశాతం మిగలదు. ఇదంతా సక్రమంగా వ్యాపారాలు చేసేవారికి మాత్రమే వర్తించే సూత్రం! కానీ... అధికారాన్ని, పరుల సొమ్మును 'పెట్టుబడి'గా చేసుకునే జగన్‌కు ఇవి వర్తించవు. భారతి సిమెంట్స్‌లో రూ.45 కోట్ల పెట్టుబడి కాస్తా... మూడు నెలలు తిరగకుండానే రూ.3,053 కోట్లకు చేరిపోయింది. జగన్ దంపతులకు ఏడాదికి రూ.500 కోట్లకు పైగా ఆస్తులు సమకూర్చే బంగారుబాతుగా మారిపోయింది. స్థాపించి ఏడాది కాకుండానే.. పెట్టుబడులు పెడతామంటూ దిగ్గజ ప్రారిశ్రామికవేత్తలు పోటీ పడ్డారు. మూడేళ్ల తిరిగే సరికి ఒక విదేశీ కంపెనీ ఏకంగా మెజారిటీ వాటా 51 శాతం కొనుగోలు చేసింది. ఇలా.. కొద్ది సంవత్సరాల్లోనే వందలకోట్ల వ్యాపారం చేయడం పారిశ్రామిక దిగ్గజ సంస్థల యాజమాన్యాలకు సైతం సాధ్యం కాలేదు. కానీ, జగన్మోహన్‌రెడ్డి ప్రమోటర్‌గా భారతి సిమెంట్స్‌ను స్థాపిస్తానంటూ ప్రకటించడం తోనే, 'అధికారం' అంటే ఏమిటో చూపించారు.

జాక్‌పాట్ డీల్...

వైఎస్ ముఖ్యమంత్రిగా ఉండగా, 2006లో రఘురాం సిమెంట్స్ కాస్త భారతి సిమెంట్స్‌గా రూపాంతరం చెందింది. ఆ వెంటనే దిగ్గజ సంస్థలన్నీ భారీగా పెట్టుబడులు పెట్టాయి. సిమెంట్ పరిశ్రమలో తమకంటూ ప్రత్యేకత కలిగిన ప్రఖ్యాత కంపెనీలు ఇండియా సిమెంట్స్, దాల్మియా వంటి కంపెనీలు భారతి సిమెంట్స్ షేర్లను కొనుగోలు చేశాయి. 2010లో విదేశీ కంపెనీ వికాట్...భారతి సిమెంట్స్‌లో మెజారిటీ షేర్లు 51 శాతం మేర 415 కోట్లు చెల్లించి కొనేసింది. ఈ మేరకు ఒప్పందం ఫ్రాన్స్‌లో జరిగింది. ఈ లావాదేవీకి సంబంధించి 2010-11 ఆర్థిక సంవత్సరానికిగాను జగన్మోహనరెడ్డి రూ.64కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు. ఈ ఒప్పందం జరిగే నాటికి అంటే 2010లో 25 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి, మరో ఏడాదినాటికి ఇంకో 25 లక్షల టన్నుల సామర్థ్యానికి పెంచుతామని వికాట్ ప్రకటించింది. ఇలా 50 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన భారతి సిమెంట్స్ మొత్తం విలువను రూ.4,600 కోట్లుగా నిర్ధారించారు. అప్పట్లోనే వికాట్ కైవసం చేసుకున్న 51 శాతం వాటాకు మార్కెట్ విలువ రూ.2,346 కోట్లు ఉంది. అమ్మిన వాటా మొత్తం జగన్‌కు చెందినవేనని ఇప్పుడు చెబుతున్నారు. అతితక్కువ పెట్టుబడితో భారతి సిమెంట్స్‌ను ప్రమోట్ చేసిన జగన్‌కు ఈ డీల్ జాక్‌పాట్ లాంటిదని మార్కెట్ వర్గాలు అప్పట్లోనే వెల్లడించాయి. భారతిలో 82 శాతం వాటా కోసం జగన్ గ్రూప్ నికరంగా పెట్టిన పెట్టుబడి మొత్తం రూ.45 కోట్లు. ఈ వాటా విలువ ఇప్పుడు రూ.3700 కోట్లు.. 51 శాతం వాటా కోసం ఆయన ఇన్వెస్ట్ చేసిన మొత్తం సుమారు 28 కోట్ల రూపాయలు అవుతుందని అనుకున్నా .. ఇప్పుడు లభించిన రూ.2,300 కోట్లు (మార్కెట్ విలువ) అంటే అనేక రెట్లు ఎక్కువని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో అధికార పలుకుబడిని ఉపయోగించి భారతి సిమెంట్స్‌కు భారీ ఎత్తున ఈక్విటీని , రుణాలను జగన్మోహనరెడ్డి సమీకరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. భారతి సిమెంట్స్ ఈక్విటీ షేర్లు ఐదున్నర కోట్లున్నాయి. పది రూపాయల ముఖవిలువకే నాలుగున్నర కోట్ల భారతి సిమెంట్ వాటాలను జగన్, ఆయన కంపెనీలు తీసుకున్నాయి. మిగతా షేర్లను దాల్మియా సిమెంట్, ఇండియా సిమెంట్స్ వంటి సంస్థలు, మ్యాట్రిక్స్ ప్రసాద్ వంటి వ్యాపార ప్రముఖులు ఒక్కో షేరుకు 94-175 రూపాయల రేటుతో కొనుగోలు చేయడం గమనార్హం. దాల్మియా సిమెంట్స్ మాత్రం తర్వాత రెండు లక్షల షేర్లను రూ.1,440 రేటుతో కొనుగోలు చేసింది

> రూ.45 కోట్ల పెట్టుబడి ఒక్క ఏడాదిలో రూ.3053 కోట్లకు చేరడం సాధ్యమా? కంపెనీ ఏర్పాటు కాకముందే... 'మేం పెట్టుబడులు పెడతాం' అంటూ పారిశ్రామికవేత్తలు పోటీపడటం చిత్రం కాదా? నానా అగచాట్లు పడితేగానీ దక్కని అనుమతులు, గనులు ఇలా చిటికెల మీద వచ్చి పడిపోవడం అసాధారణ పరిణామం కదా? ఇవన్నీ... భారతి సిమెంట్స్ విషయంలో జరిగాయి! తరతరాలుగా పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు సాధించని విజయాలు భారతి సిమెంట్స్ రోజులూ, నెలల్లోనే సాధించింది! దీనికి కారణం ఏమిటి? జగన్ శ్రమ, మేధస్సే కారణమా? అని ప్రశ్నిస్తే కానే కాదని సీబీఐ, ఈడీ వంటి సంస్థలు ఎప్పుడో తేల్చాయి.

ఉత్పత్తి ప్రారంభించకుండానే.. ప్రతిఫలం

2007లో భారతీ సిమెంట్ పెట్టిన జగన్ 2009 ఆగస్టు 27న తన వాటా నుంచి 2,27,584 షేర్లను ఒక్కొక్కటీ రూ.1,450 ధరకు మ్యాట్రిక్స్ ప్రసాద్‌కు చెందిన అల్ఫావిల్లాస్ ప్రైవేటు లిమిటెడ్, అల్ఫా ఎవెన్యూస్ ప్రై.లిమిటెడ్ సంస్థలకు విక్రయించారు. జగన్‌కు రూ.33 కోట్లు దక్కాయి. భారతీ సిమెంట్స్ ఉత్పత్తిని ప్రారంభించక ముందే జగన్‌కు దక్కిన ప్రతిఫలం అది. ఈ మొత్తంతో జగన్ పెట్టిన పెట్టుబడి మొత్తం వెనక్కి వచ్చేసింది. విక్రయించిన ఈ షేర్లు జగన్ వాటాలో ఒక శాతం కంటే తక్కువే.

అంత విలువ ఎలా?

భారతి సిమెంట్స్ కోసం లక్ష రూపాయలకు ఒక ఎకరా చొప్పున 487 ఎకరాలను రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కేటాయించింది. 1400 ఎకరాల్లో విస్తరించి ఉన్న సున్నపురాయి గనుల లీజులను భారతి సిమెంట్స్ పొందింది. ఉత్పత్తి ప్రారంభించి ఏడాది తిరక్కముందే భారతి సిమెంట్స్ వాల్యూయేషన్‌ను పొందగలిగింది. గతంలో రాష్ట్రానికి చెందిన 'మైహోం సిమెంట్స్'లో ఐర్లాండ్ కంపెనీ సీఆర్‌హెచ్ 50 శాతం వాటా తీసుకున్నప్పుడు కూడా టన్ను 213 డాలర్ల రేటుతో మదింపు చేశారు. మైహోమ్ సిమెంట్స్ వాటాల విక్రయ సమయంలో సిమెంట్ రంగం అసాధారణ బూమ్‌లోఉంది. భారతి సిమెంట్స్ రంగంపైకి వచ్చేనాటికి డజన్లకొద్దీ కంపెనీలు విస్తరించి.. వాల్యూయేషన్ విలువ బాగా తగ్గిందని నిపుణులు వెల్లడించారు. కొత్త ప్రాజెక్టులు, పాత సంస్థలు చేపట్టిన విస్తరణ వల్ల రాష్ట్రంలో సిమెంట్‌కు భారీ మిగులు ఏర్పడిన పరిస్థితుల్లోనూ భారతి సిమెంట్స్ విషయంలో.. అధిక ధరలకు వాల్యూయేషన్ కట్టడంపై నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

గనులన్నీ 'భారతి'కే..

ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి బాధ్యతలు చేపట్టాక ఆయన కుమారుడు జగన్‌కు చెందిన భారతి సిమెంట్స్‌లోకి అక్రమ పెట్టుబడులు రప్పించేందుకు దందాసాగింది. నాటి గనుల శాఖ డైరెక్టర్ వి.రాజగోపాల్ పక్కా స్కెచ్‌తో సాగిన అడ్డగోలు దోపిడీ బాగోతం అప్పట్లో విమర్శలకు కేంద్ర బిందువైంది. వైఎస్ కుటుంబం తమకు సన్నిహితంగా ఉండే సజ్జల కుటుంబాన్ని వినియోగించుకుని సాగించిన అక్రమాలు బయటకు వచ్చాయి. నాటి గనుల శాఖ సంయుక్త కార్యదర్శి ఎ.దయాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కె.వెంకట్రావు సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాలతో.. ఆనాడు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లుగా తేలింది. జయా సిమెంట్స్ (భరత్ లిమిటెడ్) చేతికి అడ్డగోలుగా లీజును మార్చేశారు. కడప జిల్లా నవాబుపేట తాలమంచిపట్నంలో 1,017 ఎకరాల సున్నపురాయి నిక్షేపాల ప్రాస్పెక్టింగ్ లీజుకోసం 1997లో జయా మినరల్స్ దరఖాస్తు చేసుకుంది. నాటి గనుల శాఖ జేడీ మేనకేతన్‌రెడ్డి ఈ సంస్థకు సిమెంట్ ప్లాంటు ఏర్పాటు చేసే యోగ్యత లేదని స్పష్టంచేశారు. దరఖాస్తుదారుడి వివరణ కోరారు. కానీ స్పందన లేదు. 2004లో ఈ ఫైలు ఒక్కసారిగా కదిలింది. ఇదే సంస్థ నుంచి మరో దరఖాస్తును స్వీకరించారు. ఎన్నో ఏళ్లుగా స్పందించని కంపెనీకి ప్రాస్పెక్టింగ్ లైసెన్సు మంజూరు చేసేలా రాజగోపాల్ ప్రతిపాదనలు పంపారు. దరఖాస్తు చేసిన జయా మినరల్స్‌కు కాకుండా.. ఈశ్వర్ సిమెంట్స్‌కు బదిలీ చేయాలని విచిత్ర షరతు విధించడం గమనార్హం. తర్వాత ఈ గనులు ఈశ్వర్ నుంచి రఘురామ్‌కు, దాని పేరు మారాక భారతి సిమెంట్స్‌కు బదిలీ అయ్యాయి.

2024 ఎన్నికల్లో జగన్ ప్రకటించిన ఆస్తులు

పన్ను చెల్లించదగ్గ ఆదాయం	రూ.2,62,93,030
పన్ను మినహాయింపు ఆదాయం	రూ.11,29,10,245
భారతిరెడ్డి పన్ను చెల్లించే ఆదాయం	రూ.4,21,26,964
భారతిరెడ్డి పన్ను మినహాయింపు ఆదాయం	రూ.14,264

కుమార్తెలు హర్షిణిరెడ్డి, వర్షారెడ్డి ఆదాయపు పన్ను పరిధిలో లేరు

సంస్థ	పెట్టుబడి (రూపాయల్లో)
సండూర్ పవర్ అండ్ ఇండస్ట్రీస్	143,20,59,386
సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్	29,68,92,250
కార్మెల్ ఆసియా హోల్డింగ్స్ ప్రై.లిమిటెడ్	8,00,000
భారతి సిమెంట్స్ కార్పొరేషన్	36,06,96,850
కీలెన్ టెక్నాలజీ	14,42,42,909
మార్వెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	3,05,000
క్లాసిక్ రియాలిటీ	65,16,25,000
సిలికాన్ బిల్డర్స్ ప్రై.లిమిటెడ్	2,86,71,500
హరీశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	6,00,000
షేర్ అప్లికేషన్స్	
క్లాసిక్ రియాలిటీ ప్రై.లిమిటెడ్	9,07,50,000
సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్	4,15,00,00
సిలికాన్ బిల్డర్స్ ప్రై.లిమిటెడ్	5,00,000
హరీశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	1,00,000
కేప్‌స్టోన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై. లిమిటెడ్	24,00,00,000
మొత్తం	307,27,42,795

వైఎస్ భారతి ఆస్తులు

షేర్లు తీసుకున్న సంస్థ	రూ.లలో
సండూర్ పవర్	1000
సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రై.లిమిటెడ్	13,80,00,000
కిలాన్ టెక్నాలజీస్ ప్రై.లిమిటెడ్	2,15,19,993
సిలికాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	2,99,900
సిలికాన్ బిల్డర్స్ ప్రై.లిమిటెడ్	3,49,900
భగవత్‌సన్నిధి ఎస్టేట్స్ ప్రై.లిమిటెడ్	91,28,000
షలూమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	4,50,98,000
ఇన్‌స్పైర్ హోటల్స్ ప్రై.లిమిటెట్ వివిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై. లిమిటెడ్	2,13,000
హరీశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	98000
హిమజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	4,00,00,000
ఆకాశ్ ఎస్టేట్స్ ప్రై.లిమిటెడ్	10,24,00,001
షేర్ దరఖాస్తులు	
ఉటోపియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లిమిటెడ్	10,10,00,000
కార్మెల్ హెల్త్‌కేర్ ప్రై.లిమిటెడ్	73,00,000
మొత్తం	46,56,15,794

జరగకూడనివన్నీ నా కళ్లముందే జరుగుతున్నాయ్



(మొదటి పేజీ తరువాయి)

అనేవారు. రాజశేఖర్‌రెడ్డి గారు, నేను, నా పిల్లలు చాలా సంతోషంగా ఉండేవాళ్లం. నా కుటుంబానికి ఏ దిష్టి తగిలిందో నాకు అర్థం కావడం లేదు. నేను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా.. జరగకూడనివన్నీ నా కళ్లముందే జరిగిపోతున్నాయి. ఈ కుటుంబం గురించి ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు. అబద్ధాల పరంపర కొనసాగుతోంది. తెలిసి కొంత.. తెలియకుండా కొంత మాట్లాడుతున్నారు. అవి దావానలంగా ఎక్కడెక్కడికో పోతున్నాయి. ఇవి కంటిన్యూ కాకూడదు. నా పిల్లలిద్దరికే కాదు.. చెప్పాలంటే ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదు. నేను మీ ముందుకు ఈ విషయంగా రాకూడదని అనుకున్నాను. అయినా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కుటుంబం గురించి తప్పుగా మాట్లాడే వారందరినీ ఒకటి అడుగుతున్నా.. ఈ కుటుంబాన్ని ప్రేమించినవారు మీరు. మా జీవితంలో మీరందరూ భాగమే అనుకుంటున్నాను. రాజశేఖర్‌రెడ్డి గారికి మేమెంతో.. మీరు కూడా అంతే. ఆయన మమ్మల్ని ఎలా ప్రేమించారో.. మిమ్మల్నీ అంతగానే ప్రేమించారు. మీరు కూడా అంతకంటే ఎక్కువగా మా కుటుంబాన్ని ప్రేమించారు. అంతెందుకు.. రాజశేఖర్‌రెడ్డి గారు మన మధ్య నుంచి వెళ్లిపోయాక నా పిల్లలను.. ఆయన ఉన్నప్పటి కంటే ఎక్కువగా ప్రేమించి, ఆదరించి అక్కున చేర్చుకున్నారు. అది ఎన్నటికీ మరిచిపోలేను. నా జన్మంతా రుణపడి ఉంటూ.. హృదయపూర్వకంగా నా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

> మీ అందరికీ మీ ఆడబిడ్డగా రెండు చేతులూ ఎత్తి మనవి చేసుకుంటున్నాను. దయచేసి ఈ కుటుంబం గురించి, నా పిల్లల గురించి తక్కువ చేసి మాట్లాడవద్దని కోరుతున్నా. సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయవద్దు. దూషణలు చేయవద్దు. ఈ కుటుంబం మీద నిజమైన ప్రేమ ఉంటే.. ఇంతకంటే ఎక్కువ మాట్లాడవద్దు. Blood is thicker than water. వాళ్లిద్దరూ సమాధానపడతారు. మీరెవరూ రెచ్చగొట్టవద్దని నా మనవి. నేను నమ్మిన దేవుడు యేసయ్య.. సమాధానకర్త. నా బిడ్డల సమస్యలకు పరిష్కారం ఇస్తాడని నా నమ్మకం.

ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, ఇతరులు అందరూ.. వాళ్లు మాట్లాడుతున్నది.. వాళ్లు ప్రేమించే వైఎస్ఆర్ గారి గురించి అని మరచి.. తీస్తున్నది ఆయన కుటుంబ పరువు అనే స్పృహ లేకుండా.. ఎన్నో అసత్యాలు చెప్పారు. వైఎస్ఆర్ గారు బ్రతికి ఉండగానే ఆస్తులు పంచేశారని అన్నారు. ఇది అవాస్తవం. వైఎస్ఆర్ గారు కొన్ని ఆస్తులు పాప పేరు మీద.. కొన్ని ఆస్తులు జగన్ పేరు మీద పెట్టారు. అది ఆస్తులు పంచడం ముమ్మాటికీ కాదు. వైఎస్ఆర్ గారు బ్రతికి ఉండగానే షర్మిలకు ఆస్తులు ఇచ్చేశారని లిస్ట్ చదివారు. జగన్ పేరు మీద పెట్టిన ఆస్తుల లిస్ట్ కూడా చదివి ఉండాల్సింది. వైఎస్ఆర్ గారు చేసింది పంపకం కాదు. కొన్ని ఆస్తులు ఇద్దరి పేరు మీద పెట్టారు.. అంతే.

> విజయసాయిరెడ్డి గారు ఆడిటర్‌గా ఉన్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. వైవీ సుబ్బారెడ్డి గారు ఈ ఇంటి బంధువుగా ఎంవోయూపై సాక్షి సంతకం చేశారు. అయినా.. మీడియాలో అవాస్తవాలు మాట్లాడడం నాకు చాలా బాధ కలిగించింది. అబద్ధాల పరంపర కొనసాగకుండా ఉండడానికి సూటిగా నిజం చెబుతున్నాను. వీరిద్దరూ నా పిల్లలు. వీరిని నేను, వైఎస్ఆర్ గారు ఎంతో అపురూపంగా, ప్రేమగా పెంచుకున్నాం. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే రాజశేఖర్‌రెడ్డి గారి మాటా సమానమే. ఆస్తులు కూడా ఇద్దరికీ సమానం అనేది నిజం. నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్న వైఎస్ఆర్ గారి ఆజ్ఞ నిజం. ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం. కానీ అన్ని ఆస్తులూ కుటుంబ ఆస్తులే అన్నది కూడా నిజం. జగన్ బాధ్యత గల కొడుకుగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలన్నది కూడా నిజం. వైఎస్ఆర్ గారి చివరి రోజుల్లో జగన్ ఆయనకు.. 'నాన్నా.. నీ తర్వాత ఈ లోకంలో పాప మేలు కోరే వారిలో నేను మొదటివాడిని' అని మాట ఇచ్చింది కూడా నిజం. ఇది 'నాలో నాతో వైఎస్ఆర్' అనే పుస్తకంలో ఎప్పుడో రాశా. రాజశేఖర్‌రెడ్డి గారు బ్రతికి ఉండగా ఆస్తులు పంచలేదు. ఇక పంచుదాం అనుకునే సరికి ఆయన ప్రమాదంలో వెళ్లిపోయారు. ఈ విషయం సాయిరెడ్డికి తెలిసి కూడా అవాస్తవాలు మాట్లాడారు.

రాజశేఖర్‌రెడ్డి గారు మన మధ్య నుంచి వెళ్లిపోయాక.. 2009 నుంచి 19 వరకు 10 ఏళ్లు కలిసి ఉన్నారు. డివిడెండ్ రూపంలో జగన్ వాటా తీసుకుని, రూ.200 కోట్లు పాప భాగానికి ఇచ్చారు. ఎంవోయూ ప్రకారం జగన్‌కు 60 శాతం.. పాపకు 40 శాతం అయితే.. ఎంవోయూకు ముందు.. సగం సగం డివిడెండ్ తీసుకునేవారు.. ఎందుకంటే పాపకు సమాన వాటా ఉంది కాబట్టి. వీటన్నింటికీ అప్పుడు, ఇప్పుడు నేనే సాక్షిని.

2019లో సీఎం అయిన రెండు నెలలకు.. డివైడ్ అవ్వాలని ఇజ్రాయిల్‌లో జగన్ ప్రపోజల్. 'పిల్లలు పెద్ద వాళ్లయ్యారు.. నాకు అల్లుళ్లు వస్తారు.. నీకు అల్లుడు, కోడలు వస్తారు.. మనం కలిసి ఉన్నట్లు వాళ్లు కలిసి ఉండకపోవచ్చు.. కాబట్టి విడిపోదాం' అన్నాడు. అలా 2019 వరకు కలిసి ఉన్న కుటుంబం.. ఆస్తులపరంగా విడిపోవాలని నిర్ణయం జరిగింది. తర్వాత విజయవాడలో నా సమక్షంలో.. ఆస్తుల్లో ఇవి జగన్‌కు, ఇవి పాపకు అని అనుకున్నారు. జగన్ నోటితో చెప్పి.. ఆయన చేతితో రాసిన ఎంవోయూనే ఇది. హక్కు ఉంది కాబట్టే పాపకు 200 కోట్లు డివిడెండ్ ఇచ్చారు. ఎంవోయూ రాసుకున్నారు. పాపకు ఇవ్వాల్సిన ఆస్తులు జగన్ గిఫ్ట్‌గా ఇస్తున్నవి కాదు. జగన్ బాధ్యతగా ఇస్తున్నవి. అటాచ్‌మెంట్‌లో లేవు కాబట్టి ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ 100 శాతం, ఎంవోయూలో లేని ఎలహంక ప్రాపర్టీ 100 శాతం పాపకు వెంటనే ఇస్తానని జగన్ మాట ఇచ్చి సంతకం పెట్టాడు. ఇవీ ఇవ్వకుండా అటాచ్‌మెంట్లో లేని ఆస్తుల విషయంలోనూ అన్యాయం జరిగింది. పాప భాగానికి వచ్చిన భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, వైఎస్ఆర్ గారి ఇల్లు.. ఇలాంటివి కేసుల తర్వాత ఇవ్వాల్సి ఉంది. 2019 వరకు కలిసి ఉన్నాం. షర్మిలను బిజినెస్‌లో ఇన్వాల్వ్ చేయలేదు. అయినా పాలిటిక్స్‌లో జగన్ చెప్పినట్లు చేసింది. జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడింది. అధికారంలో రావడానికి పాప కృషి ఎంతో ఉంది.

జన్మనిచ్చిన ప్రతి తల్లిదండ్రులకు బిడ్డలందరూ సమానమే. ఒక బిడ్డ ఇంకో బిడ్డకు అన్యాయం చేస్తుంటే.. చూసి తట్టుకోవడం చాలా కష్టం. తల్లిగా అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడడం నా విధి, నా ధర్మం. ఇంత మంది పెద్ద మనుషులు చెబుతున్న అబద్ధాల మధ్య నిజం తెలియాలనే ఇన్ని చెప్పాల్సి వచ్చింది. అయినా వాళ్లిద్దరూ అన్నాచెల్లెళ్లు. ఇది వారి సమస్య. వారే పరిష్కరించుకుంటారు.

> రాజశేఖర్‌రెడ్డి గారు ఉండి ఉంటే ఈ ఆస్తుల సమస్య ఉండేది కాదు. ఇంతటి వివాదం జరిగేది కాదు. నేనూ ఇలా రావాల్సిన అవసరం పడేది కాదు. అయినా దీని విషయంగా జరుగుతున్న రచ్చను చూసి.. నా మాటలు మాత్రమే ఆపుతాయని విశ్వసిస్తూ.. నేను రాకపోతే ఇలానే కొనసాగుతుందని.. మీ ముందుకు రావాల్సి వచ్చింది.
>
> మరొక్కసారి మీ ఆడబిడ్డగా.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడవద్దని ప్రతి ఒక్కరినీ కోరుకుంటూ..
>
> \- ఇట్లు ప్రేమతో
> వైఎస్ విజయ రాజశేఖర్‌రెడ్డి.

వివేకా హత్య కేసును.. నీరుగార్చే కుట్ర!

పలుకుబడి కలిగిన వ్యక్తులు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు

» అజేయ కల్లం అలా ప్రభావితమయ్యే.. తన స్టేట్‌మెంట్ తొలగించాలన్నారు

» ఉమాశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌లో సునీతారెడ్డి, సీబీఐ వాదనలు

» సమీప భవిష్యత్‌లో ట్రయల్ మొదలయ్యే సూచనలు కనిపించడం లేదు: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును నీరుగార్చేలా అనేక కుట్రలు జరుగుతున్నాయని ఆయన కుమార్తె సునీతారెడ్డి తెలిపారు. పలుకుబడి కలిగిన పెద్ద వ్యక్తులు కేసును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారని అన్నారు. నిందితులను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. వివేకా హత్య కేసులో ఏ-3గా ఉన్న గజ్జల ఉమాశంకర్‌రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. సునీతారెడ్డి తరఫున న్యాయవాది ఎస్. గౌతమ్, సీబీఐ తరఫున అనిల్ తన్వర్ వాదనలు వినిపించారు. 'పలుకుబడి కలిగిన వ్యక్తుల ప్రభావానికి గురయ్యే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం.. తాను సీబీఐకి ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను తొలగించాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై సీబీఐ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసిన తర్వాత.. ఆయన ఆ పిటిషన్‌లో వాదనలు వినాలని పట్టుబట్టడం లేదు. ఈ కేసును మొదట విచారించిన సీఐ శంకరయ్య.. సీఆర్‌పీసీ 161 స్టేట్‌మెంట్ ఇచ్చి.. మేజిస్ట్రేట్ వద్ద మాత్రం సీఆర్‌పీసీ 164 స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. అలా ఇవ్వకుండా ఉన్నందుకు ఆయనపై సస్పెన్షన్ ఎత్తేయడంతోపాటు ప్రమోషన్ ఇచ్చారు. గంగాధర్‌రెడ్డి అనే సాక్షి మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇవ్వకముందే అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. కేసులో ఏ-6గా ఉన్న ఉదయ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు అధికారి రాంసింగ్‌ను భయపెట్టే ఉద్దేశంతో కేసు నమోదు చేశారు. వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి ఏకంగా సునీతారెడ్డి, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్ పైనే కేసు పెట్టాడు. ఈ పరిణామాలన్నిటినీ పరిశీలిస్తే ఈ కేసును నీరుగార్చడానికి ఏ స్థాయిలో ప్రభావితం చేస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోంది. కీలక సాక్షి రంగన్న నిందితుడు ఉమాశంకర్‌రెడ్డిని గుర్తుపట్టాడు. ఘటనాస్థలం వద్ద ఉన్నది అతడేనని చెప్పేలా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) రిపోర్ట్ సహా ఇతర సాంకేతిక సాక్ష్యాలు ఉన్నాయి. కుట్ర, హత్యకు సంబంధించిన సన్నద్ధత, హత్య చేయడం, ఆధారాల్లేకుండా చేయడం.. ఇలా అన్ని దశల్లో ఉమాశంకర్‌రెడ్డి పాత్ర ఉంది. వివేకా నుదుటిమీద ఏడుసార్లు గొడ్డలితో నరికాడు. నుదుటిపై తీవ్ర గాయం వల్లే చనిపోయినట్లు వైద్యుల నివేదికలో తేలింది. ఈ ఏడాది ఆగస్టులోనే ఆయన బెయిల్ పిటిషన్‌ను సీబీఐ కోర్టు తిరస్కరించింది. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. నిందితులు దురుద్దేశంతో ట్రయల్ ఆలస్యమయ్యేలా చేస్తూ అదే కారణంతో బెయిల్ అడుగుతున్నారు. మూడేళ్లు జైల్లో ఉన్నాను కాబట్టి బెయిల్ ఇవ్వాలనడం సబబు కాదు' పేర్కొన్నారు. పిటిషనర్ మూడేళ్లకుపైగా జైలు జీవితం గడుపుతున్నారని.. సీబీఐ కోర్టులో సమీప భవిష్యత్‌లో ట్రయల్ ప్రారంభయ్యే పరిస్థితి లేదని ఉమాశంకర్‌రెడ్డి తరఫు న్యాయవాది పేర్కొన్నారు. సాక్షి రంగన్న.. బక్కగా, పొడుగ్గా ఉన్నాడని చెప్పాడే తప్ప పిటిషనర్‌ను గుర్తించలేదన్నారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్.. ట్రయల్ త్వరలో ప్రారంభమయ్యే పరిస్థితులు అస్సలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

గనుల అక్రమాలపై విచారణ

» 4 ప్రత్యేక బృందాలు రంగంలోకి.. సిలికా, క్వార్ట్జ్ తవ్వకాల పరిశీలన

నెల్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో క్వార్ట్జ్, సిలికా తవ్వకాల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో విస్తారంగా ఉన్న సిలికా, క్వార్ట్జ్ గనుల తవ్వకాల్లో 2019-24 మధ్యకాలంలో జరిగిన అక్రమాలపై విచారణకు నెల్లూరు, కడప, ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు చెందిన మైనింగ్ శాఖ అధికారుల బృందం రంగంలోకి దిగింది. మైన్స్ అండ్ మినరల్ శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు నెల్లూరు, ప్రస్తుతం తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరుల్లోని గనుల్లో విచారణ ప్రారంభించారు. సోమ, మంగళవారాల్లో ప్రత్యేక అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో క్వారీల్లో తవ్వకాలను పరిశీలించి, నివేదిక తయారు చేస్తున్నారు. 1, 2 బృందాలకు నెల్లూరు డీజీఎం ఎస్.చంద్రశేఖర్ పర్యవేక్షణాధికారిగా, ఒంగోలులోని పలు శాఖలకు చెందిన అధికారులు సి. సురేష్ కుమార్‌రెడ్డి, పి. తిరుపతిరావు, వెంకటశివప్ప, డి.హరిబాబు సభ్యులుగా ఉన్నారు. 3, 4 బృందాలకు గూడూరు డివిజనల్ ఎంజీఓ ఏ. శ్రీనివాసరావు పర్యవేక్షణాధికారిగా, ఒంగోలుకు చెందిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బి. శంకరయ్య, టెక్నికల్ అసిస్టెంట్ కేఆర్ వరప్రసాద్, కడప జిల్లాకు చెందిన రాయల్టీ ఇనెస్పెక్టర్ రామసుబ్రహ్మణ్యం, కె.భాస్కర్‌రెడ్డి సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

గనులను గుల్ల చేసిన వైసీపీ నేతలు

గూడూరు డివిజన్‌లో సిలికా, నెల్లూరు జిల్లా సైదాపురం, పొదలకూరు మండలాల్లో క్వార్ట్జ్ గనులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 86 మంది సిలికా లీజుదారులు ఉన్నారు. 2019కి పూర్వం వరకు లీజుదారులే తవ్వకాలు జరిపేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక సిలికా గనులను పూర్తిగా ఆ పార్టీ అగ్రనేతలు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో మైన్స్ అండ్ మినరల్స్ శాఖలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి లీజుదారులను బెదిరించి సిలికా గనులను పూర్తిగా వైసీపీ అగ్రనేతలకు కట్టబెట్టారు. దీంతో విచ్చలవిడిగా తవ్వకాలు జరిగాయి. గత ప్రభుత్వం చివరి రెండేళ్లు జిల్లా పరిధిలోని క్వార్ట్జ్ గనులపై పడింది. లీజుదారులను బెదిరించి గనులను కైవసం చేసుకున్నారు. వాటిని నెల్లూరు జిల్లాకు చెందిన ఒక మాజీ మంత్రికి అనధికారికంగా అప్పగించారు. దీనికి ప్రతిఫలంగా నెలకు రూ.60కోట్ల నజరానా తాడేపల్లి ప్యాలెస్‌కు అందేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల ఏసీబీ సిలికా, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపింది. తాజాగా మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అక్రమాలను గుర్తించడంతో పాటు లీజు లైసెన్సుల రెన్యూవల్‌కు అర్హులను గుర్తించే బాధ్యతలను అప్పగిస్తూ నాలుగు జిల్లాల మైనింగ్ శాఖ అధికారులతో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది.

త్వరలో కొత్త గనుల విధానం

» భమిడికలొద్దిలో లేటరైట్ తవ్వకాలపై సీఐడీ విచారణ: కొల్లు రవీంద్ర

విశాఖపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా, ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా త్వరలో కొత్త గనుల విధానం తీసుకురానున్నట్లు గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాల స్టోన్ క్రషర్లు, క్వారీలు, గ్రానైట్ క్వారీల యజమానులతో సమావేశమైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం భమిడికలొద్ది లేటరైట్ క్వారీలో భారీ అక్రమాలు జరిగాయని పేర్కొంటూ దీనిపై విచారణ చేపట్టే బాధ్యతను సీఐడీకి అప్పగించామన్నారు. ఉచితం పేరిట ఇసుకను దుర్వినియోగం చేస్తే పీడీ యాక్టు పెడతామని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం పలు నదుల్లో ఇసుక తవ్వకాలకు రీచ్‌లు ప్రారంభించామన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.

బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. బెల్ట్‌షాప్‌ను గుర్తిస్తే వారికి మద్యం సరఫరా చేసిన దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉత్తరాంధ్రలోని ఎక్సైజ్ శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీకే విక్రయాలు జరగాలని స్పష్టం చేశారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం టెండర్ కమిటీ వేసిందని, ఆ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత మద్యం బ్రాండ్‌లు, ధరలు తగ్గింపు అమల్లోకి వస్తుందన్నారు. ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషిచేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


HAPPY Diwali
Vijaydigital
The Electronics Super Store Since 1982
Festival Sales
UPTO 60% OFF
మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు
FOLLOW US ON Instagram
BAJAJ FINSERV
TVS CREDIT
IDFC FIRST Bank
HDB FINANCIAL SERVICES
HDFC BANK
benow it's easy
onsitego
₹1* డౌన్ పేమెంట్‌తో 24 నెలలు* వడ్డీ లేకుండా సులభ వాయిదాలతో*
Cash Backs, No Cost EMI* BAJAJ FINSERV Anywhere EMI* Follow us on
Upto 50% Off
OLED
55 (139 cm)
MRP ₹ 1,59,990/-
Offer Price ₹ 74,990/-*
T & C Apply*
LED TV
55 UHD (139 cm) Offer Price ₹ 36,990/-*
43 UHD (108 cm) Offer Price ₹ 26,990/-*
32 HD (80 cm) Offer Price ₹ 11,990/-*
Combo
Special Offers on Sound Bars*
Air Conditioners
1.5 Ton 3 Star AC Range Starts from
₹ 29,990/-*
Cash Back ₹10,000/-*
LG SAMSUNG BLUE STAR HITACHI
LLOYD GENERAL IFB Carrier
Panasonic DAIKIN Godrej Whirlpool
Haier MITSUBISHI VOLTAS
190 Ltr Single Door Fridge
Offer Price
₹11,990/-*
240 Ltr Double Door Fridge
Offer Price
₹20,990/-*
Cash Back ₹1,000/-*
IFB
6 Kg. Front Load
Offer Price
₹22,990/-*
Cash Back ₹1,500/-*
LG
8 Kg. Front Load
Offer Price
₹33,990/-*
Cash Back ₹5,000/-*
570 Ltr Side by Side Fridge
Offer Price
₹44,990/-*
Cash Back ₹6,000/-*
SAMSUNG
653 Ltr Side by Side Fridge
Offer Price
₹68,990/-*
Cash Back ₹2,500/-*
Whirlpool
6.5 Kg. Fully Automatic
Offer Price
₹12,990/-*
7.5 Kg. Fully Automatic
Offer Price
₹14,490/-*
Galaxy A35 5G
Samsung S24 Ultra
Upto ₹12,000* Cash Back
EMI ₹5,000/-*
Samsung A35
Upto ₹5,000* Cash Back
EMI ₹3,444/-*
Vivo V40E
Upto 10%* Cash Back
EMI ₹3,625/-*
Vivo V40E
Upto 10%* Cash Back
EMI ₹4,375/-*
Oppo F27 Pro plus
Upto 10%* Cash Back
EMI ₹3,500/-*
Reno 12 Pro
Upto 10%* Cash Back
EMI ₹4,625/-*
Premium Kitchen Appliances
(₹20,000/- and above Cash Back)
Chimney Range Starts from
₹9,990/-*
(₹20,000/- and above Cash Back)
DELL lenovo hp
Range Starts from
₹24,990/-*
Upto ₹10,000* Cash Back + Extended Warranty Offers available*
FREE BAG + KEY BOARD MOUSE*
CASH BACK
KALYANI ADS
OUR STORES
Our Customer Care 0863-2268838
GUNTUR : Opp. Incometax Office, Lakshmipuram 0863-2226463, Mahatma Gandhi Inner Ring Road, 9246655559, Chandana Brothers Complex, Jinna Tower, 0863-2226464, Haier Exclusive Showroom, Revenue Complex 0863-2345559, L.G. Best Shopee, 0863-2336464, Arundelpet, Main Road 0863-2217717, 27 VIJAYAWADA : Main Road, Poranki 0866-2499008, 2499009, Bhavanipuram, Swathi Theatre, Road, Sivalayam Center, 0866-2414193, 2414194, Eluru Road, Gunadala, VIJAYAWADA, 0866-2999922
MACHILIPATNAM : Opp. Raithu Bazar 9182053171, TIRUVURU : Ganesh Bomma Centre 8121437111, NUZIVIDU : Main Road, Near Municipal office, 7396476111 MANGALAGIRI : RR Towers, Near Old Bus Stand, 08645-233664
TENALI : Opp. Saibaba Temple Bose Road, 08644-226337, Gandhi Chowk, 08644-238827, 47 ONGOLE : Near Power Office, Prasanna Nilayam, Kurnool Road, 08592-282620, 282621, Old LIC Office Building, G.T. Road, Ramnager, 08592-282818
CHILAKALURIPET : Sai Karthik Citi Centre, G.T. Road, 9640755559, 9640855559 NARASARAOPET : Bank Street, Arundelpet, 08647-222559, 229559, PIDUGURALLA : Pillutla Road, 9182053174, AMARAVATHI : Main Road, Beside Church, 9182053161, PONNURU : G.B.C. Road, Beside Sajja Chandramouli Hospital, 7093335111 BAPATLA : College Road, Bapatla, 08643 - 220017 JAGGAYYAPETA : Kodhada Road, Jaggayyapeta, 9642559111, 7396476111